విజయవాడ
శనివారం,
21 ఫిబ్రవరి 2026
సంపుటి: 12, సంచిక: 52
వెల : 5/ పేజీలు : 12

# నినాదం

నిఖార్సైన జర్నలిజం



## వీపీఎస్ఎల్వీ–సీ62 వైఫల్యంపై విశ్లేషణ కమిటీ

కె.విజయరాఘవన్ అధ్యక్షతన కేంద్రం ఏర్పాటు

-2లో

Published From Vijayawada, Visakhpatnam, Tirupati

## సీఈఓలతో మోదీ భేటీ

### పలువురు దేశాధినేతలతో కూడా

ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం పలు టెక్నాలజీ, ఏఐ కంపెనీల సీఈఓలతో భేటీ అయ్యారు. 16 ఏఐ, డీప్‌టెక్ స్టార్టప్‌ల వ్యవస్థాపకులతో రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్నారు. కృత్రిమ మేధ సామర్థ్యాన్ని వ్యవసాయం, పర్యావరణ పరిరక్షణ, ఉన్నత విద్య తదితర రంగాల్లో మరింత సమర్థంగా వినియోగించుకునే మార్గాలపై వారితో చర్చించారు. వీటితో పాటు పలు అంశాలపై తమ వ్యూహాలు తదితరాలను సీఈఓలు ప్రధానితో పంచుకున్నారు.



-2లో




# క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

## అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ వర్సిటీ

- క్వాంటమ్ ఏఐ సెంటర్, టాలెంట్ హబ్ ఏర్పాటు
- విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీలు.. ప్రతి విద్యార్థికీ ఏఐ ట్యూటర్
- క్వాంటమ్, సైబర్ సెక్యూరిటీలో లక్ష మందికి శిక్షణ
- ఏఐ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఎంవోయూలు
- క్రియేటర్ ఎకానమీ సెంటర్‌గా ఏపీ.. యువ టెకీలు మా బలం
- సమ్మిట్‌లో దిగ్గజ పారిశ్రామికవేత్తలతో చంద్రబాబు భేటీ

ప్రపంచ భవిష్యత్ టెక్నాలజీ రంగంలో నవ్యాంధ్రను అగ్రగామిగా నిలబెట్టడమే లక్ష్యంగా హస్తిన వేదికగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. క్వాంటమ్ టెక్నాలజీ అనగానే ముందుగా ఆంధ్రప్రదేశ్ పేరే వినిపించేలా రాష్ట్రాన్ని క్వాంటమ్ ఏఐ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి**

అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్ నిర్మాణానికి ఇప్పటికే శంకుస్థాపన చేసిన రాష్ట్రప్రభుత్వం... దానికి జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తేవడానికి, రాష్ట్రంలో ఏఐ క్వాంటమ్ ఎకోసిస్టమ్‌ను పెంపొందించడానికి ఏడు కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఢిల్లీలో జరుగుతున్న ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో సీఎం చంద్రబాబు సమక్షంలో ఐబీఎం సహా వివిధ ప్రముఖ సంస్థలతో ఈ ఒప్పందాలు కుదిరాయి. అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్, అంతర్జాతీయ క్వాంటమ్ నిపుణులుగా తీర్చిదిద్దేందుకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ఉన్నత

- మిగతా 2వ పేజీలో

## ట్రంప్ టారిఫ్‌లు చెల్లవ్!

### అమెరికా సుప్రీంకోర్టు సంచలన తీర్పు.. అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ

- పన్ను విధింపు అధికారం కాంగ్రెస్‌దే
- రాజ్యాంగం అధ్యక్షుడికి ఆ అధికారమివ్వలేదు
- టారిఫ్‌లకు ఐఈఈపీఏ చట్టాన్ని వాడటం చెల్లదు

-6లో

రెండోసారి అధికారంలోకి వచ్చిన నాటినుంచీ ఎడాపెడా టారిఫ్‌లతో ప్రపంచ దేశాలన్నింటికీ వణుకు పుట్టించిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రపంచ దేశాలపై ఆయన విధించిన అధిక టారిఫ్‌లను, ప్రతీకార సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కొట్టేసింది.




## ఏఐ యుగంపనిలేని ప్రపంచం!

### ఏఐ వ్యవస్థలు, రోబోలతో భవిష్యత్తులు 90 ఉద్యోగాలు, ఉపాధికి కోత

-2లో

# వైసీపీ మహా అపచారం

## చెప్పులు, బూట్లు వేసుకుని శ్రీవారి పోస్టర్ల ప్రదర్శన

- అసెంబ్లీ ప్రాంగణంలోనే కాదు.. మండలిలోనూ ఇదే తీరు
- వాయిదా పడ్డాక పోస్టర్లు, ప్లకార్డులను లోపలే పడేసిన వైనం
- శ్రీవారి ఫొటోలు సభలోకి తేవడంపై అధికార కూటమి ఆగ్రహం
- విచక్షణ లేకుండా వాళ్ల నాయకుడు చెప్పినట్లు నడుచుకుంటున్నారు
- మంత్రి పయ్యావుల మండిపాటు.. చైర్మన్ వద్ద కూటమి నేతల నిరసన
- వారికి దేవుడంటే భయం, నమ్మకం లేవు
- స్వామి ఫొటోలు తేవడం తప్పేనన్న చైర్మన్
- బొత్సను పిలిపించి వివరణ కోరిన మోషెన్





తిరుమల లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడమే కాదు.. కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల శాసనమండలిలోనూ వైసీపీ ఎమ్మెల్సీలు అపచారానికి పాల్పడ్డారు. చెప్పులు, బూట్లు ధరించి.. శ్రీవారి పోస్టర్లు, ప్లకార్డులు ప్రదర్శించారు. మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ నేతృత్వంలో వైసీపీ సభ్యులు శుక్రవారం నల్ల కండువాలు, నల్లబాడ్జీలు ధరించి.. అసెంబ్లీ నాలుగో గేటు వద్దకు చేరుకున్నారు.

-6లో



## పాక్స్ సిలికాలోకి భారత్

### అరుదైన ఖనిజాల లభ్యతే లక్ష్యం

-2లో

- ఏఐ సమర్థ వినియోగం కూడా
- ఏకస్వామ్యానికి చెల్లు: అమెరికా.. చైనానుద్దేశించి వ్యాఖ్యలు

అమెరికా ఏర్పాటు చేసిన వ్యూహాత్మక పాక్స్‌సిలికా కూటమిలో భారత్ శుక్రవారం సభ్యదేశంగా చేరింది. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ ఇండియా ఇంపాక్ట్ సదస్సు ఇందుకు వేదికైంది. ఈ కార్యక్రమంలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖల మంత్రి అశ్వినీ వైష్ణవ్, అమెరికా ఆర్థిక శాఖ సహాయ మంత్రి జాకబ్ హెల్‌బర్గ్, భారత్‌లో అమెరికా రాయబారి సెర్గియో గోర్ పాల్గొన్నారు.

# జగన్ డైరెక్షన్‌లోనే!

## చెప్పులు వేసుకుని దేవుడి ఫొటోలను ప్లకార్డుల్లా ప్రదర్శిస్తారా?

- తమ విధానం ఇదేనని జగన్ చెబుతున్నారా?
- హిందువుల మనోభావాలు దెబ్బతీశారు.. క్షమాపణలు చెప్పాలి
- మంత్రులు పయ్యావుల, దుర్గేశ్, సవిత, ఎమ్మెల్సీ వీర్రాజు డిమాండ్

-6లో





-2లో

## నేడు శ్రీవారి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు

### మఠాధిపతులు, స్వామీజీలతో రౌండ్ టేబుల్ భేటీలు

**జూమ్ కాన్ఫరెన్సులో కూటమి నేతల నిర్ణయం**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి శాసనమండలిలో వైసీపీ సభ్యులు చేసిన మహాపచారంపై శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లోని వేంకటేశ్వరుడి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు చేయాలని కూటమి పక్షాలు నిర్ణయించాయి.

## సముద్ర భద్రతకు ఉమ్మడి కార్యాచరణ బృందాలు

### ఐవోఎన్ఎస్ సమావేశంలో నిర్ణయం

సింపోజియం అధ్యక్ష పదవి స్వీకరించిన భారత నేవీ చీఫ్

-2లో



# క్వాంటమ్.. కేరాఫ్ ఏపీ!

**(మొదటి పేజీ తరువాయి)**

విద్యాసంస్థల్లో ఏఐ అకాడమీల ఏర్పాటు, క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో లక్ష మంది యువతకు శిక్షణ... అంశాలపై ఒప్పందాలు కుదుర్చుకుంది. ఆ వివరాలు..

రాజధాని అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ ఏఐ యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటుపై నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఎన్ఐఈఎల్ఐటీ)తో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ క్యాంప్‌సలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నిధులు సమకూర్చుతుంది. 10 ఎకరాల భూమి, క్వాంటమ్ హార్డ్‌వేర్‌ను రాష్ట్రం సమకూర్చాల్సి ఉంటుంది. కార్యక్రమంలో కేంద్ర ఐటీ శాఖ కార్యదర్శి ఎస్.కృష్ణన్, ఎన్ఐఈఎల్ఐటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మదన్ మోహన్ త్రిపాఠి, కంట్రోలర్ జనరల్ డాక్టర్ అలోక్ త్రిపాఠి తదితరులు పాల్గొన్నారు. అమరావతిలో క్వాంటమ్ ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేసేందుకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ కంప్యూటింగ్ సెంటర్ (యూనీసీసీ)తో రాష్ట్రప్రభుత్వం అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. అమరావతి క్వాంటమ్ వ్యాలీలో ఈ ఏడాది చివరి నాటికి క్వాంటమ్ ఏఐ ఎక్స్‌లెన్స్ సెంటర్ ఏర్పాటు చేసేలా కార్యాచరణ రూపొందించుకోవాలని ఎంవోయూలో పేర్కొన్నారు. ఒప్పంద కార్యక్రమంలో యూఎన్ఐసీసీ డైరెక్టర్ సమీర్ చౌహాన్, ఆ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు. వాషింగ్టన్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ స్టెమ్, ఎంట్రపెన్యూర్‌షిప్ అండ్ రిసెర్చ్ (వైజర్) సంస్థ భాగస్వామ్యంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు టాలెంట్ హబ్‌ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. తాజా ఒప్పందంతో ఈ ఏడాది చివరి నాటికి 3.50 లక్షల మంది, 2027 నాటికి 6 లక్షల మందికి ఏఐ క్వాంటమ్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. భవిష్యత్తులో 35 లక్షల మందికి శిక్షణ ఇవ్వడమే ఈ ఒప్పంద లక్ష్యం. కాగా, ఏపీలోని 50కి పైగా ఉన్నతవిద్యా సంస్థలో ఏఐ అకాడమీలు, ఏఐ శాండ్ బాక్స్ ఏర్పాటు చేసేందుకు కాలిబో ఏఐ సంస్థతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. అలాగే క్వాంటమ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీలో వచ్చే 3-5 ఏళ్లలో రాష్ట్రంలోని లక్ష మంది యువతకు శిక్షణ ఇచ్చేలా రాష్ట్రప్రభుత్వం ఐబీఎంతో ఎంవోయూ కుదుర్చుకుంది. కార్యక్రమానికి ఐబీఎం ఇండియా ఎండీ సందీప్ పటేల్, ఆ సంస్థ దక్షిణాసియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కిషోర్ బాలాజీ, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్.. తదితరులు హాజరయ్యారు. ఐదంచెల 'స్వదేశీ ఏఐ స్టాక్' ఆధారంగా రాష్ట్ర స్థాయి ఏఐ టెక్ హబ్‌నిర్మించేలా భారత్‌జెన్, నెఎక్స్‌టీజెన్, ఐబీఎంతో రాష్ట్రప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా ప్రభుత్వంలోని వివిధ సంస్థలకు సేవలందించడంతోపాటు 22 భారతీయ భాషలను అనుసంధానించే ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. భారత్‌జెన్ సీఈవో రిషిబాల్, ప్రతినిధి రామకృష్ణన్, నెఎక్స్‌టీ జెన్ సీఈవో రాజగోపాల్, ఐబీఎం రిసెర్చ్ ల్యాబ్స్ డైరెక్టర్ అమిత్ సింఘీ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులకు ఏఐ ట్యూటర్ ఏర్పాటు అంశంపై ఐఐటీ మద్రాస్, బోధన్ ఏఐతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థుల కోసం ఏఐ ట్యూటర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేలా ఈ ఎంవోయూ కుదిరింది. ఈ ట్యూటర్ ఉపాధ్యాయులకు సహాయకారిగా ఉంటూ, విద్యార్థులకు వ్యక్తిగత శిక్షణ అందిస్తుంది.

# పాక్స్ సిలికాలోకి భారత్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20**

అరుదైన ఖనిజాలు, కృత్రిమ మేధ వినియోగానికి సంబంధించి విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం ఈ కూటమి ముఖ్యోద్దేశం. భారత్ నిర్ణయాన్ని అమెరికా స్వాగతించింది. మోదీ సర్కారు సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుందని హెల్‌బర్గ్ అభినందించారు. "అరుదైన ఖనిజ సరఫరా వ్యవస్థలపై ప్రస్తుతం కొందరి గుత్తాధిపత్యమే సాగుతోంది. ఇది ఆర్థిక ఒత్తిళ్లతో పాటు కొన్నిసార్లు బెదిరింపులకు కూడా దారి తీస్తోంది"అంటూ చైనా తీరును ఉద్దేశించి ఆయన ఆందోళన వెలిబుచ్చారు. "మా సన్నిహిత మిత్ర దేశాలు నిత్యం ఇలాంటి బ్లాక్‌మెయిలింగ్‌ల బారిన పడుతుంటే మేం చూస్తూ ఉండిపోవాల్సి వస్తోంది. అవి ప్రగతి కోసం తమ సార్వభౌమత్వాన్ని కూడా పణంగా పెట్టాల్సిన పరిస్థితులు తలెత్తాయి. ఈ దుస్థితిని నివారించడంలో సిలికా కూటమిది కీలక పాత్ర కానుంది. ఎందుకంటే ఆర్థిక భద్రతే దేశ భద్రత"అని అభిప్రాయపడ్డారు.

21వ శతాబ్దపు ఆర్థిక, సాంకేతిక ప్రపంచ క్రమాన్ని పాక్స్‌సిలికా కూటమి పునర్ నిర్వచిస్తుందని గోర్ జోస్యం చెప్పారు. భారత్ చేరికతో ఈ కీలక కూటమి మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. "కూటమిలో భారత్ చేరిక కేవలం లాంఛనప్రాయం కాదు. అది అత్యంత ఆవశ్యకమైన చర్య. అరుదైన ఖనిజాలు, ఏఐ రంగాల్లో ప్రత్యర్థులను సవాలు చేయగల అపారమైన నైపుణ్యం భారత్ సొంతం. కనుక టెక్నాలజీ రంగంలో భారత్, అమెరికా పరస్పర సహకారం అత్యంత కీలకం. రానున్న కొన్నేళ్లలో ఏఐ ఇన్నోవేషన్ తదితరాల్లో ఇది కీలక పాత్ర పోషించగలదు"అని ఆయన చెప్పారు. "ప్రత్యర్థులు నియమాలకు కట్టుబడతారని ఆశించడం అత్యాశే అవుతుంది. శాంతి సాధన బలం, శక్తి సామర్థ్యాలతోనే సాధ్యం. ఈ విషయం భారత్‌కూ బాగా తెలుసు"అని గోర్ పేర్కొన్నారు. "స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం మొదలుకుని పాక్స్‌సిలికా దాకా భారత్, అమెరికా పరస్పర సహకారానికి ఆకాశమే హద్దు. నేను రాయబారిగా ఉండే మూడేళ్ల కాలంలో ద్వైపాక్షిక సంబంధాలను సరికొత్త శిఖరాలకు చేర్చేందుకు కృషి చేస్తా"అని తెలిపారు. పలు అడ్డంకులను అధిగమించి, అపోహలను తొలగించుకుని మధ్యంతర వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని గుర్తు చేశారు.

పాక్స్‌సిలికా కూటమిలో చేరికను భారత్ తీసుకున్న కీలక నిర్ణయంగా కేంద్ర మంత్రి వైష్ణవ్ అభివర్ణించారు. ఏఐ, అరుదైన ఖనిజాల రంగంలో సురక్షిత భవితకు ఇది బాటలు పరుస్తుందని అభిప్రాయపడ్డారు. సెమీ కండక్టర్ రంగంలో భారత్ శక్తి సామర్థ్యాలను నానాటికీ మరింతగా పెంచుకుంటోందని గుర్తు చేశారు. "ప్రపంచంలోకెల్లా అత్యంత అధునాతన నానోమీటర్ చిప్స్‌ను భారత యువ ఇంజనీర్లే రూపొందిస్తున్నారు. సెమీ కండక్టర్ పరిశ్రమకు ప్రస్తుతం కనీసం 10 లక్షల మంది వృత్తి నిపుణులు అవసరం. భారత్‌కు అతి పెద్ద అవకాశమిది"అని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్స్, సెమీ కండక్టర్లు, కంప్యూటర్ చిప్స్ మొదలుకుని స్వచ్ఛ ఇంధనం, ఏరో స్పేస్, ఆటోమోటివ్, రక్షణ రంగాల్లో అరుదైన ఖనిజాల పాత్ర అత్యంత కీలకమన్నది తెలిసిందే. అయితే ప్రపంచవ్యాప్తంగా వాటి నిల్వలు ప్రస్తుతానికి చైనాలో మాత్రమే అపారంగా ఉన్నాయి. దాంతో ఆ ఖనిజాల ఉత్పత్తి, ఎగుమతులపై కొన్నేళ్లుగా ఆ దేశ గుత్తాధిపత్యమే సాగుతోంది. అరుదైన ఖనిజాల వెలికితీతలో చైనా ఎవరికీ అందనంత దూరంలో ఉంది. ఇప్పటిదాకా కనీసం 2.7 లక్షల టన్నుల ఖనిజాలను వెలికితీసినట్టు అంచనా. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ 57 వేల టన్నుల అరుదైన ఖనిజాలను దిగుమతి చేసుకుంటే అందులో చైనా వాటాయే ఏకంగా 97 శాతం! ఏఐ ఆధారిత ప్రపంచంలో కీలకమైన ఈ అరుదైన ఖనిజాల తవ్వకం, వెలికితీత, అభివృద్ధి, సరఫరాలపై అదుపు సాధించేవారిదే పై చేయిగా నిలవనుంది. దాంతో ఈ విషయంలో చైనా పెత్తనానికి చెక్ పెట్టడమే లక్ష్యంగా గత డిసెంబర్‌లో పాక్స్‌సిలికా కూటమిని అమెరికా ఏర్పాటు చేసింది. పాక్స్ అంటే శాంతి, సుస్థిరత, ప్రగతికి సూచిక. సిలికాన్‌కు సిలికా ముడి ఖనిజమన్నది తెలిసిందే. అరుదైన ఖనిజాలకు సంబంధించి సభ్యదేశాలన్నీ ఆధారపడదగ్గ సరఫరా వ్యవస్థను నిర్మించుకోవడమే దీని లక్ష్యం. ఆ ఖనిజాల గుర్తింపు, వెలికితీత, శుద్ధీకరణ, సరఫరా, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లలో వాటి వినియోగం... ఇలా అన్ని దశల్లోనూ కూటమి దేశాలు సమన్వయంతో పని చేయాలన్నది ఉద్దేశం. ఆస్ట్రేలియా, జపాన్, బ్రిటన్, దక్షిణ కొరియా, ఇజ్రాయెల్, నెదర్లాండ్స్, యూఏఈ, సింగపూర్, ఖతార్ ఇందులో సభ్యులుగా చేరాయి. భారత్‌లో ఏకంగా 85.2 లక్షల టన్నుల అరుదైన ఖనిజ నిక్షేపాలున్నట్టు అంచనా.

# ఏఐ యుగంపనిలేని ప్రపంచం!

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20**

సాఫ్ట్‌వేర్ కోడ్‌లు రాసేస్తోంది.. పాటలు పాడేస్తోంది.. చెప్పినట్టుగా వీడియోలు సృష్టిస్తోంది.. కోరినట్టుగా ఫొటోలనూ మార్చి ఇచ్చేస్తోంది.. మన సందేహాలకు సమాధా నాలూ ఇస్తోంది.. జస్ట్ ఇప్పుడే మొదలైంది.. మానవ జీవితంలో కొన్ని వేల ఏళ్లుగా వచ్చిన మార్పులు ఒక ఎత్తయితే.. కృత్రిమ మేధ (ఏఐ)తో రాబోతున్న జరగబోతున్న మార్పులు అంతకుమించి ఉండబోతున్నాయని కృత్రిమ మేధ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఇన్నాళ్లూ కొత్త ఆవిష్కరణలు వచ్చినప్పుడల్లా మనుషుల ఉద్యోగాల్లో, ఉపాధి తీరులో మార్పులు జరుగుతూ వస్తే... ఏఐ యుగంలో మాత్రం 90శాతం జనాభాకు అసలు ఉద్యోగాలు, ఉపాధి అనేదే లేకుండా పోతుందని కృత్రిమ మేధ రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ప్రజలకు రోజువారీ వ్యక్తిగత పనులు, నచ్చిన వ్యాపకాలు తప్ప మరేమీ ఉండవనీ అంటున్నారు. ఏ సంపాదనా లేకపోతే బతికేదెలా!? ఖర్చులకు డబ్బులు ఎలాగన్న సందేహాలు వస్తున్నాయి కదా!! దానికీ కొన్ని సూచనలు చేస్తున్నారు. రోజురోజుకు ఏఐ సామర్థ్యం మరింతగా పెరుగుతోంది. ఇప్పటికే చాలా వరకు ఆన్‌లైన్/కంప్యూటర్ ఆధారిత పనులన్నీ ఏఐ చేసేస్తోంది. పిల్లలకు హోంవర్క్‌లు చేసిపెట్టడం, వ్యాసాలు రాసిపెట్టడం నుంచి రోగుల వైద్య నివేదికలను విశ్లేషించి సమస్యను గుర్తించడం దాకా ఏఐ వినియోగం విస్తృతమైంది. చెప్పిన సూచనలకు అనుగుణంగా ఫొటోలు, వీడియోలు సిద్ధం చేసే చాట్‌జీపీటీ, గ్రోక్, గూగుల్ జెమినీ.. కావాల్సినట్టుగా పాటలు రూపొందించి పెట్టే 'సునో' యాప్.. ఇలా ఎన్నో వచ్చేశాయి. ఇక ఏఐకి రోబోలు జతకలిస్తే.. మనుషులు చేసే దాదాపు అన్ని పనులూ అవే చేస్తాయి. ఇప్పటికే రిసెప్షనిస్టులుగా, చాట్‌బోట్‌ల రూపంలో టెలీకాలర్లుగా, ఆటోమేటిక్ కార్ల డ్రైవర్లుగా, అమెజాన్ వంటి ఈ-కామర్స్ సైట్ల గోదాముల్లో సరుకులను సర్ది, ఆర్డర్లకు తగినట్టుగా తీసి ప్యాకింగ్‌కు సిద్ధం చేసే సిబ్బందిగా ఏఐ రోబోలు పనిచేస్తున్నాయి. కార్ల కంపెనీలు, ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ సంస్థలు తమ ఫ్యాక్టరీలలో రోబోలను వినియోగిస్తున్నాయి. మొత్తంగా భవిష్యత్తులో అత్యంత భారీ సంఖ్యలో ఉద్యోగాలు పోవడం ఖాయమని 'గాడ్ ఫాదర్ ఆఫ్ ఏఐ'గా గుర్తింపు పొందిన శాస్త్రవేత్త జెఫరీ హింటన్ స్పష్టం చేశారు. భవిష్యత్తులో వ్యవసాయం నుంచి అంతరిక్షం దాకా అన్ని పనులూ ఏఐ రోబోలతో చేసేస్తుందని, దీనితో మానవ సామాజిక, ఆర్థిక వ్యవస్థలు సమూలంగా మారిపోతాయన్నది నిపుణులు చెబుతున్న మాట. మనుషుల్లో ఇప్పుడున్న ధనిక, మధ్య తరగతి, పేదలు వంటి వర్గాలు మారిపోయి.. మూడు కొత్త వర్గాలు ఏర్పడుతాయని వారు స్పష్టంగా చెబుతున్నారు. ఒకటి అత్యంత సంపన్నమైన ఏఐ వ్యవస్థల యజమానులు.. రెండోది ఏఐ వ్యవస్థల నిర్వహణ, అభివృద్ధిని పర్యవేక్షించే మేనేజర్లు/ఇన్నోవేటర్లు.. మూడోది ఏఐ వల్ల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయి చేయడానికి ఏమీ లేకుండా ఉండిపోయే ప్రజలు. ఏఐ కారణంగా 90శాతం మంది జనాభాకు ఉద్యోగ, ఉపాధి అవకాశా లు లేకుండా పోతాయని యూకేకు చెందిన ప్రముఖ ఏఐ శాస్త్రవేత్త స్టూవర్ట్ రస్సెల్, సన్ మైక్రోసిస్టమ్స్ సహవ్యవస్థాపకుడు వినోద్ ఖోస్లా ఇటీవలే పేర్కొన్నారు. భారీగా సంపద పోగుపడిన 'ఏఐ' యజమానులే పవర్‌ఫుల్‌గా మారిపోతారని.. ప్రభుత్వాలనూ శాసించగలిగే పరిస్థితులు ఉంటాయని స్టూవర్ట్ రస్సెల్ తదితర ఏఐ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తమ చేతిలోని ఏఐ వ్యవస్థలను అడ్డుపెట్టుకుని.. సరుకుల ఉత్పత్తి నుంచి సేవల వరకు అన్నింటినీ నియంత్రించగలిగే పరిస్థితి ఉంటుందని అంటున్నారు. అందువల్ల ఏఐ విషయంలో స్పష్టమైన నియంత్రణ, పకడ్బందీ మార్గదర్శకాలపై ఇప్పుడే దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు. భవిష్యత్తులో ఏఐ వ్యవస్థల యాజమాన్యమే కీలకమని, దానిపై ప్రభుత్వాలు, సంస్థలు దృష్టిపెట్టాలని మైండ్ నెట్‌వర్క్ ఏఐ సంస్థ సీఈవో క్రిస్టియర్ పుసెట్రీ సూచిస్తున్నారు. భారీగా పెట్టుబడులు పెట్టి ఏఐ వ్యవస్థలు, రోబోలను ఏర్పాటు చేసే యజమానులు మొదటి వర్గంగా ఉంటారు. ప్రస్తుతం మనుషులు చేస్తున్న ఉద్యోగాలు, పనులన్నీ ఏఐ, రోబోలే చేస్తాయి. పరిశ్రమల్లో కార్మికులు ఉండరు. వ్యవసాయం, భవనాల నిర్మాణం వంటి శ్రమ ఆధారిత పనులు, ఇంటి పనులు, వంట పనులు.. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, టీచర్లు, లాయర్లు, జర్నలిస్టులు, డ్రైవర్లు, కస్టమర్ కేర్ సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు, మార్కెటింగ్ ఉద్యోగులు, గ్రాఫిక్ డిజైనర్లు, కంటెంట్ క్రియేటర్లు, హెచ్‌ఆర్ ఉద్యోగులు, డెలివరీ బాయ్స్.. ఇలా అన్ని పనులనూ ఏఐ రోబోలు చేస్తాయి. ఆ పనులకు సంబంధించిన ఆదాయమంతా 'ఏఐ' వ్యవస్థల యజమానుల చేతికే వెళుతుంది. ఏఐ వ్యవస్థల నిర్వహణ కోసం యజమానుల కింద పనిచేసే ఉద్యోగులు, ఏఐ వ్యవస్థలను మరింత మెరుగుపరిచే, సరికొత్త ఆవిష్కరణలు చేసే ఇన్నోవేటర్లు, ఏఐ చేయలేని భావోద్వేగాలతో ముడిపడిన పనులు చేసేవారు.. రెండో వర్గంగా ఉంటారు. వీరికి పని ఉంటుంది. అందుకు తగిన ఆదాయమూ ఉంటుంది. మొత్తంగా జనాభాలో కేవలం 3% యజమానులు, మరో ఏడెనిమిది శాతం ఉండే మేనేజర్లు/ఇన్నోవేటర్ల వద్దే మొత్తం సంపదలో 99% సంపద కేంద్రీకృతమై ఉంటుంది. అన్ని పనులూ ఏఐ వ్యవస్థలు, రోబోలే చేస్తుంటే.. చేయడానికి ఉద్యోగం, ఉపాధి ఏమీ లేకుండా ఉండిపోయే ప్రజలు 90శాతం ఉంటారు. వారికి దాదాపుగా ఎలాంటి ఆదాయమూ ఉండదు. ప్రభుత్వం అందించే ఆర్థిక సాయంపైనే ఆధారపడాల్సి ఉంటుంది.

### సంపద సృష్టి ఎలా? పంపిణీ ఎలా?

మనుషులకు ఉద్యోగాలు, ఉపాధి పోయినా.. ఆ పనులన్నీ ఏఐ వ్యవస్థలు, రోబోలతో జరిగిపోతూనే ఉంటాయి. పంటల నుంచి పరిశ్రమల్లో ఉత్పత్తుల దాకా ఇంకా మెరుగ్గా కొనసాగుతూ ఉంటాయి. వాటి నుంచి పన్నుల రూపంలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతూనే ఉంటుంది. ఇప్పటికంటే ఇంకా ఎక్కువగా సంపద సృష్టి జరుగుతూనే ఉంటుంది. ఆ సంపద అంతా 'ఏఐ' యజమానుల చేతిలోకే వెళుతుంది. కొంత ప్రభుత్వానికి చేరుతుంది. పని ఉండని ప్రజలకు ఖర్చుల కోసం 'యూబీఐ (యూనివర్సల్ బేసిక్ ఇన్‌కం-అందరికీ కనీస వేతనం)' కింద ప్రభుత్వమే ప్రతినెలా డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని ఏఐ నిపుణులు చెబుతున్నారు. వ్యవస్థలు కొనసాగాలంటే వినియోగం ఉండాలని, ప్రభుత్వమే డబ్బులు ఇచ్చి ఆ వినియోగాన్ని కొనసాగించక తప్పదని స్పష్టం చేస్తున్నారు. 'ఏఐ' యజమానులపై ఆదాయ పన్నును, ఏఐ వ్యవస్థలు చేసే ఉత్పత్తులపై పన్నులను పెంచడం ద్వారా 'యూబీఐ' కోసం అవసరమైన సొమ్మును ప్రభుత్వం సమకూర్చుకోవచ్చని అంటున్నారు.

### ఐదేళ్లలో 80 కోట్ల ఉద్యోగాలకు కోత!

ఏఐ కారణంగా 2030 నాటికల్లా ప్రపంచవ్యాప్తంగా 30 కోట్ల మందికి ఉద్యోగాలు పోతాయని ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ గోల్డ్‌మన్ సాక్స్ అంచనా వేయగా, ఆ సంఖ్య 80 కోట్లకుపైగానే ఉంటుందని కన్సల్టింగ్ సేవల కంపెనీ మెకిన్సీ పేర్కొంది. ఆ ఉద్యోగుల స్థానంలో ఏఐని వినియోగించడం వల్ల కంపెనీల ఉత్పాదకత, లాభాలు 14శాతం వరకు పెరిగే అవకాశం ఉందని అంచనా వేశాయి.

बैंक ऑफ़ इंडिया
Bank of India
Relationships beyond banking

**చెన్నై మెయిన్ బ్రాంచ్,**
"స్టార్ హౌస్", 1వ అంతస్తు, నెం.30, ఎర్రబాలు స్ట్రీట్, చెన్నై-600 001. ఫోన్ నెం.66777461/468/462/508.
ఇ-మెయిల్ : AssetRecovery.Chennai@bankofindia.co.in

**డిమాండ్ నోటీసు** సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు

బ్యాంక్ వారు సెక్షన్ 13(2)తో క్రింద డిమాండ్ నోటీసు **తేది : 11.02.2026**న రుణగ్రహీతలు/ హామీదారులకు జారీ చేసినారు. మరియు అది క్లెయిం చేయకుండా తిరిగి వచ్చినది. రుణగ్రహీతలు/ హామీదారు డిమాండ్ నోటీసు స్వీకరించకుండా తప్పించుకుంటున్న కారణంగా SARFAESI రూల్స్ ను అనుసరిస్తూ ఈ డిమాండ్ నోటీసు ప్రచురించబడుతున్నది.

**రుణగ్రహీత & హామీదారు పేరు మరియు చిరునామా: 1) మెస్సర్స్ అగ్రోక్రాఫ్ట్స్ స్పైసెస్ ప్రైవేట్ లిమిటెడ్(రుణగ్రహీత),** నమోదిత కార్యాలయం : డి.నెం.25-16-180 & 181, మిర్చి యార్డ్ రోడ్, తిరుపతమ్మ దేవాలయం దగ్గర, పాత జిటి రోడ్, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522 004. **2) మెస్సర్స్ అగ్రోక్రాఫ్ట్స్ స్పైసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (గోడౌన్ అడ్రస్)** పీనట్ హౌస్, నెం.1/215, పొన్నేరి హై రోడ్, కడపక్కం గ్రామం, చెన్నై-600 103. **3) శ్రీ శరవణన్ ఎల్ (హామీదారు/ తనఖాదారు) తండ్రి లోకసుందరం,** నెం.45, భారతి అవెన్యూ, ఇంజంబాక్కం, కాంచీపురం - 600 115. **4) శ్రీమతి భవాని భర్త శరవణన్,** నెం.45, భారతి అవెన్యూ, ఇంజాంభక్కం కాంచీపురం-600115. **5) మెస్సర్స్ అగ్రోక్రాఫ్ట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్,** పీనట్ హౌస్, పాత నం. 580, కొత్త నెం.484, అన్నా సాలై, టేనాంపేట్, చెన్నై 600 018. **6) శ్రీ ప్రభాకరన్ తండ్రి ఆదికేశవులు,** నెం.1/2, వీర పెరుమాళ్ స్ట్రీట్, ట్రిప్లికేన్, చెన్నై- 600 005. **7) శ్రీ సంసుకాని తండ్రి కమల్ పిచ్చై,** నెం.25/11, నెహ్రూ హై రోడ్, బి.వి. నగర్, నంగనల్లూర్, చెన్నై -600 061.

| సదుపాయ స్వభావం | మంజూరు పరిమితి | మొత్తం బకాయిలు | ఎన్‌పిఏ తేది |
|---|---|---|---|
| Export Packing Credit 800082610000027 | రూ. 2,84,00,000/- | రూ.2,83,56,053/- + 31.01.2026 నుండి వడ్డీ. | 02.02.2026 |

ప్రస్తుత బకాయి : రూ.2,83,56,053/- (రూపాయలు రెండు కోట్ల ఎనభై మూడు లక్షల యాభై ఆరు వేల యాభై మూడు మాత్రమే) (నోటీసు తేదీ వరకు ఒప్పంద బకాయిలు) 31.01.2026 నుండి 8.10% అదనపు వడ్డీతో పాటు నెలవారీ వాయిదాతో మరియు బ్యాంకు ద్వారా చేయబడిన అన్ని ఖర్చులు, ఛార్జీలు మరియు ఖర్చులతో కలిపి చెల్లించవలెను. ఈ రుణగ్రహీత వాహనం - TN 09-DX-0999 కొనుగోలు చేయడానికి రూ.60.00 లక్షల కారు రుణాన్ని కూడా పొందినారు మరియు ప్రస్తుత బకాయి రూ.51,96,795/- + 10.01.2026 నుండి తదుపరి వడ్డీ. కారు రుణ బకాయిలను తిరిగి పొందడానికి, రుణ పత్రాలలో తనఖా నిబంధనను ఉపయోగించి వాహనాన్ని స్వాధీనం చేసుకుని విక్రయించాలని బ్యాంక్ నిర్ణయించింది. అందువల్ల, పేర్కొన్న మొత్తాన్ని ఈ నోటీసులో చేర్చలేదు.

**ఆస్తి వివరాలు :** ముథియాల్‌పేట గ్రామంలోని బ్లాక్ నెం.43, R.S.No.4881లో ఉన్న గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకమైన ఓపెన్ కార్ పార్కింగ్ ప్రాంతంతో, O.S.No.824, C.C.No.452లో సూచించబడిన, పాత తలుపు నం.45/34, కొత్త తలుపు నం.93/94 (కార్పొరేషన్ ఆస్తి పన్ను డిమాండ్ కార్డ్ ప్రకారం పాత తలుపు నం.45/34, కొత్త తలుపు నం.93/34), ఆర్మేనియన్ స్ట్రీట్, జార్జ్ టౌన్, చెన్నై - 600 001లోని "ఎస్.ఎం.ప్లాజా" వద్ద 2వ అంతస్తులో ఉన్న, సాధారణ ప్రాంతంతో సహా 1547 చదరపు అడుగుల ప్లింత్ ఏరియాతో కూడిన ఆఫీస్ రూమ్ నంబర్లు 1, 2 & 3కు సంబంధించిన, మొత్తం 3 గ్రౌండ్‌లు మరియు 217 చదరపు అడుగుల విస్తీర్ణం (అంటే 7417 చదరపు అడుగులు)లో 8.04/350వ (170.37 చదరపు అడుగులు) సమాన తనఖా యావత్తు. **మరియు మొత్తం భూమి సరిహద్దులు :** ఉత్తరం : R.S.No.4880 కలిగిన ఆస్తి, దక్షిణం : R.S.No.4886, 4887 & 4888 కలిగిన ఆస్తి, తూర్పు : R.S.No.4883/1, 4882/2 మరియు 4882/3 కలిగిన ఆస్తి, పడమర : ఆర్మేనియన్ వీధి **మరియు ఆఫీస్ గది సరిహద్దులు :** ఉత్తరం: కామన్ వరండా, దక్షిణం: కొత్త డోర్ నెం.93/94, పాత డోర్ నెం.45/34, ఆర్మేనియన్ స్ట్రీట్‌లో అందుబాటులో ఉన్న ఓపెన్ స్పేస్ మరియు R.S.Nos.4886, 4887 & 4888 ఉన్న ఆస్తులు, తూర్పు: సాధారణ లాబీ & స్టైయిర్ కేసు, పడమర : ఆర్మేనియన్ స్ట్రీట్ & ఆర్మేనియన్ స్ట్రీట్‌లో అందుబాటులో ఉన్న ఓపెన్ స్పేస్‌లో కొత్త డోర్ నెం.93/94, పాత డోర్ నెం. 45/34. జాయింట్ I నార్త్ చెన్నై సబ్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ మరియు చెన్నై నార్త్ రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్‌లో ఉన్నది. **ఆస్తి శ్రీ ఎల్. శరవణన్** కు చెందినది.

పైన చూపిన తేదీ నాటికి సంబంధిత రుణ ఖాతాకు సంబంధించి చెప్పబడిన మొత్తం చెల్లించవలసి ఉందని తేలినందున, పైన చూపిన విధంగా మొత్తం మొత్తాన్ని సంబంధిత రుణగ్రహీతలందరికీ చెల్లించాలని రుణగ్రహీతల-హామీదారులకు నోటీసు ఇవ్వబడింది. భవిష్యత్తులో వడ్డీ మరియు చెల్లింపు తేదీ వరకు చెల్లించదగిన ఇతర మొత్తాలతో కలిపి మొత్తం మొత్తాన్ని చెల్లించకపోతే, పైన వివరించిన విధంగా ఆస్తులపై భద్రతా వడ్డీని అమలు చేయడానికి బ్యాంక్ ఆఫ్ ఇండియా తగిన చర్య తీసుకోవలసి ఉంటుందని స్పష్టం చేయబడింది. చట్టం ప్రకారం చెప్పబడిన ఆర్థిక విషయాల యొక్క రుణగ్రహీతల/ హామీదారులకు వ్యతిరేకంగా బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అందుబాటులో ఉన్న హక్కులు మరియు పరిష్కారాలకు పక్షపాతం లేకుండా ఈ ప్రచురణ చేయబడిందని గమనించండి, పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(13) ప్రకారం, పైన పేర్కొన్న భద్రతను పారవేయడం లేదా వ్యవహరించడం లేదా సెక్యూర్డ్ ఆస్తిని అమ్మకం, లీజు, లైసెన్స్, బహుమతి, తనఖా లేదా ఇతరత్రా బదిలీ చేయడం నుండి మీరు నిరోధించబడ్డారు/ నిషేధించబడ్డారని గమనించండి.

తేది : 11.02.2026, ప్రదేశం : చెన్నై — అధీకృత అధికారి, బ్యాంక్ ఆఫ్ బరోడా





...రస్పర సహకారంపై ఉమ్మడి కార్యాచరణ బృందాలను ఏర్పాటు చేయాలని హిందూ మహాసముద్ర నావల్ సింపోజియం (ఐవోఎన్ఎస్) సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. విశాఖలో ఐఎఫ్ఆర్, మిలాన్, సింపోజియం పేరిట నిర్వహిస్తున్న ప్రపంచ స్థాయి కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం తొమ్మిదో ఐవోఎన్ఎస్ సమావేశం ఓ హోటల్‌లో జరిగింది. దీనికి హిందూ మహాసముద్ర తీర దేశాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న 33 దేశాల నావికాదళ అధిపతులు, సముద్ర భద్రతా సంస్థల ఉన్నతాధికారులు హాజరయ్యారు. అట్లాంటిక్ నుంచి పసిఫిక్ వరకు విస్తరించిన హిందూ మహాసాగర ప్రాంతంలో సముద్ర సహకారం, భద్రతను బలోపేతం చేయడమే లక్ష్యంగా పనిచేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఒమన్ ఐవోఎన్ఎస్ వర్కింగ్ గ్రూపులో చేరగా, సారూప్యత కలిగిన నావికాదళాల సంఖ్య పెరగడాన్ని సింపోజియం స్వాగతించింది. ఈ సింపోజియానికి అధ్యక్ష పదవిని భారత్ చేపట్టింది. రాయల్ నేవీ నుంచి ఐవోఎన్ఎస్ అధ్యక్ష పదవిని భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్‌కుమార్ త్రిపాఠి స్వీకరించారు. అధ్యక్ష బాధ్యతను భారత్ సమర్థంగా నిర్వర్తించేందుకు అందరూ సహకరించాలని, ఐవోఎన్ఎస్ బలోపేతానికి శక్తివంచన లేకుండా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. ఈ బాధ్యతలతో హిందూ మహాసముద్ర ప్రాంతంలో సాగర సుస్థిరతకు ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. 16 ఏళ్ల తర్వాత తిరిగి మళ్లీ భారత్‌కు ఐవోఎన్ఎస్ అధ్యక్ష పదవి దక్కింది. 2008 నుంచి 2010 వరకు ప్రారంభ అధ్యక్ష పదవిని చేపట్టిన భారత్, ఇప్పుడు వృత్తిపరమైన సముద్ర సహకారం కోసం ఈ వేదికను ముందుకు తీసుకెళ్తుందని దినేశ్‌కుమార్ హామీ ఇచ్చారు. అనంతరం సభ్య నావికాదళాల పరస్పర సహకారానికి, సమాచార మార్పిడికి భారత నావికాదళం మెరుగుపరిచిన ఐవోఎన్ఎస్ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. దీనిలో ఫిలిప్పీన్స్‌ను పరిశీలక దేశంగా చేర్చారు. ఐవోఎన్ఎస్ మారిటైమ్ ఎక్సర్‌సైజ్ (ఐఎంఈఎక్స్) నిర్వహణతో పాటు నావికాదళాలు, సముద్ర భద్రతా సంస్థల సిబ్బంది భాగస్వామ్యంతో 'మహాసాగర్' లక్ష్యాలను చేరుకునేలా భారత్ శక్తిమేర కృషి చేస్తుందని త్రిపాఠి వివరించారు.

# నేడు శ్రీవారి ఆలయాల్లో పూజలు, సంప్రోక్షణలు

**అమరావతి, ఫిబ్రవరి 20**

దీనిపై ప్రజల్లోకి వెళ్లాలని.. పార్లమెంటు నియోజకవర్గ కేంద్రాల్లో కూటమి నేతలు విలేకరుల సమావేశాలు నిర్వహించి దేవదేవుడికి జరిగిన అపచారాన్ని వివరించాలని.. ఇదే సమయంలో మఠాధిపతులు, స్వామీజీలతో రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులు కూడా నిర్వహించాలని నిశ్చయించాయి. వైసీపీ సభ్యుల తీరుపై చర్చించేందుకు శుక్రవారం సాయంత్రం కూటమి పక్షాల మంత్రులు, నేతలతోపాటు పార్టీ అధ్యక్షులు జూమ్ కాన్ఫరెన్సు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు లోకేశ్, అచ్చెన్నాయుడు, అనిత, అనగాని సత్యప్రసాద్ తదితరులు.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ సోమువీర్రాజు., జనసేన మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. దేవదేవుడి బొమ్మతో వైసీపీ చేసిన రాజకీయం బూమరాంగ్ అయిందని రాజకీయ వర్గాలు అంటున్నాయి. చెప్పులు, బూటు కాళ్లతో స్వామి పోస్టర్లు పట్టుకుని ప్రదర్శన చేయడంపై భక్తుల నుంచీ ఆగ్రహం వ్యక్తం కావడంతో జగన్ అండ్ కో ఆత్మరక్షణలో పడ్డారని చెబుతున్నాయి. లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన వ్యవహారంలో వైసీపీ నేతలు కూరుకుపోయారని.. దీనినుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు హెరిటేజ్ సంస్థను ఇరికించడానికి చేసిన ప్రయత్నాలు ఘోరంగా దెబ్బతినడం.. ఢిల్లీ హైకోర్టు జగన్ రోత మీడియాపై ఆగ్రహం వ్యక్తంచేయడంతో ఎదురుదాడికి యత్నించి భంగపడ్డారని స్పష్టం చేస్తున్నాయి.

# నేడే భారీస్థాయిలో ఆర్గానిక్ రైతోత్సవం

- అన్నదాతలు, ఔత్సాహికులు సద్వినియోగం చేసుకోండి
- కార్యక్రమం విజయవంతానికి సమష్టిగా కృషిచేద్దాం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఫిబ్రవరి 20**

ఈ నెల 21వ తేదీ శనివారం ఎ.కొండూరు మండలం, కృష్ణారావుపాలెంలో భారీస్థాయిలో ఎన్టీఆర్ జిల్లా సేంద్రియ మేళా-ఆర్గానిక్ రైతోత్సవం జరగనుందని.. అన్నదాతలు, ప్రకృతి వ్యవసాయ ఔత్సాహికులు పెద్దఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ కోరారు. ఈ నెల 21న కృష్ణారావుపాలెం, 22వ తేదీన విజయవాడలో ఎన్టీఆర్ ఆర్గానిక్ రైతోత్సవం జరగనున్న నేపథ్యంలో వీటికి చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం.. జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి రెవెన్యూ, ప్రకృతి వ్యవసాయం, ఉద్యాన, పశుసంవర్ధక తదితర సమన్వయ శాఖల అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయంపై విస్తృత అవగాహన కల్పించడంతో పాటు రైతులకు సామర్థ్య అభివృద్ధి, శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. ఈ మేళాలో సేంద్రియ ఉత్పత్తుల ప్రదర్శన, విక్రయ స్టాళ్లు కూడా ఉంటాయని, సేంద్రియ సాగుకు అవసరమైన ఉత్పాదితాల ప్రదర్శన ఉంటుందన్నారు. రైతు--నిపుణుల పరస్పర చర్చా వేదికల ద్వారా సందేహాల నివృత్తితో పాటు మేధోమథనానికి అవకాశం కల్పించినట్లు వివరించారు. ఇదేవిధంగా ప్రకృతి వ్యవసాయ రైతులు, వినియోగదారులు, సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే లక్ష్యంతో ఈ నెల 22వ తేదీన విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలోనూ ప్రకృతి వ్యవసాయ మేళాను నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. రైతులు పండించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మంచి ధర లభించేలా మార్కెటింగ్ లింకేజీలు ఏర్పాటు చేయడంతో పాటు ఎంపోయూలపై అవగాహనతో పాటు అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించి, మంచి ఫలితాలు వచ్చేలా అధికారులు సమన్వయంతో కృషిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

# రోగులకు నాణ్యమైన సేవలు అందాల్సిందే

- ఈ విషయంలో రాజీకి తావులేదు
- సంతృప్తికర వైద్య సేవల్లో జీజీహెచ్ ముందుండాలి
- న్యూ జీజీహెచ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ
- రోగులతో మాట్లాడి అభిప్రాయాలుతెలుసుకున్న కలెక్టర్



**విజయవాడ, ఫిబ్రవరి 20**

(ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ శుక్రవారంరాత్రి విజయవాడలోని న్యూ జీజీహెచ్‌ను ఆకస్మికంగాతనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, శుభ్రత, ఔషధాల లభ్యత, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలు వంటి అంశాలను సమగ్రంగాపరి శీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎటువంటి రాజీ ఉండకూడదని, ప్రభు త్వ ఆసుపత్రులపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకోవడంమన బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి రోగికిసమయానుకూలంగా నాణ్యమైన చికిత్స అందా లనిస్పష్టం చేశారు. ఆసుపత్రిలోని అవుట్ పేషెంట్ విభాగం(ఓపీ), ఇన్ పేషెంట్ వార్డులు, ఎమర్జెన్సీ విభాగం,సూపర్ స్పెషాలిటీ బ్లాక్, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు, ఔషధపంపిణీ కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. రోగులతోనేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బందికి సేవల మెరుగుదలపై సూచనలు ఇచ్చారు. ప్రత్యేకంగా పారిశుధ్యంపై శ్రద్ధ పెట్టాలని ఆదేశించారు. అవసరమైన మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రోగులు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాలని సూచించారు. అత్యవసర సేవలు 24 గంటల పాటు సమర్థవంతంగా అందేలా ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఆసుపత్రిలో సేవలు పొందే ప్రతి ఒక్కరూ సంతృప్తిగా వెళ్లేలా చూడటం మన ప్రధాన లక్ష్యమని తెలిపారు. సంతృప్తికర వైద్య సేవలందిం చడంలో జీజీహెచ్ రాష్ట్రంలోనే ముందు వరుసలో నిలవాలని, ప్రతి విభాగం బాధ్యతాయుతంగా పనిచేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు, సంబంధిత విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలపై అవగాహన



**ఆగిరిపల్లి, ఫిబ్రవరి 20** నూజివీడు డీఎస్పీ కె.వి.వి.ఎన్.వి. ప్రసాద్ ఆదేశాలమేరకు సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మాదకద్రవ్యాలవినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ఆగిరిపల్లిలోఅవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఆగిరిపల్లి బస్ స్టాండ్ వద్ద నూజివీడురూరల్ సీఐ కె. రామకృష్ణ, ఆగిరిపల్లి ఎస్ఐ శుభ శేఖర్ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కె.రామకృష్ణ, ఎస్ఐ శుభ శేఖర్ ప్రజలను ఉద్దేశించిమాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగాఉండాలని సూచించారు. సోషల్ మీడియా వేదికలైనఫేస్‌బుక్, ట్విట్టర్, జీమెయిల్ వంటి ఖాతాలనుఅవసరమైన మేరకే ఉపయోగించుకోవాలని, వ్యక్తిగతవివరాలు, ఫోటోలు బహిరంగంగా పోస్ట్ చేయకూడదనిహెచ్చరించారు. అపరిచితుల నుంచి వచ్చే లింకులు,సందేశాలు, యాప్‌లను ఓపెన్ చేయడం వల్ల గోప్య సమాచారం దోపిడీకి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. బ్యాంకు అధికారులు లేదా ఇతర అధికారులమని చెప్పిఓటీపీ అడిగినప్పుడు పూర్తిగా ధృవీకరించకుండా వివరాలు వెల్లడించకూడదని సూచించారు. ఓటీపీ తెలియజేసిన వెంటనే ఖాతాల్లోని నగదు సైబర్ నేరగాళ్లు దోచుకునే అవకాశముందని హెచ్చరించారు. మహిళలు, బాలికల రక్షణకు సంబంధించిన పోక్సో చట్టం కింద నేరాలకు కఠిన శిక్షలు ఉంటాయని, మాదకద్రవ్యాలను వినియోగించడం, కలిగి ఉండటం, విక్రయించడం, రవాణా చేయడం వంటి చర్యలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమ చుట్టుపక్కల జరిగే అన్యాయాలు లేదా అసాంఘిక కార్యకలాపాలపై సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని పోలీస్ అధికారులు స్పష్టం చేశారు. ప్రజలు స్వయంగా అవగాహన పెంపొందించుకుని తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ విషయాలను తెలియజేయాలని పోలీసులు సూచించారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ సరైన వేదిక

- మంత్రి కొలుసు పార్థసారథి



**నూజివీడు, ఫిబ్రవరి 20**

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని అధికారులు అత్యంత బాధ్యతతో పరిశీలించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. రాష్ట్ర మంత్రి ఆదేశాల మేరకు నేడు నూజివీడు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి వచ్చిన ప్రజల నుంచి అధికారులు అర్జీలు స్వీకరించి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. కొన్ని అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారం చూపాలని సంబంధిత కింది స్థాయి అధికారులకు సూచించారు. మొత్తం 23 అర్జీలు స్వీకరించగా, వాటిలో రెవెన్యూ 10, క్రైమ్ 1, విద్యుత్ 1, పంచాయతీరాజ్ 2, పింఛన్లు 5, ఆర్టీసీ 1, హౌసింగ్ 3 ఉన్నాయి. సంబంధిత శాఖల అధికారులు సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరలో పరిష్కార మార్గాలు చేపడతామని అర్జీదారులకు భరోసా ఇచ్చారు. ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్‌లో ఫ్యాన్సీ షాపుకు అనుమతి తీసుకుని టైర్ల దుకాణం నడుపుతున్నారని గోపి ఫిర్యాదు చేయగా, అది నిబంధనలకు విరుద్ధమని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. సీతారాంపురం గ్రామా నికి చెందిన కె. శ్రీనివాసు తమ ఇంటికి కొందరు వచ్చి దౌర్జన్యం చేస్తున్నారని, రక్షణ కల్పిం చాలని విజ్ఞప్తి చేశా రు. వెంకటయ్యపాలెంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని గ్రామస్తులు ఫిర్యాదు చేయగా, పూడికలు తొలగించి సమస్యను త్వరలో పరిష్క రిస్తామని అధికా రులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి వర్చువల్‌గా మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని, ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలు తెలుసుకోవడం ద్వారా వేగవంతమైన పరిష్కారాలు సాధ్యమవుతాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు క్రమం తప్పకుండా ప్రజా దర్బార్‌లు నిర్వహిం చడం ద్వారా రికార్డు స్థాయిలో సమ స్యలు పరిష్కాం మవుతున్నాయని చెప్పారు. అధికారులు అంకితభావంతో పనిచేసి వచ్చిన ప్రతి అర్జీని భద్రపరచి, ఒక్కొక్కటిగా పరిష్కరించాలని, పరిష్కారం కాలేనివాటికి కారణాలను అర్జీదారులకు స్పష్టంగా తెలియజేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మండల ప్రముఖులు, కూటమి నాయకులు, నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి ప్రజలు పాల్గొన్నారు.



## డొక్కా సీతమ్మ సేవలు ఆదర్శం

### ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి 58వ డివిజన్‌లో ఘనంగా అన్నదానం

**విజయవాడ, ఫిబ్రవరి 20**

సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్‌లో డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటుపల్లి విజయ కుమారి మాట్లాడుతూ, తమ కార్యక్రమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న దాతలు, స్నేహితులు, ట్రస్ట్ సభ్యులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. డొక్కా సీతమ్మ గారి సేవా స్ఫూర్తి తమకు ప్రేరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఆమె చేసిన సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శమని అన్నారు. ఆమె పేరుతో నడుస్తున్న ఈ ట్రస్ట్‌ను దేవాలయంలా భావిస్తున్నామని, స్వయంగా వడ్డించి ఆకలితో ఉన్నవారి పొట్ట నింపడం తమకు అపారమైన ఆనందాన్ని ఇస్తుందని తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమం నిత్యంగా కొనసాగించాలని తమ సంకల్పమని వెల్లడించారు. తమకు అండగా ఉన్న సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోండా ఉమామహేశ్వరరావుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షురాలు సంసాని విజయలక్ష్మి, ఉపాధ్యక్షురాలు గుబ్బల జ్యోతిశ్వరి, ప్రధాన కార్యదర్శి అవుటుపల్లి శ్రీనివాస్, కోశాధికారి యర్రోజు అభిలాష్, పల్ల ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## అనితాజయరామిరెడ్డి కుమార్తె వివాహానికి హాజరైన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి



**వికోట, ఫిబ్రవరి 20**

చిత్తూరు జిల్లా,వికోట మండలం కొంగాటం గ్రామ పంచాయతీకి చెందిన మాజీ సిల్క్ బోర్డ్ డైరెక్టర్ , మాజీ రెస్కో ఛైర్మన్ ఆర్ హెచ్ జయరామిరెడ్డి, సర్పంచ్ అనితాల ద్వితీయ కుమార్తె వివాహ వేడుకకు మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నేత నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. తమిళనాడులోని కృష్ణగిరి సమీపంలోని మాన్వి రిసార్ట్స్ లో జరిగిన ఈ వివాహ శుభకార్యానికి ఆంధ్ర , తమిళనాడులనుంచి పెద్ద ఎత్తున ప్రముఖులు హాజరయ్యారు.జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు , మాజీ ఎంఎల్ఏ సతీమణి పావని వెంకటేగౌడ, వికోట మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసులు , గోపిరెడ్డి ,ఎంపీపీ యువరాజ్, పలువురు వికోట మండల ప్రజాప్రతినిధులు ,ప్రజలు పాల్గొన్నారు.

## నేడు మండలంలో "కరెంటు కోత"

**వి.కోట, ఫిబ్రవరి 20**

పలమనేరు విద్యుత్ డివిజన్ పరిధిలోని వి.కోట మండల పరిధిలో శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ట్రాన్స్కో ఏఈ రామకృష్ణ తెలిపారు. వి. కోట మండలం కస్తూరి నగరంలోని 220కెవి సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా ఈ అంతరాయం నెలకొంటుంది అన్నారు. అలాగే శాంతిపురంలోని 220కేవీ సబ్‌స్టేషన్ సైతం నిర్వహణ చేపట్టనున్నారని శాంతిపురం, రామకుప్పం, వీకోట మండలాల పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ట్రాన్స్కో, రెస్కో పరిధిలోని లీడర్లలో రైతులు, వినియోగదారులు సహకరించాలన్నారు.

## యల్.బి.ఆర్.సి.ఈ, సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ముగిసిన ఆటోక్యాడ్ శిక్షణా కార్యక్రమం




**మైలవరం, ఫిబ్రవరి 20**

స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యం మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సౌజన్యంతో ఆరు రోజుల పాటు నిర్వహించిన ఆటోక్యాడ్ శిక్షణా కార్యక్రమం శుక్రవారం తో ముగిసింది. ఈ కార్యక్రమానికి వై.ఏడుకొండలు , ట్రైనర్ ,ఏపీ ఎస్ ఎస్ డి సి రిసోర్స్ పర్సన్ గా వ్యవహరించారు . ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగంలో అవసరమైన డిజిటల్ డ్రాఫ్టింగ్ నైపుణ్యాలను ద్వితీయ సంవత్సర బి.టెక్ విద్యార్థులకు అందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యం. మొత్తం 64 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని, ప్రాథమిక 2డి ఆకృతుల నుండి క్లిష్టమైన 3డి మోడల్స్ వరకు పూర్తిస్థాయి శిక్షణ పొందారు. నిపుణులైన శిక్షకుల పర్యవేక్షణలో విద్యార్థులు ఫ్లోర్ ప్లాన్‌లు మరియు బిల్డింగ్ నమూనాలు తయారు చేసే పద్ధతులను నేర్చుకున్నారు.శిక్షణ ముగింపులో నిర్వహించిన తుది మూల్యాంకనంలో పాల్గొన్న విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి అధికారిక ధృవీకరణ పత్రాలను అందుకున్నారు. ఈ సర్టిఫికెట్లు విద్యార్థులకు భవిష్యత్తులో ఇంటర్న్‌షిప్‌లకు మరియు ఉద్యోగ అవకాశాలకు ఎంతో దోహదపడతాయని కళాశాల ప్రిన్సిపాల్ డా . కె. అప్పారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎం. మనోజ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మరియు కె. హరీష్ కుమార్ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ కో ఆర్డినేటర్లు గా వ్యవహరించారు .. సివిల్ ఇంజనీరింగ్ విభాగధిపతి డాక్టర్ కె. వెంకట రమణ మరియు కళాశాల ప్రిన్సిపాల్ డా.కె.అప్పారావు విద్యార్థులను, శిక్షకులను మరియు అధ్యాపక బృందాన్ని ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు అభినందించారు.

# అత్యుత్తమ నాణ్యతతో తాజా ఉత్పత్తులే లక్ష్యం

- రైతుల సాధికారితకు ప్రాధాన్యం

హెరిటేజ్ ఫుడ్స్ వెల్లడి

**విజయవాడ, ఫిబ్రవరి 20**

అత్యుత్తమ నాణ్యతతో కూడిన తాజా ఉత్పత్తులే తమ లక్ష్యమని హెరిటేజ్ ఫుడ్స్ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఇంటికి తాజా, ఆరోగ్యకరమైన ఉత్పత్తులు అందించడం, రైతులకు సాధికారత కల్పించడం ఇవే లక్ష్యమన్నారు. లక్షలాది మంది పాడి రైతులకు ఆర్థిక భరోసా కల్పిస్తూ 33 ఏళ్ల ప్రస్థానాన్ని ఘనంగా కొనసాగిస్తున్నామన్నారు. నాలుగు కోట్లతో చిన్న సంస్థగా మొదలైన ఈ సంస్థ ఇప్పుడు రూ.4,000 కోట్లతో భారీ సంస్థగా ఎదిగిన ఈ ప్రయాణంలో 'పారదర్శకత', 'నాణ్యత' తమ విజయ రహస్యాలని పునరుద్ఘాటించారు. మా లక్ష్యానికి కట్టుబడి ఉంటామన్న వాగ్దానం, వినియోగదారులను సంతోషపెట్టడం అనే రాజీలేని నమ్మకంతో మొదలవుతుందని తెలిపారు. నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లో వెనకడుగు వేయమన్నారు. అది పాలు, పెరుగు, నెయ్యి, పనీర్, ఐస్‌క్రీమ్ ఏ ఉత్పత్తి అయినా సరే నాణ్యతతో ఉండాల్సిందేనన్నారు. మేము తయారు చేసే ప్రతీ ఉత్పత్తి ఐదు కీలక తనిఖీ కేంద్రాల ద్వారా 25 నాణ్యత పరీక్షలకు లోనవుతుందని పేర్కొన్నారు. ఈ పరీక్షలు నిబంధనలు సూచించిన దాని కంటే అత్యున్నత పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన ఉత్పత్తులు ప్రతి ఇంటికి తాజాగా, సురక్షితంగా, పోషక విలువలతో చేరేలా చూడటం కోసం 500 మందికి పైగా అంకితభావం కలిగిన నాణ్యతా నిపుణులు నిరంతరం

కృషి చేస్తున్నారని తెలిపారు. ఎందుకంటే, మీరు మీరక్షణ ద్వారా నిరంతరం రైతుల సామర్థ్యాన్ని
కుటుంబానికి వడ్డించేది కేవలం ఆహారం మాత్రమేపెంచడానికి పెట్టుబడి పెడతామన్నారు. ఎందుకంటే,
కాదని, అది ఒక 'నమ్మకం' అని వివరించారు. ఆసాధికారత పొందిన రైతులే స్థిరమైన జీవనోపాధిని
బాధ్యతను గౌరవిం చాల్సిందేనన్నారు. హెరిటేజ్నిర్మించు కోగలరని పేర్కొన్నారు. ఆ స్థిరత్వమే మీరు
వాగ్దానం మీ ఇంటి గుమ్మం దగ్గరే ఆగిపోదన్నారు.పొందే ఉత్పత్తుల నాణ్యతలో ప్రతిబింబిస్తుందని
రైతులకు సాధికారత కల్పించడం కూడా మాతెలిపారు. ఈ సంస్థను సమగ్రత, పారదర్శకత, నిలకడ
అస్తిత్వంలో ఒక ప్రధాన భాగం అన్నారు. తొమ్మిదిఅనే పునాద ులపై నిర్మించామన్నారు. ఎన్నో రకాల
రాష్ట్రాల్లో సుమారు మూడు లక్షల మంది పాడి రైతులతోప్రచారాలు, వాదనలు ఉన్న ఈ ప్రపంచంలో మీరు
కలిసి పని చేస్తున్నామన్నారు. మూడు దశాబ్దాలకు పైగాఎల్లప్పుడూ మూలాల నుంచి వాస్తవాలను
ఈ బంధాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ఈతెలుసుకోవాలని కోరారు. ఎవరినీ గుడ్డిగా
భాగస్వామ్యం మూడు శక్తివంతమైన సూత్రాలపైనమ్మవద్దన్నారు. స్వయంగా సత్యాన్ని
ఆధారపడి ఉందన్నారు. అవి మొదటిదితెలుసుకోవాలన్నారు. ఎందుకంటే, హెరిటేజ్‌లో ఒక
సమయానుకూల చెల్లింపు అన్నారు. ప్రతి నెలా రెండుసూత్రాన్ని నమ్ముతామన్నారు. అది 'చూడడమే నమ్మకం'
నుంచి మూడు సార్లు, అనుకున్న సమయానికి,అన్నారు. 'మా తయారీ ప్రక్రియలను చూడండి, మా
ప్రతిసారీ చెల్లింపులు చేయడమన్నారు. గత 30 ఏళ్లలోనాణ్యతా ప్రమాణాలు గమనించండి, రైతులతో ఎలా
ఒక్కసారి కూడా చెల్లింపు రోజును వదులుకోలేదన్నారు.కలిసి పని చేస్తున్నామో? స్వయంగా తెలుసుకోండని"
రెండవది పూర్తి పారదర్శకత అన్నారు. పరీక్షలు,తెలిపారు. మూడు దశాబ్దాలుగా ప్రతి రోజూ నిబద్ధతతో
కొలతలు, కమ్యూనికేషన్‌లో పూర్తి స్పష్టత ఉంటుందపని చేస్తున్నామన్నారు.

...న్నారు. మా రైతులకు ప్రతిరోజూ తాము ఎంత సంపాది స్తున్నారో కచ్చితంగా తెలుస్తుందన్నారు. మూడవది సరసమైన, పోటీ ధర అన్నారు. నాణ్యత, పరిమాణం ఆధారంగా సరైన ధరను అందించడం ద్వారా వారి గౌరవాన్ని, ఆర్థిక స్థిరత్వాన్ని, నమ్మకాన్ని కాపాడటం అన్నారు. పశువైద్య సహాయం, జంతు సంరక్షణ, నాణ్యమైన మేత, శిక్షణ, డిజిటల్ సాధనాలు, ఆర్థిక

## బీసీ సింహగర్జనను అడ్డుకునేందుకు
# చంద్రబాబు కుట్రలు.. హైకోర్టు జోక్యంతోనే అనుమతి

- ఐదు డిమాండ్ల సాధనే లక్ష్యం.. భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తాం
- బీసీల ఐక్యతను దెబ్బతీసే ప్రయత్నం
- హైకోర్టు జోక్యంతోనే అనుమతులు
- కుట్రలపై పోలీసులు అప్రమత్తంగా ఉండాలి
- చారిత్రాత్మకంగా సభా కార్యక్రమాలు
- బిసివై పార్టీ అధినేత బోడె రామచంద్రయాదవ్


**మంగళగిరి, ఫిబ్రవరి 20**



బీసీల ఐక్యతను చూసి ఓర్వలేక, ఈ నెల 22న తలపెట్టిన "బీసీ సింహగర్జన" మహాసభను అడ్డుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పోలీస్ శాఖను అడ్డుపెట్టుకుని అనేక కుట్రలు పన్నిందని భారతచైతన్య యువజన (బిసివై) పార్టీ జాతీయ అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ తీవ్రంగా ఆరోపించారు. సభకు అనుమతులు నిరాకరించేందుకు చివరి వరకు ప్రయత్నించారన్నారు, చివరకు హైకోర్టు జోక్యంతోనే అనుమతులు వచ్చాయన్నారు. గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్సిటీ సమీపంలో, సభ కోసం ఏర్పాటు చేస్తున్న "పూలే-అంబేద్కర్-మండల్-కర్పూరి ఠాకూర్ ప్రాంగణం" వద్ద ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా రామచంద్రయాదవ్ మాట్లాడుతూ, "బీసీల ఐదు ప్రధాన డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈ మహాసభను నిర్వహిస్తున్నాం. బీసీ రక్షణ చట్టం తక్షణ అమలు, రాజధాని ప్రాంతంలో బీసీల అభివృద్ధికి వెయ్యి ఎకరాల భూమి కేటాయింపు, బీసీ కార్పొరేషన్లకు నిధులు, సమగ్ర కులగణన, విద్య, ఉద్యోగ, చట్టసభల్లో 44% రిజర్వేషన్లు కల్పించడం వంటి డిమాండ్లతో భవిష్యత్ కార్యాచరణ ప్రకటించబోతున్నాం. అయితే, మేము సింహగర్జన ప్రకటించిన తర్వాత, బీసీలలో వస్తున్న ఐక్యతను దెబ్బతీయడానికి, ఉద్యమాన్ని నీరుగార్చడానికి ప్రభుత్వం అనేక ప్రయత్నాలు చేస్తోంది. సభకు అనుమతులు ఇవ్వకుండా పోలీస్ శాఖ ద్వారా తీవ్రంగా ఇబ్బందులకు గురిచేశారు. ఈ నెల 4వ తేదీన దరఖాస్తు చేసుకున్నా, చివరి వరకు స్పందించలేదు. దీంతో మేము హైకోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం జోక్యంతోనే అనుమతులు లభించాయి. రాష్ట్ర జనాభాలో మూడు కోట్ల మంది ఉన్న బీసీల ఉద్యమానికి అనుమతులు ఇవ్వకుండా బెదిరించడాన్ని బట్టి, బీసీల పట్ల చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో అర్థమవుతోంది," అని అన్నారు. ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, బీసీ సింహగర్జన మహాసభ అత్యంత ప్రశాంత వాతావరణంలో, విజయవంతంగా జరిగి తీరుతుందని రామచంద్రయాదవ్ ధీమా వ్యక్తం చేశారు. సభను అడ్డుకోవడానికి కొన్ని శక్తులు కుట్రలు చేసే అవకాశం ఉందని తమకు సమాచారం ఉందని, కాబట్టి పోలీసులు అప్రమత్తంగా ఉండి, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సభలో రాజకీయ ప్రసంగాలతో పాటు, సామాజిక న్యాయానికి ప్రతీకగా శ్రీకృష్ణుడు-జాంబవతిల కల్యాణ మహోత్సవాన్ని, బీసీ కుల దేవతల ఆరాధన, మహనీయులకు నివాళులర్పించే కార్యక్రమాలను చారిత్రాత్మకంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఐదు డిమాండ్లు సాధించే వరకు, కలిసి వచ్చే అన్ని సంఘాలను, పార్టీలను కలుపుకొని తమ పోరాటం కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## నాగార్జునసాగర్ ఎడమకాలువకు
# వెంటనే జలాలు విడుదల చేయాలి: ప్రాజెక్ట్ కమిటీ

**విజయవాడ, ఫిబ్రవరి 20**



నాగార్జునసాగర్ ఎడమకాలువ 2వ, 3వ జోన్లలో సాగు చేసిన ఆరుతడి పంటలను రక్షించేందుకు వెంటనే సాగర్ జలాలను విడుదల చేయించాలని ప్రాజెక్ట్ కమిటీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డా. నిమ్మల రామానాయుడుని విన్నవించింది. విజయవాడ ఎం.జి రోడ్డులోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని నాగార్జునసాగర్ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, వైస్ ఛైర్మన్ ఆళ్ళ వెంకట గోపాలకృష్ణరావు ఆధ్వర్యంలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు కలిసి వినతిపత్రం సమర్పించారు.

### 80 వేల ఎకరాల్లో ఆరుతడి పంటలు ప్రమాదంలో...

ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాలకృష్ణరావు మాట్లాడుతూ, 3వ జోన్ పరిధిలో నూజివీడు, గన్నవరం, మైలవరం, తిరువూరు, నందిగామ నియోజకవర్గాల్లోని రైతులు సుమారు 80 వేల ఎకరాల్లో మొక్కజొన్న, మిర్చి తదితర ఆరుతడి పంటలను సాగర్ జలాలపై ఆధారపడి సాగు చేశారని తెలిపారు. జనవరి నెల నుంచి నది యాజమాన్య మండలి విడుదల ఉత్తర్వులు ఉన్నప్పటికీ పైభాగానున్న తెలంగాణ ప్రభుత్వం ఇప్పటివరకు సాగర్ జలాలను విడుదల చేయకపోవడంతో పంటలు ఎండిపోతునాన్నయని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 3వ జోన్‌కు కేటాయించిన 14 టీఎంసీలలో ఇప్పటివరకు కేవలం 3 టీఎంసీలకు మించి నీరు అందలేదని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ సరిహద్దు 101 కిలోమీటర్ల వద్దకు 15 రోజుల పాటు నిరాటంకంగా 1800 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని మంత్రిని కోరినట్లు తెలిపారు.

### 2వ జోన్ వరి పంటకూ ప్రమాదం...

2వ జోన్‌లోని మదిర, బోనకల్, డి.వి.ఆర్ బ్రాంచ్ కాలువలకు పూర్తిస్థాయిలో సాగు జలాలు విడుదల చేయించి ఇప్పటికే సాగు చేసిన వరి పంటను రక్షిం చాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్ట్ పరిధిలో 273 లస్కర్ పోస్టులు ఉండగా ప్రస్తుతం కేవలం 42 మంది మాత్రమే విధుల్లో ఉన్నారని, మిగిలిన పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సీజన్‌లో నీటి సంఘాల ప్రతినిధులు నిర్వహించిన నిర్వహణ పనులకు నిధులు మంజూరు చేయాలని కూడా అభ్యర్థించారు. విన్నవింపుపై స్పందించిన మంత్రి డా. నిమ్మల రామానాయుడు రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికా రులు వెంటనే తెలంగాణ నీటిపారుదల శాఖ అధికా రులతో మాట్లాడి ఎడమకాలువకు సాగర్ జలాల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఎన్.టి.ఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాలకు చెందిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్లు మరియు ప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం



## పత్తి రైతులు, పరిశ్రమకు
# ముప్పు మోడీ-ట్రంప్ ఒప్పందం

**అమెరికా మన దేశంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం మన ఎగుమతులపై 18శాతం దిగుమతి పన్ను విధిస్తారు. అదే బంగ్లాదేశ్‌తో చేసుకున్న అవగాహన ప్రకారం దిగుమతి చేసుకొనే దుస్తులపై అమెరికా ఎలాంటి పన్ను విధించదు. ఈ అంశం మన దేశ వస్త్రపరిశ్రమ,వాణిజ్యవేత్తలలో ఆందోళనకు గురిచేసింది. దాంతో కేంద్ర మంత్రి రంగంలోకి దిగారు.మనకూ అలాంటి సౌకర్యం ఉందన్నారు. ఉంటే అమెరికా జారీ చేసిన ప్రకటనలో ఆ వివరం ఎందుకు లేదు! అదంతే, మనకా రాయితీ ఎలా వస్తుందంటే మనం కూడా అమెరికా పత్తి దిగుమతి చేసుకుంటే ఎలాంటి పన్నులూ ఉండవని, ఈ అంశాన్ని సంతకాల సమయానికి ఒప్పందంలో భాగంగా చేర్చుతామని చెప్పారు. ఖాళీ చెక్కు మీద సంతకం చేసినపుడు ఎంతమొత్తమైనా రాసుకోవచ్చు. అమెరికాతో అలాంటి అవగాహనకు వచ్చినందున ఇంకా ఇలాంటి వాటిని మరెన్నింటిని చేర్చుతారో! ఆ నిబంధన రైతాంగానికి నష్టం కదా అంటే కాదని సెలవిచ్చారు. ఎందుకటా, అమెరికాలో పత్తి పరిమితంగానే పండుతుంది గనుక అన్నారు. ఎప్పటికెయ్యది అప్పటికా మాటలాడి తప్పించుకు తిరిగేందుకు చూస్తున్నారు గనుకనే అడుగడుగునా అనుమానించాల్సిందే.**

ప్రపంచ పత్తి ఉత్పత్తి వివరాలను చూస్తే చైనాలో 7.5, భారత్‌లో 5.1, బ్రెజిల్ 4.1, అమెరికాలో 3, పాకిస్తాన్‌లో 1.1 మిలియన్ టన్నుల పత్తి పండిందని 2025 అంచనా. బ్రెజిల్‌లో ప్రతి మనిషికి 0.19మి.ట, అమెరికాలో 0.088, చైనాలో 0.052, మన దేశంలో 0.032 మి.టన్నులు ఉంది. ఈ వివరాలన్నీ తెలియకుండానే గోయల్ అమాత్యగిరీ వెలగ బెడుతున్నారని అనుకోవాలా? 2024 వివరాల ప్రకారం ప్రపంచంలో 90 లక్షల టన్నుల ఎగుమతి జరగ్గా బ్రెజిల్ 27.74, అమెరికా 24.91, మన దేశం 4.65 లక్షల టన్నులు ఎగుమతి చేసింది. రెండవ స్థానంలో ఉన్న మనం అంత తక్కువ, నాలుగవదిగా ఉన్న అమెరికా అంత ఎక్కువ ఎందుకు ఎగుమతి చేస్తున్నట్లు! మనకంటే ఎక్కువగా పండిస్తున్నప్పటికీ చైనా ఎందుకు దిగుమతి చేసుకొంటోందంటే అక్కడ వస్త్ర పరిశ్రమకు అవసరం, తద్వారా విదేశాలకు ఎగుమతి చేసి లబ్ధి పొందుతోంది. మన దేశంలో ఐదు కోట్లకు పైగా కదుళ్లు (స్పిండిళ్లు) ఉండగా చైనా పది కోట్లు కలిగి ఉంది, వాటితో అక్కడి జనాభాకు పని కల్పిస్తోంది. అమెరికాతో వాణిజ్య ఒప్పందంతో నిమిత్తం లేకుండానే పిలుపులు ఇచ్చిన మన మేకిన్, మేడిన్ ఇండియా, ఆత్మనిర్భర భారత్ సంగతేమిటి? ఒక మౌలిక ప్రశ్న ఏమంటే వస్త్ర ఎగుమతులకు నిజంగా అంత అవకాశం ఉంటే మోడీ సర్కార్ 12 సంవత్సరాలపాటు అలాంటి ఒప్పందాలను ఎందుకు చేసుకోలేదు? లక్షలాది మందికి ఉపాధి ఎందుకు కల్పించలేదు ?మన రైతాంగం, పరిశ్రమ బంగ్లాదేశ్ గురించి ఎందుకు భయపడాలి? బంగ్లాదేశ్ ప్రధాన ఉత్పత్తి వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు. అక్కడ పత్తి పెద్దగా పండదు, దిగుమతి చేసుకోవాల్సిందే. ప్రస్తుతం ప్రపంచంలో అదే ఎక్కువగా ఇతర దేశాల నుంచి తెచ్చుకుంటున్నది. వస్త్ర ఉత్పత్తులతో చైనా, భారత్, వియత్నాం వంటి దేశాలను సవాలు చేస్తున్నది. తాజా ఒప్పందం ప్రకారం అమెరికా నుంచి నూలు, పత్తి దిగుమతి చేసుకొని దుస్తులను తమకు ఎగుమతి చేస్తే ఎలాంటి పన్నులు ఉండవు అన్న వెసులుబాటు అమెరికా కల్పించింది. నిజానికి అది తమ పత్తి కొనుగోలు చేయాలనే షరతును రుద్దింది. ఒక దశలో షేక్ హసీనా పదవీచ్యుతురాలు గాకముందు మన పత్తి, నూలు ఎగుమతుల్లో 70 శాతం బంగ్లాదేశ్‌కే జరిగాయి. పైకి ఎన్ని చెప్పినప్పటికీ ఇప్పుడు అక్కడ మనకు వ్యతిరేకమైన బిఎన్‌పి అధికారానికి వచ్చింది. అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి చేసే రెడీమేడ్ దుస్తులలో 70 శాతం అమెరికా ముడి సరకుల్తు ఉంటే ఎలాంటి దిగుమతి పన్ను ఉండదు. అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం పత్తి సంవత్సరం 2025-26 (అక్టోబరు నుంచి సెప్టెంబరు వరకు) బంగ్లాదేశ్ 84 లక్షల బేళ్ల పత్తి దిగుమతి చేసుకోవాలని నిర్ణయించింది. బ్రెజిల్ నుంచి 19 (22 శాతం) భారత్ 14 (15 శాతం) బెనిన్ 10.6, కామెరూన్ 6.2, అమెరికా, ఆస్ట్రేలియాల నుంచి 5.95 లక్షల బేళ్ల వంతున దిగుమతి చేసుకోవాలని తలపెట్టింది. ఇప్పుడు తాజా ఒప్పందంతో అమెరికా నుంచి దిగుమతులు భారీగా పెరుగుతాయని భావిస్తున్నారు. మన పత్తి కంటే అమెరికా సరకు రేట్లు తక్కువ, ఎందుకని? 2026లో ఒక పౌను (453 గ్రాములు) దూదికి ప్రభుత్వ సాయంగా 55 సెంట్లు, మన నగదులో రూ.50 ఇస్తుంది. అంత మొత్తం సబ్సిడీ పొందుతున్న తరువాత ప్రపంచానికి చౌకధరలకు పత్తి ఎగుమతులు చేయకుండా ఎలా ఉంటుంది. పైసా పైసా లాభాన్ని లెక్క వేసుకొనేవారు అమెరికా పత్తికి ఎగబడరా? బంగ్లాదేశీయులు దూరంగా ఉంటారా? ట్రంప్ విధించిన పన్నులతో మన ఎగుమతిదారులు అమెరికన్లకు చౌకగా దుస్తులు అందించలేకపోతున్నారని, అచ్చే దిన్‌కు దూరం చేస్తున్నారనే 'జాలి గుండె'తో నరేంద్ర మోడీ సర్కార్ అక్కడి నుంచి దిగుమతి చేసుకొనే పత్తిపై 11 శాతం పన్ను తగ్గించింది. పొడవు పింజ పత్తిని మాత్రమే దిగుమతికి అనుమతించామంటారు. రెండు తెలుగు రాష్ట్రాలు, దక్షిణాదిన పండేది అదే గనుక మన రైతులకు క్వింటాకు వెయ్యి నుంచి రెండు వేల వరకు నష్టం వచ్చింది. అయితేనేం అమెరికన్లకు తక్కువ ధరలకు దుస్తులను అందించినందుకు మన బిజెపి నేతలు తమ భుజాలను తామే చరుచుకున్నారు. ఇప్పుడు కూడా అమెరికా నుంచి దిగుమతులు చేసుకోవాలని పియూష్ గోయల్ చెబుతున్నారు. అంటే ఈ ఏడాది కూడా పత్తి రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు పూనుకున్నారు.ముందే చెప్పుకున్నట్లు పైకి చెబుతున్నది ఒకటి. లోపల జరుగుతున్నది మరొకటి. అమెరికా నుంచి పప్పుధాన్యాలను కూడా దిగుమతి చేసుంటారని ట్రంప్ యంత్రాంగం "వాస్తవాల పత్రం"లో చెప్పింది. మన రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో మాట మార్చింది. ఫిబ్రవరి పన్నెండు కార్మికుల సార్వత్రిక సమ్మె సందర్భంగా రైతులు మద్దతు ప్రకటించి నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అలాగే ఐదేళ్ల పాటు ప్రతి ఏటా వంద బిలియన్ డాలర్ల అమెరికన్ వస్తువులు, ఇంధనాన్ని కొనుగోలు చేసేందుకు భారత్ అంగీకరించినట్లు తొలుత చెప్పారు. తరువాత మాట మార్చి అంగీకారం కాదు వాంఛిస్తున్నదని సవరించారు. డిజిటల్ సేవలపై పన్నులు ఎత్తివేసేందుకు మోడీ సర్కార్ అంగీకరించిందని తొలుత ప్రకటించారు. తరువాత దానికి సంబంధించిన పేరాను తొలగించారు. దాని బదులు డిజిటల్ వాణిజ్య సేవల గురించి సంప్రదింపులు జరిపేందుకు అంగీకరించిదని మార్చారు. ఇలా అమెరికా రోజుకొక మాట చెబుతున్నా మోడీ నోరు విప్పటం లేదు.



## పోలవరం జిల్లాలో 80 కేజీల గంజాయిని పట్టుకున్న పోలీసులు

**రంపచోడవరం, ఫిబ్రవరి 20**

పోలవరం జిల్లాలో వేర్వేరు కేసుల్లో వై రామవరం, దేవీపట్నం పోలీసులు అక్రమంగా తరలిస్తున్న 80 కేజీల గంజాయిని పట్టుకున్నారు. అడ్డతీగల సిఐ బి నరసింహమూర్తి కథనం ప్రకారం పోలీసులకు రాబడిన ముందస్తు సమాచారంతో ఒడిశా రాష్ట్రం చిత్రకొండ నుండి వై రామవరం మండలంలోని కోట, చవిటిదిబ్బల గ్రామాల మీదుగా రాజమహేంద్రవరానికి అక్రమంగా మినీ వ్యాన్లో గంజాయి రవాణా చేస్తుండగా వై రామవరం ఎస్సై ఎస్ పృథ్వీ యాదవ్ ఆధ్వర్యంలో సిబ్బంది చవిటిదిబ్బలు జంక్షన్లో పట్టుకున్నారు. గంజాయి రవాణా చేస్తున్న ఒడిశాకు చెందిన బాబుల్ అంతా, ముబారాజన్లను లోకి తీసుకున్నారు. పట్టుకున్న గంజాయి విలువ 10 లక్షల రూపాయలు ఉంటుందని, ఈ అక్రమ రవాణాలో భాగస్వాములై పరారీలో ఉన్న మరో ఇద్దరు వ్యక్తులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు. మరో కేసులో దేవీపట్నం పోలీసులు మండలంలోని పాత దండంగి గ్రామం నుండి ఇందుకూరుపేట వైపు రెండు మోటర్ బైక్ లపై నలుగురు వ్యక్తులు 30 కేజీల గంజాయి అక్రమంగా తరలిస్తుండగా పోతవరం గ్రామం వద్ద దేవీపట్నం పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న పంపన కృష్ణ బాబు గెద్దాడ మణికంఠ గొప్పల ఈశ్వర రామ్ గణేష్ అదుపులోకి తీసుకొని కోర్టుకు తరలించారు.

## సీబీఎసీ గుర్తింపు పొందిన ఏకత్వా పాఠశాల యాజమాన్యానికి ప్రశంసలు

### ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అభినందనలు



**నందిగామ, ఫిబ్రవరి 20**

నందిగామ నియోజకవర్గంలోని కంచికచర్ల లో గత సంవత్సరం స్థాపించబడిన ఏకత్వా పాఠశాల స్థాపించిన మొదటి సంవత్సరంలోనే అనేక క్రీడలలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధించి కంచికచర్ల విద్యారంగ సౌరభ సుగంధాలను దిశ దిశలా వ్యాపింప చేసిన ఏకత్వ పబ్లిక్ స్కూల్ స్థాపించిన రెండవ సంవత్సరంలోనే నర్సరీ నుండి 12 వ తరగతి వరకు సీబీఎస్సీ గుర్తింపు పొంది తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టుకున్నదని ఎమ్మెల్యేతంగిరాల సౌమ్య తన కార్యాలయంలో ఏకత్వ యాజమాన్యం అయిన అమరనేని రమేష్ బాబు, జ్యోతి, మనోజ్, సింధూర, కార్తీక్, శాంతిప్రత్యూష లకు అభినందనలు తెలిపారు. భవిష్యత్ లో ఎన్నో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సౌమ్య ఆకాంక్షించారు. పాఠశాల అభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ఉపాధ్యాయులకు , తల్లిదండ్రులకు కూడా ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.

## ముక్కంటి ఆలయానికి విదేశీ భక్తుల తాకిడి



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 20**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత వాయులింగేశ్వరుని శుక్రవారం రష్యా ,జర్మనీ దేశాలకు చెందిన సుమారు 200 మంది విదేశీ భక్తులు దర్శించుకున్నారు. ఓం నమశ్శివాయ అనే శివనామ స్మరణతో వారు ఆలయాన్ని సందర్శించి స్వామి అమ్మవార్లను భక్తి భావంతో దర్శించుకున్నారు. ఆలయం యొక్క విశిష్టతను కట్టడాలను చూసి స్వామి అమ్మవాళ్లకు గొప్పతనాన్ని కొనియా డారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంలో ఘనంగా నిర్వహించిన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగాశుక్రవారం రాత్రి స్వామి వారి ధ్వజావరోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించబడింది. బ్రహ్మోత్సవాల ఆరంభంలో ఎగురవేసిన పవిత్ర ధ్వజపతాకను శుక్రవారం అవరోహణం చేయడంతో ఉత్సవాలకు ముగింపు పలికినట్లు భావిస్తారు. వేద మంత్రోచ్చారణల మధ్య, వేదపండితులు, అర్చకుల సమక్షంలో, భక్తుల జయజయధ్వానాల నడుమ ఈ కార్యక్రమం భక్తి భావాలతో జరిగింది.

## శాస్త్రోక్తంగా స్వామి అమ్మవార్ల కలిశాభిషేకం



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానం మహాశి వరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం సాయంత్రం స్వా మి అమ్మవార్ల కలిశా భిషేకం సందర్భంగా యాగశాల నుండి కలిశాలను తీసుకెళుతున్న కార్యక్రమం ఆలయ పండితుల చేత వేదమంత్రాలు మధ్య శాస్త్రోక్తంగా నిర్వహిం చమైనది. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి ఆలయ అధికారులు వేద పండితులు పాల్గొన్నారు.

# 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తే లక్ష్యం

- దేశంలో తొలిసారి ట్రూ డౌన్ చేసిన ఘనత కూటమిదే
- జెన్కో నుంచి రికార్డుల స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి
- విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి రూ.890 కోట్లు ఆదా చేశాం
- 20 లక్షల ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్
- ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటిరవి కుమార్



టిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ ద్వారా 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తుందని రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అసెంబ్లీలో బడ్జెట్పై జరిగిన చర్చలో మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ... రాష్ట్ర విద్యుత్ రంగాన్ని దీర్ఘకాలిక స్థిరత్వం, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి చేస్తున్నామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు విద్యుత్ రంగమే మూల స్తంభమని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అసెంబ్లీలో పేర్కొన్నారు. దేశంలో విద్యుత్ సంస్కరణలకు నాంది పలికిన నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని తెలిపారు. ఆయన చేపట్టిన సంస్కరణల ఫలితంగానే సాంకేతిక రంగం అభివృద్ధి సాధ్యమైందన్నారు. 2014-19 కాలంలో అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా నిలిపామని, అదే సమయంలో పున రుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని 7 గిగావాట్లకు పెంచిన ఘనత ఆ ప్రభుత్వానిదని చెప్పారు. 2019-24 మధ్య కాలంలో విద్యుత్ వ్యవస్థ తీవ్ర ఆర్థిక ఒత్తిడిలో పడిందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ విమర్శించారు. తొమ్మి ది సార్లు విద్యుత్ చార్జీలు పెంచి, ట్రూ-అప్ చార్జీల పేరిట సుమారు రూ.30 వేల కోట్ల భారం ప్రజలపై మోపారని ఆరోపించారు. ప్రస్తుతం అప్పుల్లో కూరుకుపోయిన విద్యుత్ వ్యవస్థను కూటమి ప్రభుత్వం గాడిలో పెడుతోందని తెలిపారు. గత వైసీపీ ప్రభు త్వంలో పునరుత్పాదక ఇంధన రంగంలో పెట్టుబడులు పెట్టిన పారిశ్రామికవేత్తలను వైసీపీ నాయకులు రాష్ట్రం నుంచి తరిమికొట్టారని పేర్కొన్నారు. దీనిని అర్థం చేసుకున్న ప్రజలు గత ఎన్నికల్లో వారికి 11 సీట్లతో సమాధానం చెప్పారని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్ 21,457 మెగావాట్ల ఇన్స్టాల్డ్ కెపాసిటీతో ముందు వరుసలో ఉందని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. అందులో 37 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే ఉత్పత్తి అవుతోందన్నారు. ఇటీవల ఏపీజెన్కో 6 వేల మెగావాట్ల ఉత్పత్తితో రికార్డు స్థాయి సాధించిందని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి రికార్డు స్థాయిలో పెరగడంతో దేశంలో తొలిసారిగా 13 పైసలు ట్రూ డౌన్ చేసి వినియోగదారులకు ఉపశమనం కల్పించామని చెప్పారు. యూనిట్ కొనుగోలు ధరను రూ.7.71 నుంచి రూ.6.35కు తగ్గించడం ద్వారా 2025-26 ఆర్థిక సంవత్సరంలో అదనంగా రూ.340 కోట్లు, 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.550 కోట్లు ఆదా సాధించామని వెల్లడించారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ బడ్జెట్లో రూ.13 వేల కోట్లు విద్యుత్ సబ్సిడీకి కేటాయించామని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ తెలిపారు. 22 లక్షల మంది రైతులకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, వ్యవసాయ, అనుబంధ రంగాలకు రోజుకు 9 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల వినియోగదారులకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తున్నామని వివరించారు. ఆక్వా రైతులకు యూనిట్కు రూ.1.50కే విద్యుత్ అందిస్తున్నామని, 20 లక్షల ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అమలు చేస్తున్నామని తెలిపారు. చేనేత, దోభీ, సెలూ న్లకు విద్యుత్ సబ్సిడీ అందిస్తున్నామని వివరించారు. ఏప్రిల్ 1 నుంచి హ్యాండ్లూమ్కు 200 యూనిట్లు, పవర్ లూమ్కు 500 యూనిట్లు ఉచితంగా అందిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం సబ్సిడీతో పీఎం సూర్యఘర్ పథకాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. ఏపీ ట్రాన్స్కో ద్వారా గ్రిడ్ ను బలోపేతం చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి చెప్పారు. రాష్ట్రంలో 378 ఈహెచ్టీ సబ్ స్టేషన్లు, 71,549 ఎంవిఏ సామర్థ్యం, 33,000 కి.మీ పైగా ట్రాన్స్మిషన్ లైన్లు ఉన్నాయని వివరించారు. 950 సర్క్యూట్ కిలోమీటర్ల లైన్ల చార్జింగ్ ద్వారా గ్రిడ్ కనెక్టివిటీ మెరుగుపడిందని తెలిపారు. 2000 మెగావాట్ సామర్థ్యంతో బ్యాటరీ ఎనర్జీ నిల్వ వ్యవస్థ ప్రాజెక్టుకు అనుమతి లభించిందని, దేశంలోనే అత్యల్ప టారిఫ్తో ఇది అమలు అవుతోందని పేర్కొన్నారు. విద్యుత్ రంగాన్ని సమగ్రంగా పునరుద్ధరి స్తూ, పునరుత్పాదక ఇంధన విస్తరణతో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# బర్డ్ ఫ్లూ ఎవరికీ సోకలేదు

- అనుమానిత నమూనాల పరీక్షల రిపోర్టులు నెగిటివ్
- కలెక్టర్ల ఆధ్వర్యంలో నిరంతరం పర్యవేక్షణ
- కేంద్ర బృందం పర్యటన
- రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడి



చిత్తూరు, అన్నమయ్య, ఇతర జిల్లాల్లో ఎక్కడా కూడా మనుషులకు బర్డ్ ఫ్లూ వచ్చిన దాఖలాలు లేవని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ వెల్లడించారు. జిల్లాలో ఓ యువకుడికి ఏవియన్ ఇ న్ఫ్లూంజా (బర్డ్ఫ్లూ ) సోకినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేద ని స్పష్టం చేశారు. సదరు వ్యక్తి నుంచి సేకరించిన నమూనాను వైరాలజీ ల్యాబ్లో పరీక్షించగా నెగిటివ్ అని రిపోర్టు వచ్చిందని తెలిపారు. దీనిపై ఎవరూ ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

**కుటుంబ సభ్యుల నుంచి ఆరోగ్య వివరాల సేకరణ..**

చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో కోళ్లకు వచ్చిన బర్డ్ ఫ్లూ మనుషుల వరకు రాకుండా ఉండేందుకు వైద్య ఆరోగ్య శాఖ అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు. ప్రభావిత ప్రాంతాల్లోని కోళ్ల ఫారాల్లో పనిచేసే వారికి 'ఓసెల్టామివర్' మాత్రలను అందచేసినట్లు తెలిపారు అంతేకాకుండా ఎన్. 95 మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. లోతైన సర్వైలెన్స్లో భాగంగా క్షేత్రస్థాయిలోని పరిస్థితుల గురించి తెలుసుకునేందుకు సదరు ప్రభావిత గ్రామాల్లోని కుటుంబ సభ్యుల నుంచి వైద్య సిబ్బంది ఆరోగ్య వివరాలు సేకరించినట్లు వెల్లడించారు.

**ప్రభుత్వాల శాఖల పరస్పర సమన్వయం...**

ఈ క్రమంలో అనుమానిత లక్షణాలు కలిగిన వారి నుంచి సేకరించిన నమూనాలను తిరుపతిలోని స్విమ్స్ ల్యాబ్లో పరీక్ష చేయించగా ఇప్పటివరకు వచ్చిన 54 రిపోర్టులూ నెగిటివ్ ఉన్నాయని తెలిపారు. ముందు జాగ్రత్తగా చిత్తూరు, మదనపల్లె పట్టణాల్లోని ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా పడకలు సిద్ధం చేశామని తెలిపారు ఏవియన్ ఇన్ఫ్లూంజా అనేది పక్షులకు సంబందిం చినదని, నిర్దిష్ట ప్రమాణాలు పాటించి సరైన రీతిలో వండిన కోడి మాసం, గుడ్లు వినియోగం సురక్షితమేనని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు వర్చువల్ విధానంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షలు జరుపుతూ తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సర్వైలెన్స్ పటిష్టతపై సలహాలు, సూచనలు ఇస్తున్నారు. అంతేకాకుండా సదరు జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ, పంచాయతీ, వైద్య, ఆరోగ్య శాఖ, పోలీసు, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలోని పరిస్థితులను గమనిస్తున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర బృందం జిల్లాల్లో పర్యటిస్తుందని పర్యటిస్తోశీదని వీరపాండియన్ వివరించారు.

# వేసవి రద్దీకి విస్తృత ఏర్పాట్లు

- డేటా ఆధారిత ప్రణాళికతో భక్తులకు మరింత సౌకర్యాలు
- సామాన్య భక్తులకు వీలైనంత త్వరగా దర్శనం కల్పించేలా చర్యలు
- టీటీడీ అదనపు ఈవోసి.హెచ్.వెంకయ్య చౌదరి

**తిరుమల, ఫిబ్రవరి 20**



త్వరలో ప్రారంభం కానున్న వేసవి సెలవులకు రానున్న భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పక్కా ప్రణాళికతో సమర్థవంతంగా చేపడుతున్నట్లు టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి తెలిపారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన వేసవి ఏర్పాట్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు- మూడు సంవత్సరాల వేసవి డేటాను విశ్లేషించి, దర్శనాల సంఖ్య, వేచి ఉండే సమయం, తర్వాత రోజు దర్శనాలకు క్యూలైన్లలో వేచి ఉండే భక్తుల సంఖ్య వంటి అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు అన్నప్రసాదం, తాగునీటి పంపిణీ, నడక దారి భక్తులకు మార్గమధ్యంలో షెడ్ల ఏర్పాటు, మాడ వీధులు తదితర ప్రాంతాల్లో కూల్ పెయింటింగ్, అవసరమైన చోట్ల షెడ్లు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే మజ్జిగ పంపిణీ పాయింట్ల సంఖ్యను పెంచి వేసవిలో భక్తుల దాహార్తిని తీర్చేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. వేసవి సెలవుల్లో కుటుంబాలతో కలిసి అధిక సంఖ్యలో భక్తులు వచ్చే నేపథ్యంలో వసతి సదుపాయాలు, అన్నప్రసాదం నిర్వహణను మరింత సమర్థంగా అమలు చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. నడకదారి భక్తులు, అధిక రద్దీ ప్రాంతాల్లో వైద్య సదుపాయాలను బలోపేతం చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. సామాన్య భక్తులు దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని తగ్గించి వీలైనంత త్వరగా దర్శనం కలిగేలా చర్యలు చేపట్టడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అదనపు ఈవో తెలిపారు. ఈసారి ఇంటిగ్రేటెడ్ ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచి, గంటల వారీగా ఇన్-అవుట్ ఫ్లో, వేచి ఉండే సమయాన్ని ప్రతి నిమిషం పర్యవేక్షిస్తూ అవసరమైన చోట తక్షణ నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. వివిధ కేటగిరీల దర్శనాలను డేటా ఆధారంగా హేతుబద్ధంగా కంపార్ట్మెంట్లు, క్యూలైన్లలో భక్తులు వేగంగా దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గత వేసవిలో జూన్ నెలలో సగటున రోజుకు 80 వేల నుంచి 82 వేల మందికి దర్శనం కల్పించామని, అలాగే 2026 జనవరిలో రోజుకు సగటున 74 వేల మందికి పైగా దర్శనం కల్పించినట్లు గుర్తు చేశారు. ఇది సమర్థవంతమైన టైమ్ మేనేజ్మెంట్, అన్ని విభాగాల సమన్వయంతో సాధ్యమైందని వివరించారు. వేసవిలో భక్తులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా టీటీడీ అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తాయని అదనపు ఈవో ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ సమావేశంలో టీటీడీ సీఈ సత్యనారాయణ, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, సోమన్నారాయణ, వెంకటయ్య, వేంకటేశ్వర్లు, వీజీవో సురేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వైసీపీ మహా అపచారం

- క్షమాపణ చెప్పేందుకు విపక్ష నేత ససేమిరా
- మా సభ్యులు చెప్పులు వేసుకున్నారనడానికి ఆధారం చూపించండి.. బొత్స సవాల్
- తక్షణమే వీడియోలను షేర్ చేసిన లోకేశ్



**అమరావతి, ఫిబ్రవరి 20**

ఈ సందర్భంగా వారు చెప్పులు, బూట్లు వేసుకునే.. శ్రీవారి పోస్టర్లు పట్టుకుని 'గోవిందా గోవిందా'.. 'చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి' అంటూ నినాదాలు చేశారు. బ్యాడ్జీలు, పోస్టర్లు, బ్యానర్లతో అసెంబ్లీలోకి వచ్చేందుకు అనుమతి లేదంటూ మార్షల్స్ అడ్డు చెప్పారు. అయినా వారు వినకుండా ముందు కొచ్చేందుకు ప్రయత్నించారు. దీంతో.. గేటు మూసి వారి చేతుల్లోని స్వామి పోస్టర్లు, ప్లకార్డులను, బ్యానర్లను మార్షల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఉదయం 10.07 గంటలకు మండలి సమావేశం మొదలవగా.. తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీపై ఎమ్మెల్సీ బల్లి కల్యాణచక్రవర్తి.. ఇందాపూర్–హెరిటేజ్ సంస్థపై వైసీపీ సభ్యులు కుంభా రవిబాబు, తూమాటి మాధవరావు, మంగమ్మ ఇచ్చిన వాయిదా తీర్మానాలను తిరస్కరిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించి.. ప్రశ్నోత్తరాలు చేపట్టారు. అయితే వైసీపీ సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, హనుమంతరావు, రవిబాబు, వరుదు కల్యాణి, కల్పలత, రమేశ్ యాదవ్, విక్రాంత్ తదితరులు ఇందాపూర్ డెయిరీపై చర్చకు అనుమతించాలంటూ స్వామి ఫొటోలు, ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. బూట్లు, చెప్పులతో స్వామి ఫొటోలు ప్రదర్శించడంపై మంత్రి పయ్యావుల కేశవ్, అధికార కూటమి సభ్యులు మండిపడ్డారు. 'వైసీపీ నేతలకు బుద్ధుందా? రాజకీయం కోసం దేవుడి ఫొటోలను సభలో ప్రదర్శించి, భక్తుల మనోభావాలను దెబ్బతీస్తారా? దేవుడిని రాజకీయాల్లోకి లాగే దుర్మార్గపు చర్య. వైసీపీ సభ్యులకు దేవుడంటే భయం లేదు.. నమ్మకమూ లేదు. విచక్షణ లేకుండా వారి నాయకుడు చెప్పినట్లు నడచుకుంటున్నారు. హిందువుల గౌరవం, జాతి నమ్మకాన్ని దెబ్బతీసేలా ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారు' అని అంటూ కేశవ్ తన హెడ్ ఫోన్‌ను విసిరికొట్టారు. మంత్రి లోకేశ్, కూటమి ఎమ్మెల్సీలు కూడా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా.. వైసీపీ ఎమ్మెల్సీలు పెద్దగా నినాదాలు చేయడంతో.. టీడీపీ ఎమ్మెల్సీలు కూడా పోడియం వద్దకు వెళ్లి, వారిపై చర్యలు తీసుకోవాలని పట్టుబట్టారు. ఈ నేపథ్యంలో ఉదయం 10.11 సమయంలో 5 నిమిషాలు సభను వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. వైసీపీ సభ్యులు సభ నుంచి బయటకు వచ్చే సమయంలో ప్లకార్డులతో పాటు స్వామి పోస్టర్లను వైసీపీ సభ్యులు అక్కడే పడేశారు.అనంతరం మంత్రులు లోకేశ్, కేశవ్ సహా కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు చైర్మన్ చాంబర్‌కు వెళ్లారు. వేంకటేశ్వరస్వామిని ఉద్దేశపూర్వకంగా ప్రతిరోజూ సభలో అపవిత్రం చేస్తున్నారని, ఇవాళ బూట్లు, చెప్పులు ధరించి స్వామి ఫొటోలను చేతపట్టుకుని ప్రదర్శించడం, టేబుల్‌పై స్వామి చిత్రపటాలను విసిరివేయడంపై నిరసన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సభలోకి దేవుడి ఫొటోలను ఎలా అనుమతించారని ప్రశ్నించారు. మోషేన్‌రాజు స్పందిస్తూ.. వైసీపీ సభ్యులు చేసింది తప్పేనని.. వారిని పిలిచి మాట్లాడతానని చెప్పారు. మాట్లాడడం కాదని, బహిరంగ క్షమాపణలు చెప్పించి, లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. తర్వాత బొత్సను చైర్మన్ తన చాంబరుకు పిలిపించి వివరణ కోరారు. జరిగినదానికి క్షమాపణ చెబుతారా అని అడిగారు. తామెందుకు క్షమాపణలు చెబుతామని బొత్స అన్నారు. తమ సభ్యులు తన సీటు వద్దే బూట్లు, చెప్పులు విడిచి పోడియం దగ్గరకు వచ్చారని చెప్పారు. మండలి నడవకుండా ఇలాగే కొనసాగడం సరికాదని.. ఇరుపక్షాల నుంచి ముగ్గురేసి సభ్యులు కూర్చుని సంప్రదింపులు జరుపుకోవాలని చైర్మన్ సూచించారు. తర్వాత 1.07 గంటలకు మండలి పునఃప్రారంభమైంది. వైసీపీ సభ్యులు మళ్లీ ప్లకార్డులు పట్టుకుని పోడియం వద్దకు వచ్చారు. చంద్రబాబు గతంలో బూట్లు వేసుకుని శ్రీవారి ఫొటో పట్టుకున్నట్లు ప్లకార్డులను ప్రదర్శించారు. చంద్రబాబే భక్తులకు క్షమాపణ చెప్పాలని బొత్స డిమాండ్ చేశారు. దీంతో టీడీపీ సభ్యులు కూడా పోడియం వద్దకు వెళ్లి అభ్యంతరం వ్యక్తం చేశారు. 4 రోజులుగా సభను అడ్డుకోవడం సరికాదని బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు అన్నారు. ఈ పరిణామాలతో ఒక్క నిమిషంలోనే (1.08గంటలకు) సభను సోమవారానికి వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. దీంతో వరుసగా నాలుగో రోజు కూడా మండలిలో బడ్జెట్‌పై చర్చే కాదు.. అసలే కార్యకలాపాలూ సాగలేదు. సభ వాయిదా పడ్డాక వైసీపీ ఎమ్మెల్సీలు బొత్స చాంబర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా ముగ్గురు మహిళా సభ్యులకు బొత్స చీరలు బహూకరించారు. దీంతో.. పురుష ఎమ్మెల్సీలు తమకూ కావాలని డిమాండ్ చేశారు. వారికి సోమవారం అసెంబ్లీ ప్రాంగణంలోని చేనేత స్టాల్స్ నుంచి చీరలు కొని అందిస్తామని బొత్స చెప్పారు. మండలిలో ప్రభుత్వం తోకముడిచిందని బొత్స అన్నారు. సభ వాయిదా పడ్డాక అసెంబ్లీ ఆవరణ బయట వైసీపీ అనుకూల మీడియా సంస్థలతో ఆయన మాట్లాడారు. 'మా సభ్యులు సభలో చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటో పట్టుకున్నట్లు ఒక్క ఆధారం గానీ, క్లిపింగ్ గానీ చూపెట్టమనండి' అని సవాల్ విసిరారు. దీనికి మంత్రి లోకేశ్ తక్షణమే 'ఎక్స్'లో స్పందించారు. మండలిలో బొత్స తాము బూట్లు, చెప్పులతో స్వామి చిత్రపటాన్ని పట్టుకోలేదని చెప్పిన వీడియోను.. వైసీపీ ఎమ్మెల్సీలు బూట్లు, చెప్పులతో స్వామి ఫొటోలను పట్టుకున్న వీడియోను కలిపి ట్యాగ్ చేశారు.

# జగన్ డైరెక్షన్‌లోనే!

**అమరావతి, ఫిబ్రవరి 20**

జగన్ డైరెక్షన్‌లోనే వైసీపీ ఎమ్మెల్సీలు శాసనమండలిలో చె ప్పులు, బూట్లు వేసుకొని వెంకటేశ్వరస్వామి ఫొటోలను ప్లకార్డుల్లా ప్రదర్శిస్తూ అపహాస్యం చేశారని, మహాపచారానికి పాల్పడ్డారని కూటమి మంత్రులు, ఎమ్మెల్సీలు మండిపడ్డారు. హిందువుల మనోభావాలు దెబ్బతీసేలా శ్రీవారి ఫొటోలను విసిరిపడేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఆ దేవదేవుడే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ మహాపచారంపై జగన్, వైసీపీ సభ్యులు హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మంత్రి లోకేశ్ నేతృత్వంలో అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేశ్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. వైసీపీ సభ్యులు చట్టసభల సాక్షిగా హిందువుల మనోభావాలు దెబ్బతీశారని, హద్దులు దాటి ప్రవర్తించారని పయ్యావుల కేశవ్ మండిపడ్డారు. దేవుడిని రాజకీయాల్లో వాడుకోవడంలో వైసీపీ పరాకాష్ఠకు చేరిందని విమర్శించారు. 'రాజకీయాల్లో ఎంత దూరమైనా పోవచ్చు. ఏ ఎత్తుగడలైనా వేయవచ్చు కానీ.. ప్రత్యక్ష దైవంగా కొలిచే వెంకటేశ్వరస్వామిని రాజకీయాల్లోకి తీసుకురావడం అంటే వైసీపీకి, ఆ పార్టీ అధినేత జగన్‌కు దేవుడి పట్ల ఏ రకమైన ఆలోచన ఉందో సమాజం ఆలోచించుకోవాలి' అని పేర్కొన్నారు. రోడ్డు మీద స్వామి ప్రసాదం ఇస్తే.. చెప్పులు వదిలేసి తీసుకునే సంస్కృతి మనదని పేర్కొన్నారు. వైసీపీ సభ్యులు సభలో చేసిన చర్య హిందూ సమాజాన్ని రెచ్చగొట్టేదిగా తాము భావిస్తున్నామన్నారు. ఇదే దేవదేవుని పట్ల వైసీపీ విధానమా? అని ప్రశ్నించారు. వెంకటేశ్వరస్వామి పట్ల, హిందూత్వం పట్ల తమపార్టీ విధానం ఏంటో జగన్ స్పష్టం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు. జగన్ హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలన్నారు. వైసీపీ సభ్యులు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ప్లకార్డులా పట్టుకుని సభలోకి రావడం అత్యంత దుర్మార్గమని పర్యాటక మంత్రి కందుల దుర్గేశ్ అన్నారు. వైసీపీ సభ్యుల తీరు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపర్చిందని, దీన్ని జనసేన పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలపై గౌరవం లేని వైసీపీ నాయకత్వం.. దేవుడిని కూడా రాజకీయాల కోసం వాడుకోవడం దుర్మార్గమన్నారు. స్వామి చిత్రపటాలను సభలోకి తీసుకురావడమే కాకుండా, తిరిగి వెళ్లేటప్పుడు వాటిని టేబుళ్లపైకి విసిరేయడం వారి అహంకారానికి నిదర్శమని మండిపడ్డారు. ఈ ఘటనను మండలి చైర్మన్ తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఇలాంటి చర్యలపై కఠినంగా వ్యవహరించకపోతే, భవిష్యత్తులో మరిన్ని అపచారాలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. వైసీపీ సభ్యులు వెంకన్న ఫొటోలను సభలో విచ్చలవిడిగా పడేసి అపచారానికి పాల్పడ్డారని, దీనికి ఆ కలియుగ దైవం ఆగ్రహానికి గురికాక తప్పదని బీసీ సంక్షేమ మంత్రి సవిత హెచ్చరించారు. జగన్, వైసీపీ సభ్యులు తక్షణమే హిందువులకు, ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. దేవుడి ఫొటోలతో రాజకీయం చేయడం క్షమించరాని నేరమని మండిపడ్డారు. వైసీపీ సభ్యులకు మహిళలన్నా గౌరవం లేదని, దేవుడన్నా భయం లేదన్నారు. సమస్యలపై చర్చించకుండా, తప్పులు బయటపడకుండా వైసీపీ సభ్యులు ఎంతటి నీచానికైనా దిగజారతారన్నారు. చెప్పులేసుకుని దేవుడి ఫొటోలతో సభలోకి రావడం క్షమించరాని నేరమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. దేవుడి ఫొటోలను విసిరేయడం అవమానకరమన్నారు. ఇదంతా వైసీపీ సభ్యులకు పై నుంచి వచ్చిన డైరెక్షన్‌లోనే జరిగిందని తాను భావిస్తున్నానన్నారు. దీనిపై జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# బెట్టింగ్ ముఠా గుట్టురట్టు

## నెల్లూరులో ఇద్దరు అరెస్టు.. మరో ఇద్దరు పరార్

### రూ.34 లక్షలు, ల్యాప్‌టాప్, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం

**నెల్లూరు(క్రైం), ఫిబ్రవరి 20**

క్రికెట్ బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ నిర్వహిస్తున్న ఇద్దరు నిందితులను నెల్లూరు పోలీసులు అరెస్ట్ చేశారు. నెల్లూరు ఎస్పీ అజిత వేజెండ్ల శుక్రవారం ఆ వివరాలను విలేకరులకు వెల్లడించారు. నెల్లూరులోని ఎన్టీఆర్‌నగర్‌కు చెందిన ఓ వ్యాపారిని ఆన్‌లైన్ యాప్‌ల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ ఫోన్ నెంబరును బుచ్చిరెడ్డిపాలెం రామకృష్ణానగర్‌కు చెందిన కె.వేణుగోపాల్ ఇచ్చాడు. దీంతో వ్యాపారి పలు దఫాలుగా ఆ నెంబర్‌కు రూ.53 లక్షల నగదు డిపాజిట్ చేశారు. ఆదాయం రాకపోవడంతో మోసపోయానని తెలుసుకున్న వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సాంబశివరావు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందం గురువారం రాత్రి బుచ్చిరెడ్డిపాలెంలో వేణుగోపాల్‌కు చెందిన ఓ గదిలో తనిఖీ చేసింది. వేణుగోపాల్‌తోపాటు అక్కడే ఉన్న బి.వెంకటరమణను అదుపులోకి తీసుకుని విచారించగా క్రికెట్ బెట్టింగ్ విషయం వెలుగులోకి వచ్చిం ది. వేణుగోపాల్ అదే ప్రాంతానికి చెందిన మరో ఇద్దరితో కలిసి ఆర్777 లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో రాధే ఎక్స్ఛేంజ్ యాప్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వేణుగోపాల్, వెంకటరమణలను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.34,65,800 నగదు, ల్యాప్‌టాప్, టీవీ, 13 మొబైల్ ఫోన్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలోని రూ.1,64,74,600ను సీజ్ చేశారు. మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారని ఎస్పీ తెలిపారు.

# ఇష్టానుసారంగా వ్యవహరిస్తే..ఊరుకోం!

## గుర్తుపెట్టుకోండి... ఇది రాజారెడ్డి రాజ్యాంగం కాదు

### శాసనసభలో హోంమంత్రి అనిత

**అమరావతి, ఫిబ్రవరి 20**

సమాజంలో మా ఇష్టం వచ్చినట్లుగా ఎలా పడితే అలా ప్రవర్తిస్తామంటే చూస్తూ ఊరుకోబోమని హోంమంత్రి అనిత హెచ్చరించారు. ఇష్టానుసారంగా వ్యవహరించేవారు ఇది రాజారెడ్డి రాజ్యాంగం కాదనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. 'తప్పు చేస్తే ఏ పార్టీ అయినా, ఎంతటి వారైనా శిక్ష అనుభవించాల్సిందే' అని స్పష్టం చేశారు. అలాగే సోషల్ మీడియా అసభ్య కామెంట్ల నియంత్రణకు త్వరలో చట్టం తీసుకొస్తామన్నారు. శుక్రవారం అసెంబ్లీలో హోంశాఖ పద్దుపై జరిగిన చర్చలో ఆమె మాట్లాడారు. "గత ప్రభుత్వంలో జరిగిన అరాచకాలను మర్చిపోలేం... మర్చిపోకూడదు. చంద్రబాబు ఇంటిపైనే దాడి చేసిన దుర్మార్గపు పాలన అది. పవన్ కల్యాణ్‌ను వాహనం దించి రోడ్డుపై అవమానించారు. లోకేశ్ పాదయాత్రలో దాడులు చేయించారు. పోలీసు వ్యవస్థను నిర్వీర్యం చేశారు. గంజాయికి ఏపీ చిరునామాగా మారింది" అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేశామని, 20 నెలల్లో 1.4 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. గత ప్రభుత్వంలో దెబ్బతిన్న పోలీసు వ్యవస్థ గౌరవాన్ని పునరుద్ధరించాలని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు సైబర్ నేరాలను ఎప్పటికప్పుడు గుర్తిస్తున్నా.. బాధితులకు కోల్పోయిన నగదు పెద్దగా అందడం లేదని కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ స్టేషన్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాప్రతినిధుల్ని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. ఇటీవల అంబటి రాంబాబు అంశంలో సంబంధం లేని తన ఫొటో పెట్టి ట్రోలింగ్ చేశారన్నారు.



# రాష్ట్రంలో పెరిగిన ఎండ.. కర్నూలులో 36.3 డిగ్రీలు

## నేడు, రేపు పిడుగులతో కూడిన వర్షాలు

**అమరావతి, ఫిబ్రవరి 20**

రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో శుక్రవారం ఎండ తీవ్రత పెరిగింది. కర్నూలులో 36.3 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. కాగా, నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం శుక్రవారం బలహీనపడింది. అయితే దీనిపై ఆవరించిన ఉపరితల ఆవర్తనం పశ్చిమ వాయవ్యంగా పయనించి శ్రీలంక వైపు రానున్నది. దీని ప్రభావంతో శని, ఆదివారాల్లో కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. మిగతా జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.

# ట్రంప్ టారిఫ్‌లు చెల్లవ్!

- 6:3మెజారిటీతో తీర్పు వెలువరించిన కోర్టు
- దేశాలతో యుద్ధం చేస్తున్నారా అంటూ వ్యాఖ్యలు
- సిగ్గుచేటైన తీర్పు అంటూ ట్రంప్ మండిపాటు

**న్యూయార్క్/వాషింగ్టన్, ఫిబ్రవరి 20**

ఈ అదనపు టారిఫ్‌ల వడ్డనకు 1977 నాటి ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్ (ఐఈఈపీఏ) చట్టాన్ని ట్రంప్ ఉపయోగించుకున్నారు. అది చెల్లబోదంటూ సుప్రీం కోర్టు కుండబద్దలు కొట్టింది. చట్టసభ అయిన కాంగ్రెస్‌ను కాదని అత్యవసర చట్టాన్ని అడ్డుపెట్టుకుని అధ్యక్షుడే ఇలా స్వయంగా ఏకపక్షంగా టారిఫ్‌లు విధించడం, వాటిలో మార్పుచేర్పులు చేయడం రాజ్యాంగవిరుద్ధమని స్పష్టం చేసింది. 'ఇలా అడ్డగోలు టారిఫ్‌లు విధించేందుకు ప్రపంచంలోని ప్రతి దేశంతోనూ అమెరికా యుద్ధమేమీ చేయడం లేదు!'అంటూ తీవ్రంగా ఆక్షేపించింది. ఈ మేరకు 9 మంది జడ్జీలతో కూడిన బెంచ్ 6:3 మెజారిటీతో సుప్రీంకోర్టు శుక్రవారం సంచలన తీర్పు వెలువరించింది. ఈ తీర్పుతో గత ఏడాది కాలంగా పలు దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లలో చాలావరకు చెల్లకుండా పోయాయి. 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్ (మాగా)'నినాదంతో రెండోసారి అధికార పగ్గాలు చేపట్టిన ట్రంప్, తన ఆర్థిక ఎజెండాకు టారిఫ్‌లనే ప్రధానాంశంగా మార్చుకోవడం తెలిసిందే. టారిఫ్‌లతో పలు దేశాలను బెదిరించి మరీ దార్లోకి తెచ్చుకుంటూ వచ్చారు. ఎమర్జెన్సీ అధికారాలను ఉపయోగించుకుని 2025 ఏప్రిల్ నుంచి కెనడా, చైనా, మెక్సికోలతో మొదలుపెట్టి పలు దేశాలపై వరుసగా టారిఫ్‌లు విధిస్తూ వచ్చారు. దీన్ని సవాలు చేస్తూ డెమొక్రటిక్ పార్టీ ఆధిపత్యంలోని పలు రాష్ట్రాలు కోర్టుకెక్కాయి. ఐఏఏపీఏలో టారిఫ్‌ల గురించిన ప్రస్తావనే లేదని, కనుక ట్రంప్ చర్యలు పూర్తిగా చట్టవిరుద్ధమని వాదించాయి. పలు వ్యాపార సంస్థలు కూడా వ్యక్తిగత హోదాల్లో సవాలు చేశాయి. వాటివల్ల ధరలు పెరిగి సామాన్యునిపైనే భారం పడుతుందని పేర్కొన్నాయి. వాటన్నింటినీ గత సెప్టెంబర్లో విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ట్రంప్ అధిక టారిఫ్‌ల కారణంగా గత డిసెంబర్ నాటికే సుంకాల రూపంలో అమెరికాకు 133 బిలియన్ డాలర్ల మేరకు అధిక ఆదాయం లభించినట్టు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి! తీర్పు నేపథ్యంలో దేశాలన్నీ ఈ అధిక టారిఫ్ మొత్తాలను తిరిగివ్వాల్సిందిగా అమెరికాను డిమాండ్ చేయవచ్చు. అందుకోసం అంతర్జాతీయ న్యాయస్థానం మెట్లెక్కే అవకాశం కూడా ఉంది. ఈ విషయమై పలు కంపెనీలు తీర్పుకు ముందే వ్యక్తిగత హోదాలో దావాలు వేశాయి కూడా. అవన్నీ తాజా తీర్పు పట్ల హర్షం వెలిబుచ్చాయి. వసూలు చేసిన అధిక మొత్తాలను తిరిగివ్వకపోతే కోర్టు తీర్పుకు అర్థమే ఉండదని సదరు కంపెనీలు అభిప్రాయపడ్డాయి. అయితే అధిక టారిఫ్ వసూళ్లను ఆయా దేశాలకు తిరిగి చెల్లించాలా, లేదా అన్న అంశంపై మాత్రం సుప్రీంకోర్టు తీర్పులో ఏమీ పేర్కొనలేదు. ఇది ట్రంప్‌కు కాస్త ఉపశమనం కలిగించే అంశమేనని భావిస్తున్నారు. కోర్టు తీర్పుపై వైట్‌హౌస్ ఇంకా అధికారికంగా స్పందించలేదు. అయితే, ఐఏఏపీఏ కాకుండా ఇతర చట్టాల కింద సుంకాలు విధించకుండా ట్రంప్‌ను తాజా తీర్పు నిరోధించబోదు. ఈ నేపథ్యంలో టారిఫ్‌ల విధివిధానాలను ఇతర చట్టాల కిందకు బదలాయించే అంశాన్ని పరిశీలిస్తున్నట్టు ట్రంప్ యంత్రాంగం శుక్రవారం సంకేతాలిచ్చింది. సుప్రీం కోర్టు తీర్పు అమెరికా స్టాక్‌మార్కెట్లో జోష్ నింపింది. తీర్పు నేపథ్యంలో పలు కీలక సూచీలు శుక్రవారం సానుకూలంగా స్పందించాయి. అమెరికాకు చెందిన పలు చిన్న, మధ్యతరహా వ్యాపార సంస్థలు కూడా తీర్పు పట్ల హర్షం వెలిబుచ్చాయి. టారిఫ్‌లపై సుప్రీంకోర్టులో దాఖలైన ఈ కేసు విచారణకు ట్రంప్ చాలా ప్రాధాన్యమిస్తూ వచ్చారు. దీనిపై వెలువరించే తీర్పు అమెరికా చరిత్రలోనే అత్యంత ముఖ్యమైనదని కానుందని ఆయన పలుమార్లు చెప్పుకొచ్చారు. "సుంకాలకు వ్యతిరేకంగా తీర్పు వస్తే దేశానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బే! దేశ ఆర్థిక వ్యవస్థే పూర్తిగా పట్టాలు తప్పుతుంది"అని హెచ్చరించారు కూడా. కానీ అమెరికాలో ప్రజాభిప్రాయం కూడా ట్రంప్ టారిఫ్‌లకు అంత సానుకూలంగా లేదని పలు సర్వేల్లో వెల్లడవుతూ వచ్చింది. 1977 నాటి చట్టం ప్రకారం అత్యవసర సమయాల్లో దిగుమతులపై అదనపు పన్నులు విధించే అధికారం అధ్యక్షునికి ఉందన్నది ట్రంప్ యంత్రాంగం వాదన. దాన్ని పలువురు అధ్యక్షులు చాలాసార్లు ఉపయోగించుకున్నారని అధికారులు చెబుతూ వచ్చారు. సుప్రీంకోర్టులో న్యాయ శాఖ కూడా తాజాగా ఇదే వాదన వినిపించింది. దానితో కోర్టు ఏకీభవించలేదు. సుంకాల విధింపుకు ఆ చట్టాన్ని ఉపయోగించుకున్న తొలి అధ్యక్షుడు ట్రంపే కావడాన్ని ప్రధాన న్యాయమూర్తి రాబర్ట్స్ తన మెజారిటీ తీర్పులో ఉటంకించారు. "గతంలో ఏ అధ్యక్షుడూ ఐఈఈపీఏ కింద సుంకాలను విధించలేదు. ఆ చట్టం ప్రకారం అధ్యక్షునికి అలాంటి అధికారం లేదనేందుకు ఇదే నిదర్శనం"అని ఆయన పేర్కొన్నారు. పన్నుల విధింపు అధికారాన్ని అమెరికా రాజ్యాంగం కాంగ్రెస్‌కు దఖలు పరిచిందని రాబర్ట్స్ పేర్కొన్నారు. అంతే తప్ప అధ్యక్షుని సారథ్యంలోని కార్యనిర్వాహక విభాగానికి ఆ అధికారాన్ని రాజ్యాంగ రూపకర్తలు ఎప్పుడూ అప్పగించలేదని స్పష్టం చేశారు. టారిఫ్‌లు పన్ను విధింపు కిందకే వస్తాయని గుర్తు చేశారు. ఏకపక్షంగా టారిఫ్‌ల విధింపు ద్వారా అమెరికా ఫెడరల్ చట్టాలను ట్రంప్ ఉల్లంఘించారని ఆయన తేల్చారు. ఈ మేరకు బెంచ్ తరఫున రాబర్ట్స్ మెజారిటీ తీర్పు రాశారు. ముగ్గురు న్యాయమూర్తులు శామ్యూల్‌అలిటో, క్లారెన్స్ థామస్, బ్రెట్ కవనా మాత్రం మెజారిటీ తీర్పుతో విభేదించారు. టారిఫ్‌ల విధింపు సబబేనని పేర్కొన్నారు. వారి తరఫున కవనా తీర్పు వెలువరించారు. "టారిఫ్‌లు తెలివైన విధానం కావచ్చు, కాకపోవచ్చు. కానీ చరిత్రను చూసినా, గత ఉదంతాలను బట్టి చూసుకున్నా వాటి విధింపు పూర్తిగా చట్టబద్ధమే"అని ఆయన స్పష్టం చేశారు. ఆయా దేశాలు, కంపెనీల నుంచి వసూలు చేసిన అధిక టారిఫ్‌లను వాటికి తిరిగి చెల్లించాలా అన్నది చాలా సంక్లిష్టమైన అంశమని జడ్జి కవనా అభిప్రాయపడ్డారు. మెజారిటీ తీర్పులో దాని గురించి ఏమీ పేర్కొనకపోవడాన్ని తన తీర్పులో ఎత్తిచూపారు. అది అతి పెద్ద గందరగోళానికి దారితీయవచ్చని కూడా అభిప్రాయపడ్డారు. తనకు వ్యతిరేకంగా మెజారిటీ తీర్పు వెలువరించిన ఆరుగురు సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో ఇద్దరిని నియమించింది ట్రంపే కావడం విశేషం. నీల్ గోర్సచ్, అమీ కొనీ బారెట్‌లను ట్రంప్ తొలిసారి అధ్యక్షునిగా ఉండగా నియమించారు. వీరితో పాటు, టారిఫ్‌ల విధింపు చట్టబద్ధమేనంటూ మైనారిటీ తీర్పు రాసిన జస్టిస్ బ్రెట్ కవనాను నియమించింది కూడా ట్రంపే. సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పుపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. సుంకాల విధింపు కొట్టివేతను 'సిగ్గుచేటు'గా అభివర్ణించారు. శుక్రవారం ఉదయం పలువురు గవర్నర్లు తదితరులతో ఆయన భేటీ అయ్యారు. అదే సమయంలో తీర్పు వెలువడింది. ఆ విషయాన్ని అధికారులు ట్రంప్ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. 1962 నాటి వర్తక విస్తరణ చట్టంలోని 232 సెక్షన్ ప్రకారం పలు దేశాలపై ట్రంప్ విధించిన టారిఫ్‌లకు సుప్రీంకోర్టు తాజా తీర్పు వర్తించదు. అవి యథాతథంగా కొనసాగుతాయి. ఈ చట్టం ప్రకారం పలు దేశాలపై స్టీలు, అల్యూమినియం, కలప, ఆటోమోటివ్ రంగం తదితరాలపై విధించిన టారిఫ్‌లపై తీర్పు ప్రభావం ఉండబోదు.

# ఎగుమతుల ఇంద్రధనుస్సు

## 7 బూస్టర్ చర్యలు ప్రకటించిన కేంద్రం



**వరల్డ్ మార్కెట్ వైపు సర్కార్ పుష్**
**క్రెడిట్ నుంచి లాజిస్టిక్స్ వరకు సపోర్ట్**
**ఈ-కామర్స్ ఎగుమతులకు ఎక్స్‌ట్రా కేర్**
**రూ. 25 000 కోట్ల మిషన్ స్టార్ట్**
**కొత్త మార్కెట్లు, కొత్త అవకాశాలు**

న్యూఢిల్లీ: దేశ ఎగుమతులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ఏడు కీలక చర్యలను ప్రకటించింది. లోకల్ ప్రొడక్ట్ గ్లోబల్ మార్కెట్ అనే కొత్త గేమ్ చేంజర్ విధానానికి తెరతీసింది. రూ. 25,060 కోట్ల ఎగుమతి ప్రోత్సాహక మిషన్‌లో భాగంగా ఈ చర్యలను అమలు చేయనున్నారు. ఈ--కామర్స్ ఎగుమతి సంస్థలకు రుణ సాయం, ఎగుమతులకు సంబంధించి ప్రత్యామ్నాయ సాధనాలు తదితర చర్యలు ఇందులో ఉన్నాయి. దీంతో చిన్న వ్యాపారులకు ఎగుమతుల పరంగా కొత్త మార్కెట్లలో కొత్త అవకాశాలు దక్కనున్నాయి. ప్రత్యక్ష ఈ--కామర్స్ రుణ సదుపాయం కింద.. రూ.50 లక్షల వరకు రుణాన్ని 90 శాతం హామీపై ఈ--కామర్స్ ఎగుమతి దారులకు ఇవ్వనున్నారు. ఓవర్సీస్ ఇన్వెంటరీ క్రెడిట్ ఫెసిలిటీ కింద రూ.5 కోట్ల వరకు రుణాన్ని 75 శాతం గ్యారంటీ కవరేజీతో ఇవ్వనున్నారు. 2.75 శాతం మేర వడ్డీ రేటులో రాయితీ లభిస్తుంది. ఒక ఏడాదిలో ఇలా ఇచ్చే వడ్డీ రాయితీ గరిష్ట పరిమితి రూ.15 లక్షలు. ఎగుమ తులకు సంబంధించి రావా ల్సిన చెల్లింపులపై రుణ సదుపాయం కలి?పంచడం (ఫ్యాక్టరింగ్) ఇందులో ఒకటి. ఆర్‌బీఐ/ఐఎఫ్ఎస్‌సీఏ నమోదిత కంపెనీల ద్వారా చేసే లావాదేవీలపై ఫ్యాక్టరింగ్ వ్యయంలో 2.75 శాతం వడ్డీ రాయితీగా ఇవ్వనున్నారు. ఎంఎస్ఎంఈల మూలధన నిధుల అవసరాలకు ఇది పరిష్కారం చూపుతుందని కేంద్రం భావిస్తోంది. ఒక ఎంఎస్ఎంఈకి ఏడాదిలో సాయం రూ.50 లక్షలకు పరిమితం. విదేశీ గోదాములు, ఫుల్‌ఫిల్‌మెంట్ సదుపాయాలు, ఈ-కామర్స్ హబ్‌లను ఎగుమతిదారులు వినియోగించుకుని అంతర్జాతీయ పంపిణీ నెట్‌వర్క్‌లతో అనుసంధాన మయ్యేందుకు వీలుగా.. ఆమోదిత ప్రాజెక్టు వ్యయంలో 30 శాతం సాయాన్ని మూడేళ్ల కాలానికి అందించనున్నారు.



## ముగియని 'జీ' కష్టాలు

### నిధుల మళ్లింపునపై సెబీ నోటీసులు

ముంబయి : మీడియా దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ కష్టాలు ముదురుతున్నాయి. నిధుల మళ్లింపు ఆరోపణలు, పాలనాపరమైన లోపాలు, విఫలమైన విలీనాలతో సతమతమవుతున్న జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తాజాగా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. గతంలో సోనీతో జరగాల్సిన కీలక ఒప్పందం కుప్పకూలడానికి ప్రధాన కారణమైన ఈ ఆర్థిక అవకతవకల అంశాన్ని సెబీ మళ్ళీ తవ్వి తీయడం సంస్థకు పెద్ద ఎదురుదెబ్బగా మారింది. కేవలం సంస్థకే కాకుండా.. కీలక బాధ్యతల్లో ఉన్న ఛైర్మన్, సిఇఒలకు సైతం సెబీ నోటీసులు జారీ చేసింది.అంతర్గత ఆర్థిక లావాదేవీలపై సెబీ గత కొన్నేళ్లుగా సాగిస్తున్న సుదీర్ఘ విచారణలో భాగంగా ఈ నోటీసులను అందుకున్నట్లు జీ ధృవీకరించింది. ముంబయి కేంద్రంగా పనిచేస్తున్న ఈ మీడియా దిగ్గజం అత్యున్నత ప్రమాణాలు పాటిస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఏళ్ల తరబడి సాగుతున్న ఈ విచారణలు.. చట్టపరమైన చిక్కులు సంస్థ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి. మరోవైపు రిలయన్స్ వయాకామ్ 18, డిస్నీల విలీనం తర్వాత మీడియా రంగంలో ఏర్పడిన భారీ పోటీని ఎదుర్కోవడానికి సిద్ధమవుతున్న తరుణంలో తాజా నియంత్రణ చర్యలు సంస్థ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

## ఆర్‌బిఐ 10 బిలియన్ డాలర్ల విక్రయం



ముంబయి : అంతర్జాతీయ మార్కెట్‌లో ఇటీవల భారీగా పడిపోతున్న రూపాయి విలువను నిలకడగా ఉంచేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) పెద్ద మొత్తంలో డాలర్లను విక్రయించింది. అమెరికాతో వాణిజ్య ప్రతిష్టంభన, విదేశీ పెట్టుబడుల తరలిపోవడంతో రూపాయి విలువ 92 చేరువలో నమోదు కావడంతో.. దీనిని కట్టడి చేయడానికి డిసెంబర్ నెలలో నికరంగా 10.02 బిలియన్ డాలర్లను విక్రయించింది. ఆర్బీఐ మంత్లీ బులెటిన్ ప్రకారం డిసెంబర్‌లో 18.33 బిలియన్ల కొనుగోళ్లు, 28.35 బిలియన్ల విక్రయాలు జరిగాయి. జనవరిలో కూడా ఒత్తిడి కొనసాగినప్పటికీ.. ఫిబ్రవరిలో భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంతో రూపాయి తిరిగి పుంజుకుందని ఆర్‌బిఐ బులిటన్ పేర్కొంది.

# బిర్యానీ బిల్లులో రూ.70వేల కోట్ల స్కామ్

**ఆరేళ్లలో భారీగా పన్ను ఎగవేతలు**
**తెలుగు రాష్ట్రాల్లో రూ.5వేల కోట్ల మోసం**
**బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో మాయాజాలం**
**ఐటి దాడుల్లో వెల్లడి**



హైదరాబాద్ : బిర్యానీ బిల్లులో భారీ మాయాజాలాన్ని ఐటి అధికారులు గుర్తించారు. హైదరాబాద్‌లోని ఒక బిర్యానీ రెస్టారెంట్ చైన్‌పై ఆదాయపు పన్ను శాఖాధికారులు నిర్వహించిన సాధారణ విచారణ.. దేశవ్యాప్త ఆహార పరిశ్రమలో వేళ్లూనుకున్న ఒక విస్తుపోయే కుంభకోణాన్ని బట్టబయలు చేసింది. బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో జరుగుతున్న అవకతవకలను అధికారులు కృత్రిమ మేధ (ఎఐ) ద్వారా గుర్తించారు. హైదరాబాద్‌లో డొంకలాగితే 2019-20 ఆర్థిక సంవత్సరం నుండి దేశవ్యాప్తంగా వివిధ ఆహార సంస్థలు సుమారు రూ.70,000 కోట్ల మేర విక్రయాలను అధికారిక లెక్కల్లో చూపకుండా దాచిపెట్టినట్లు నిర్ధారించారు. కస్టమర్లు తమ చెల్లింపులు పూర్తి చేసిన వెంటనే బిల్లింగ్ సిస్టమ్స్ నుండి ఆ రికార్డులను పూర్తిగా తొలగించడం లేదా సవరించడం ద్వారా రెస్టారెంట్లు ఈ భారీ పన్ను ఎగవేతకు పాల్పడుతున్నాయి. ఈ అక్రమాలను ఛేదించడానికి ఐటి శాఖ బిగ్ డేటా అనలిటిక్స్, జెనరేటివ్ ఎఐ వంటి అత్యాధునిక సాంకేతికతను ఆయుధంగా వాడుకున్నాయి. మార్కెట్‌లో 10 శాతం వాటా కలిగిన ఒక ప్రముఖ బిల్లింగ్ సాఫ్ట్‌వేర్ ప్లాట్‌ఫారమ్‌ను ట్రాక్ చేసిన అధికారులు.. అహ్మదాబాద్‌లోని ఆ సంస్థ కేంద్రం నుండి దాదాపు 60 టెరాబైట్ల లావాదేవీల డేటాను సేకరించారు.

**ఆరేళ్లలో రూ.2.43 లక్షల కోట్ల విక్రయాలు..**


హైదరాబాద్‌లోని ఆయకర్ భవన్‌లో ఉన్న డిజిటల్ ఫొరెన్సిక్ ల్యాబ్‌లో సుమారు 1,77,000 రెస్టారెంట్ ఐడిలను విశ్లేషించగా.. గత ఆరేళ్లలో జరిగిన రూ.2.43 లక్షల కోట్ల విక్రయాల్లో భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. ఈ సాఫ్ట్‌వేర్‌ను వాడుతున్న రెస్టారెంట్లు ఏకంగా రూ.13,317 కోట్ల విలువైన బిల్లులను రికార్డ్‌లో నమోదయిన తర్వాత సిస్టమ్ నుండి తొలగించినట్లు అధికారులు గుర్తించారు.

రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోనే దాచిపెట్టిన విక్రయాల విలువ రూ.5,141 కోట్లుగా తేలింది. వీటిని ధృవీకరించడానికి తెలుగు రాష్ట్రాల్లోని 40 రెస్టారెంట్లలో జరిపిన భౌతిక తనిఖీల్లోనే రూ.400 కోట్ల అక్రమాలు వెలుగు చూశాయి. పన్ను ఎగవేతలో కర్ణాటక రూ.2,000 కోట్లతో మొదటి స్థానంలో ఉండగా, తెలంగాణ రూ.1,500 కోట్లు, తమిళనాడు రూ.1,200 కోట్లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. సాధారణంగా నగదు రూపంలో జరిగే ఇన్వాయిస్‌లను ఎంపిక చేసి తొలగించడం లేదా రిటర్న్ ఫైల్ చేసే ముందు ఒక రోజు లేదా నెల మొత్తం డేటాను తుడిచివేయడం ద్వారా ఈ మోసం సాగింది. మొత్తం అమ్మకాల్లో దాదాపు 27 శాతం లేదా నాలుగోవంతు వరకు ఇలాగే దాచిపెడుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# 'సూపర్-8' సమయం

**టి20 ప్రపంచకప్‌లో నేటి నుంచి కీలక మ్యాచ్‌లు**
**తొలి పోరులో కివీస్‌తో పాక్ ఢీ**
**రాత్రి 7 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం**






టి20 ప్రపంచ కప్‌లో మరింత వినోదానికి నేటితో తెర లేవనుంది. పసికూనలు, పస లేని జట్లు టోర్నీ నుంచి నిష్క్రమించగా టాప్-8 టీమ్‌లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాయి. 'సూపర్ ఎయిట్స్'లో భాగంగా నేడు జరిగే తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్‌తో మాజీ చాంపియన్ పాకిస్తాన్ తలపడుతుంది. గ్రూప్ 'ఎ'లో మూడు మ్యాచ్‌లు గెలిచి పాక్ ముందంజ వేయగా, గ్రూప్ 'డి' నుంచి కూడా మూడు విజయాలతో కివీస్ తర్వాతి దశకు అర్హత సాధించింది. కొలంబో: పాకిస్తాన్, న్యూజిలాండ్ జట్లు ఇటీవల వన్డేలు, టి20 ఫార్మాట్‌లలో తరచుగా తలపడ్డాయి. రెండున్నరేళ్ల వ్యవధిలో ఇరు జట్ల మధ్య 41 మ్యాచ్‌లు జరగ్గా... ఇందులో 17 వన్డేలు, 24 టి20లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యర్థి బలాబలాల గురించి ఇరు జట్లకు మంచి అవగాహన ఉంది. ద్వైపాక్షిక సిరీస్‌లను మినహాయిస్తే... 2022 టి20 ప్రపంచ కప్‌లో సెమీఫైనల్ మ్యాచ్ తర్వాత రెండు జట్లు ఒక పెద్ద టోర్నీలో పోటీకి దిగడం ఇదే తొలిసారి. న్యూజిలాండ్ జట్టు లీగ్ దశను దాటినా... అంచనాలకు తగినట్లుగా ఆడలేకపోతోంది. సీఫెర్ట్, అలెన్ మాత్రమే బ్యాటింగ్‌లో ఫర్వాలేదనిపించగా... రచిన్ రవీంద్ర, ఫిలిప్స్, డరైల్ మిచెల్ నుంచి చెప్పుకోదగ్గ ప్రదర్శన రాలేదు. బౌలింగ్‌లో కూడా డఫీ, సోధి భారీగా పరుగులిస్తున్నారు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ వైఫల్యం కూడా వరల్డ్ కప్‌లో జట్టును ఇబ్బంది పెట్టింది. ఇలాంటి స్థితిలో వరల్డ్ కప్ ఆశలు మిగలాలంటే కివీస్ బృందం సత్తా చాటాల్సి ఉంది. మరోవైపు పాకిస్తాన్‌కు తమ మ్యాచ్‌లన్నీ శ్రీలంకలోనే ఆడటం కాస్త కలిసొచ్చే అంశం. ముఖ్యంగా ప్రేమదాస స్టేడియంలో భారత్‌తో మ్యాచ్ ఆడిన ఆ జట్టుకు పిచ్ పరిస్థితిపై మంచి అవగాహన ఉంది. అందుకే తమ స్పిన్ బలగాన్ని జట్టు నమ్ముకుంది. ప్రధాన పేసర్ షాహిన్ అఫ్రిది ఘోరంగా విఫలం కాగా... మరో పేసర్ ఫహీమ్ ఒక్క ఓవర్ కూడా బౌలింగే చేయలేదు. స్పిన్నర్లు ఉస్మాన్ తారిఖ్, అబ్రార్, షాదాబ్, నవాజ్‌లపై జట్టు ఆశలు పెట్టుకుంది. అయితే బ్యాటింగ్‌లో ఫర్హాన్ మినహా సయీమ్ అయూబ్, సల్మాన్, బాబర్ ఆజమ్ ఒక్కటి కూడా చెప్పుకోదగ్గ ఇన్నింగ్స్ ఆడలేదు. తాజా పరిస్థితిని బట్టి చూస్తే ఇరు జట్లు ఫామ్‌లో సమ ఉజ్జీలుగానే కనిపిస్తున్నాయి కాబట్టి ఆసక్తికర పోరు ఖాయం. మ్యాచ్ రోజున వర్షసూచన ఉంది.

## నేటి నుంచి సూపర్-8 మ్యాచ్‌లు

**పాకిస్తాన్ ఐ న్యూజిలాండ్ ఢీ**
**లీగ్ దశ దాటని ఆసీస్, ఆఫ్ఘన్**

ముంబయి: ఆస్ట్రేలియా, ఒమన్ జట్ల మధ్య పల్లెకెలె వేదికగా శుక్రవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌తో 9వ ఐసిసి టి20 ప్రపంచకప్-2026 లీగ్ మ్యాచ్‌లు ముగిసాయి. టి20 ప్రపంచకప్ మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా, సంచలన ఆఫ్ఘనిస్తాన్ ఈసారి సూపర్-8కు చేరడంలో విఫలమయ్యాయి. ఇక కరేబియన్ జట్టు జింబాబ్వే ఈసారి మెగా టోర్నీలో అంచనాలకు మించి రాణించింది. ఆ జట్టు ఆస్ట్రేలియాతోపాటు, ఆతిథ్య శ్రీలంకను ఓడించి గ్రూప్ టాపర్‌గా నిలిచింది. ఫిబ్రవరి 6న 20 జట్లతో ప్రారంభమైన 2026 టి20 ప్రపంచకప్ టోర్నీ టైటిల్ రేసులో 8జట్లు మాత్రమే ముందజ వేసాయి. 12జట్లు లీగ్ దశలోనే నిష్క్రమించాయి. ఆ ఎనిమిది జట్లను గ్రూప్-1, గ్రూప్-2గా విభజించగా.. గ్రూప్-1లో భారత్, వెస్టిండీస్, జింబాబ్వే, దక్షిణాఫ్రికా, గ్రూప్-2లో పాకిస్తాన్, ఇంగ్లండ్, శ్రీలంక, న్యూజిలాండ్ జట్లు ఉన్నాయి. ప్రతి గ్రూప్ టాప్-2 జట్లు సెమీస్‌కు చేరనుండగా.. మార్చి 4, 5 తేదీల్లో సెమీఫైనల్స్, 8 ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనుంది.పల్లెకెలె వేదికగా శుక్రవారం జరిగిన గ్రూప్-బి చివరి లీగ్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా జట్టు 9 వికెట్ల తేడాతో ఒమన్‌ను చిత్తుచేసింది. ఒమన్ 16.2ఓవర్లలో 104పరుగులకు ఆలౌట్ కాగా.. ఆ లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 9.4ఓవర్లలో వికెట్ కోల్పోయి 108పరుగులు చేసి గెలిచింది.



SUPER 8
ALL FIXTURES

| | | | | |
|---|---|---|---|---|
| Saturday, 21 February | NEW ZEALAND | V | PAKISTAN | Colombo |
| Sunday, 22 February | SRI LANKA | V | ENGLAND | Kandy |
| Sunday, 22 February | INDIA | V | SOUTH AFRICA | Ahmedabad |
| Monday, 23 February | ZIMBABWE | V | WEST INDIES | Mumbai |
| Tuesday, 24 February | ENGLAND | V | PAKISTAN | Kandy |
| Wednesday, 25 February | SRI LANKA | V | NEW ZEALAND | Colombo |
| Thursday, 26 February | WEST INDIES | V | SOUTH AFRICA | Ahmedabad |
| Thursday, 26 February | INDIA | V | ZIMBABWE | Chennai |
| Friday, 27 February | ENGLAND | V | NEW ZEALAND | Colombo |
| Saturday, 28 February | SRI LANKA | V | PAKISTAN | Kandy |
| Sunday, 1 March | ZIMBABWE | V | SOUTH AFRICA | Delhi |
| Sunday, 1 March | INDIA | V | WEST INDIES | Kolkata |
| Wednesday, 4 March | | SEMI FINAL 1 | | Kolkata/Colombo |
| Thursday, 5 March | | SEMI FINAL 2 | | Mumbai |
| Sunday, 8 March | | FINAL | | Ahmedabad/Colombo |




## నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో భారత్ చివరి టి20

అడిలైడ్: పొట్టి ఫార్మాట్‌లో మిగిలిపోయిన ఆఖరి పోరులో గట్టిగా పోరాడి పైచేయి సాధించేందుకు భారత్, ఆస్ట్రేలియా మహిళల జట్లు 'సై' అంటున్నాయి. ఇరుజట్ల మధ్య శనివారం ఇక్కడ ఆఖరి టి20 మ్యాచ్ జరుగనుంది. ఈ ఒక్క టి20లకే పరిమితం కాని ఈ పర్యటనలో సిరీస్ గెలవాలంటే ఇంకా రెండు ఫార్మాట్లలోనూ సత్తా చాటాల్సి ఉంటుంది. ఇక ప్రస్తుత టి20ల్లో ఇరు జట్లు ఒక్కో మ్యాచ్ గెలిచి 1--1తో సమంగా నిలిచాయి. నేడు జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఓవరాల్ సిరీస్‌లో 4--2 పాయింట్లతో (మ్యాచ్ విజేతకు 2 పాయింట్లు) ఆధిక్యం సంపాదిస్తుంది. దీంతో తదుపరి మూడు వన్డేలు, ఏకైక టెస్టు సిరీస్‌లకు కావాల్సినంత ఆత్మవిశ్వాసాన్ని సంపాదించుకోవచ్చు. ప్రస్తుతం హర్మన్‌ప్రీత్ సారథ్యంలోని టీమిండియా లక్ష్యం కూడా సిరీస్ కాదు... నేటి మ్యాచ్ విజయమే! ఇదే జట్టులో స్థయిర్యాన్ని పెంచుతుందని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. తొలి మ్యాచ్‌లో వర్షంతో డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో నెగ్గిన హర్మన్ బృందం... పూర్తిస్థాయిలో జరిగిన రెండో టి20లో చేతులెత్తేసింది. ఆతిథ్య ఆసీస్ నిర్దేశించిన 164 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్, వైస్ కెపట?టన్ స్మృతి మంధాన ఇద్దరే 30 పైచిలుకు పరుగులు చేస్తే... ప్రధాన బ్యాటింగ్ బలం క్రీజులోకి దిగిన వారంతా ఆసీస్ బౌలింగ్‌కు దాసోహమయ్యారు. అదే ఈ మ్యాచ్‌లో పునరావృతం చేస్తే వన్డే సిరీస్‌కు ముందే టీమిండియా వెనుకబడిపోతుంది.

## మార్ష్ విధ్వంసం.. పసికూనను చిదిమేసిన ఆసీస్

టీ20 ప్రపంచకప్ 2026 చివరి గ్రూప్ స్టేజీ మ్యాచ్‌లో మాజీ ఛాంపియన్ ఆస్ట్రేలియా పసికూన ఒమన్‌పై ప్రతాపం చూపింది. తొలుత బౌలింగ్‌లో 104 పరుగులకే (16.2 ఓవర్లలో) ఒమన్‌ను ఆలౌట్ చేసి, ఆతర్వాత లక్ష్యాన్ని 9.4 ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. తద్వారా 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది.ఈ మ్యాచ్ ఫలితంతో సంబంధం లేకుండా ఇరు జట్లు ఇదివరకే టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. ఈ టోర్నీలో భారత్, సౌతాఫ్రికా, వెస్టిండీస్, జింబాబ్వే, న్యూజిలాండ్, ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్తాన్ ఇదివరకే సూపర్-8కి చేరాయి. సూపర్-8 మ్యాచ్‌లు రేపటి నుంచి ప్రారంభమవుతాయి.ఒమన్ పతనాన్ని స్పిన్నర్లు ఆడమ్ జంపా (3.2-0-21-4), గ్లెన్ మ్యాక్స్‌వెల్ (3-0-13-2) శాశించారు. పేసర్లు జేవియర్ బార్ట్‌లెట్ (4-0-27-2), నాథన్ ఇల్లిస్ (2-0-14-1), మార్కస్ స్టోయినిస్ (2-0-16-1) కూడా పర్వాలేదనిపించారు. మొత్తంగా ఆసీస్ బౌలర్ల ధాటికి ఒమన్ ఆటగాళ్లు విలవిలలాడిపోయారు.

# గ్రీన్ టీ కాదు.. గ్రీన్ కాఫీని ఎప్పుడైనా రుచి చూశారా?



## ఇది తాగితే శరీరంలో జరిగే మార్పులివే..



బరువు తగ్గడానికి చాలా మంది గ్రీన్ టీని ఎంచుకుంటారు. అయితే మీకు తెలుసా.. గ్రీన్ టీ మాత్రమే కాదు. గ్రీన్ కాఫీ కూడా ఉంది. ఇది కూడా త్వరగా బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. వినడానికి మీకు ఆశ్చర్యకరంగా ఉన్నా.. గ్రీన్ కాఫీ పేరు చాలా మందికి తెలియదు. గ్రీన్ కాఫీ ఎక్కడ దొరుకుతుంది? తాగితే ఏమౌతుంది? వంటి ఎన్నో విషయాలు మీ కోసం. గ్రీన్ టీ లాగా, గ్రీన్ కాఫీ కూడా ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది ఆరోగ్యకరమైన పానీయం. గ్రీన్ కాఫీని ఆహారంలో చేర్చుకోగలిగితే బరువు తగ్గడమే కాకుండా అనేక రకాల వ్యాధుల నుంచి బయటపడతారు. గ్రీన్ కాఫీ బీన్స్ నుంచి గ్రీన్ కాఫీ తయారు చేస్తారు. గ్రీన్ కాఫీ సహజ రుచిని తీసుకురావడానికి దీనిని వేయించరు. గ్రీన్ కాఫీలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయనే భయంతో మధుమేహ వ్యాధిగ్రస్తులు టీ, కాఫీలు తాగకూడదని అనుకుంటారు. అయితే గ్రీన్ కాఫీతో ఆ భయం లేదు. రోజువారీ జాబితాలో గ్రీన్ కాఫీని చేర్చుకోవచ్చు. గ్రీన్ కాఫీ తాగడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరగవు. ఇందులో చక్కెరను కలుపుకోకూడదు. చక్కెర కలిపిదే ప్రయోజనానికి బదులుగా హాని జరుగుతుంది. గ్రీన్ కాఫీ మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఔషధంలా పనిచేస్తుంది. గ్రీన్ కాఫీ తాగడం వల్ల శరీరంలోని టాక్సిన్స్ తొలగిపోతాయి. గ్రీన్ కాఫీ శరీరాన్ని డిటాక్స్‌ఫై చేయడానికి పనిచేస్తుంది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది చర్మం, జుట్టు సంరక్షణకు ఉపయోగపడుతుంది.

# అందుకే పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలట.. ఎన్ని లాభాలో



చాలా మంది మహిళలు ప్రతి నెలా పీరియడ్స్ టైంలో భరించలేని కడుపు నొప్పిని అనుభవిస్తుంటారు. దీనివల్ల ఆఫీస్‌కు వెళ్లడం కష్టంగా మారుతుంది. కడుపు నొప్పి, తిమ్మిర్లు, ఉబ్బరం కారణంగా ఏమీ తినాలని అనిపించదు. చాలా అసౌకర్యంగా ఉంటుంది. మీకు కూడా ఇలాంటి రోజుల్లో సమస్యలు తలెత్తితే ఈ కింది జాగ్రత్తలు తీసుకోండి. ఈ జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా పీరియడ్స్ సమయంలో వచ్చే సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఐరన్ అధికంగా ఉండే బెల్లం సర్వరోగనివారిణి పీరియడ్స్ సమయంలో చిన్న బెల్లం ముక్క తినాలి. ఇది కడుపు నొప్పి నుంచి తక్షణ ఉపశమనం ఇచ్చి, శక్తిని ఇస్తుంది. బెల్లంలో చాలా ఎక్కువ మొత్తంలో ఐరన్ లభిస్తుంది. ఇది తీసుకోవడం వల్ల శరీరానికి తక్షణ శక్తిని అందుతుంది. ఇది పీరియడ్స్ సమయంలో రక్త నష్టాన్ని కూడా భర్తీ చేస్తుంది. బెల్లం ఉపయోగం రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. పీరియడ్స్ సమయంలో వచ్చే తిమ్మిరి నుంచి ఉపశమనం అందిస్తుంది. అలాగే రక్తం కొరత ఉండదు. దీనితో పాటు పీరియడ్స్ సమయంలో ఐరన్ పుష్కలంగా ఉండే పాలకూర, దానిమ్మ, బీట్‌రూట్ వంటి వాటిని కూడా తీసుకోవాలి. బెల్లం తినడం వల్ల కడుపునొప్పి నుంచి తక్షణ ఉపశమనం లభించి, నొప్పిని కూడా తగ్గిస్తుంది. బెల్లంలోని మెగ్నీషియం, పొటాషియం వంటి పోషకాలు కండరాలను రిలాక్స్ చేసి, తిమ్మిరి నుంచి ఉపశమనాన్ని అందిస్తాయి. మానసిక స్థితిని మెరుగుదల పీరియడ్స్ సమయంలో బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. చిరాకు తగ్గుతుంది. బెల్లం వాడకం వల్ల శరీరంలో సంతోషకరమైన హార్మోన్లు పెరుగుతాయి. దీని కారణంగా ఎక్కువ రిలాక్స్‌గా ఉంటారు. జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది చాలా మంది మహిళలు పీరియడ్స్ సమయంలో మలబద్ధకం, ఉబ్బరం సమస్యతో ఇబ్బంది పడుతుంటారు. పీరియడ్స్ సమయంలో బెల్లం తప్పనిసరిగా తీసుకోవాలి. ఎందుకంటే ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. పీరియడ్స్ సమయంలో హార్మోన్లలో మార్పుల కారణంగా మానసిక అస్థిరత ఏర్పడుతుంది. బెల్లం తినడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. పోషకాహార నిపుణులు ప్రకారం.. పీరియడ్స్ ప్రారంభానికి 4 నుంచి 5 రోజుల ముందు నుంచే.. బెల్లం తీసుకోవడం ప్రారంభించాలి.

# రోజూ ఈ మొక్క ఆకులు నాలుగైదు నోట్లో వేసుకుంటే ఏ రోగం దరిచేరదు..



తులసి దాదాపు ప్రతి ఇంట్లో కనిపించే మొక్క. చాలా సులభంగా పెరుగుతుంది. ఈ చిన్న మొక్క శరీరం నుంచి ఎన్నో వ్యాధులను దూరం చేస్తుంది. ఇంట్లో తులసి చెట్టు తప్పకుండా పెంచుకోవాలని మన పూర్వీకుల కాలం నుంచి పెద్దలు చెబుతుంటారు. ఈ మొక్కలో ఎన్నో ఔషధ గుణాలు నిండి ఉంటాయి. ఆయుర్వేదంలో కూడా దీనికి అధిక ప్రాముఖ్యత ఉంది. తులసి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఇది యాంటీఆక్సిడెంట్‌గా ఉండటమే కాకుండా, యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఈ అంశాలన్నీ అనేక వ్యాధుల నుంచి రక్షిస్తాయి. తులసి ఆకులు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కూడా సహాయపడతాయి. అంటే ఒక్క మాటలో చెప్పాలంటే ఈ ఆకు వల్ల కలిగే లాభాలు అన్నీఇన్నీకావు. తులసిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇది జలుబు, దగ్గు నుంచి ఉపశమనం కలిగిస్తుంది. తులసి జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అంతే కాకుండా ఒత్తిడిని తగ్గించడంలో కూడా ఇది ఉపయోగపడుతుంది. తులసి రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడుతుంది. గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి తులసి ఆకులు ప్రభావవంతంగా పనిచేస్తాయి. ఇది జ్వరం, చర్మం, జుట్టుకు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది. రోజూ నాలుగైదు తులసి ఆకులను తింటే ఎన్నో రోగాల నుంచి విముక్తి లభిస్తుంది. అయితే సరైన పద్ధతిలో తింటేనే ఈ ప్రయోజనాలన్నీ పొందవచ్చు. తులసితో టీ కూడా తాగవచ్చు. దీని ఆకులను ఎండబెట్టి, నీటిలో మరిగించి అయినా తాగొచ్చు

# అల్లాన్ని నేరుగా తినలేరా..?



అయితే అల్లం పాలను తయారు చేసి తాగండి.. ఎన్నో లాభాలను పొందవచ్చు..! అల్లంను మనం నిత్యం అనేక రకాల వంటల్లో వేస్తూనే ఉంటాం. ముఖ్యంగా మసాల వంటకాల్లో అల్లాన్ని ఎక్కువగా ఉపయోగిస్తారు. అల్లంను వేయడం వల్ల వంటలకు చక్కని రుచి, వాసన వస్తాయి. ఆయుర్వేద ప్రకారం అల్లంలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కనుక అల్లాన్ని నేరుగా తినమని లేదా అల్లం రసం సేవించాలని వైద్యులు సూచిస్తుంటారు. అయితే అల్లం ఘాటుగా ఉంటుంది కనుక దీన్ని కొందరు నేరుగా తినలేరు. కానీ అల్లాన్ని పాలలో వేసి మరిగించి కూడా తీసుకోవచ్చు. ఇలా తీసుకున్నా కూడా ఆరోగ్యకర ప్రయోజనాలు కలుగుతాయి. అల్లం, పాలు కాంబినేషన్ చాలా శక్తివంతంగా పనిచేస్తుంది. ఈ మిశ్రమం అనేక లాభాలను అందిస్తుంది. అల్లం పాలను రోజూ తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. పలు వ్యాధులు సైతం అవుతాయి.

# మీ చర్మం ఆరోగ్యంగా ఉండడంతోపాటు ముఖ సౌందర్యం పెరగాలంటే.. రోజూ ఈ పండ్లను తినాలి..!



చర్మం మృదువుగా,తేమగా ఉండడంతోపాటు సురక్షితంగా ఉండాలని, కాంతివంతంగా మారి మెరవాలని చాలా మంది కోరుకుం టుంటారు. అందులో భాగంగానే చర్మ సంరక్షణకు అనేక మార్గాలను అనుసరిస్తుంటారు. కొందరు బ్యూటీ పార్లర్ చికిత్సలను తీసుకుంటారు. ఇంకా కొందరు ఇంట్లోనే పలు చిట్కాలను పాటిస్తుంటారు. అయితే చర్మ సౌందర్యం, సంరక్షణ కోసం ఆయా చికిత్సలను, చిట్కాలను పాటించడం సరైందే అయినప్పటికీ ఆహారం విషయంలోనూ మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. మనం తినే ఆహారం సరిగ్గా ఉంటేనే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. చర్మ సంరక్షణకు ఆహారం కూడా చాలా ముఖ్యమైందే అన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. ఈ క్రమంలోనే పలు రకాల పండ్లను రోజువారి ఆహారంలో భాగం చేసుకుంటే దాంతో చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఇక ఆ పండ్లు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. **బెర్రీలు, సిట్రస్ ఫలాలు..** స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప బెర్రీల వంటి బెర్రీ పండ్లను రోజూ తింటుంటే చర్మాన్ని సురక్షితంగా ఉంచుకోవచ్చు. ఈ పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లతోపాటు విటమిన్ సి అధిక మొత్తంలో ఉంటుంది. ఇవి చర్మాన్ని దృఢంగా మార్చి యవ్వనంగా ఉండేలా చేస్తాయి. ఈ పండ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్ల వల్ల ఫ్రీ ర్యాడికల్స్ తొలగిపోతాయి. దీని వల్ల కణాలకు జరిగే నష్టం నివారించబడుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలు రాకుండా అడ్డుకోవచ్చు. చర్మం మృదువుగా మారి కాంతివంతంగా ఉంటుంది. యవ్వనంగా కనిపిస్తారు. అలాగే సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లను కూడా తింటుండాలి. ఈ పండ్లలోనూ విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది కొల్లాజెన్ ఉత్పత్తికి సహాయం చేస్తుంది. దీని వల్ల చర్మం సాగే గుణాన్ని పొందుతుంది. ముఖంపై ఉండే ముడతలు తగ్గిపోతాయి. ఈ పండ్లను తింటుంటే చర్మం కాంతివంతంగా మారుతుంది. ముఖంపై ఉండే నల్లని మచ్చలు, మొటిమలు తొలగిపోతాయి. చర్మం సురక్షితంగా ఉంటుంది. **బొప్పాయి పండ్లు..** బొప్పాయి పండ్లు మనకు ఏడాది పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ పండ్లు మన చర్మానికి ఎంతో మేలు చేస్తాయి. ఈ పండ్లలో పపైన్ అనే ఎంజైమ్ ఉంటుంది. ఇది ఎక్స్‌ఫోలియేటింగ్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక చర్మంపై ఉండే మృతకణాలు తొలగిపోతాయి. బొప్పాయి పండ్లలో ఉండే వటమిన్లు ఎ, సి, ఇ వల్ల మొటిమలు తగ్గి చర్మం కాంతివంతంగా మారుతుంది. నల్లని మచ్చలు తొలగిపోతాయి. బొప్పాయిలో ఉండే యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాల వల్ల చర్మ వాపులు తగ్గిపోతాయి. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. దానిమ్మ పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో పాలిఫినాల్స్‌తోపాటు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి సూర్యుని నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల బారి నుంచి చర్మాన్ని రక్షిస్తాయి. ఈ పండ్లలో యాంటీ ఏజింగ్ గుణాలు ఉంటాయి. కనుక వీటిని తింటే వృద్ధాప్య ఛాయలు తగ్గుతాయి. యవ్వనంగా కనిపిస్తారు. ముఖ సౌందర్యం పెరుగుతుంది. **అరటి పండ్లు..** అరటి పండ్లలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందిస్తుంది. ఈ పండ్లలో విటమిన్లు ఎ, బి, ఇ అధికంగా ఉంటాయి. కనుక అరటి పండ్లను తింటే పొడి చర్మం ఉన్నవారికి మేలు జరుగుతుంది. అరటి పండ్లను ఫేస్ ప్యాక్‌గా కూడా ఉపయోగించవచ్చు. దీంతో ముఖానికి కావల్సిన తేమ, మృదుత్వం లభిస్తాయి. ముఖం కాంతివంతంగా మారి మెరుస్తుంది. పుచ్చకాయలు, కీరదోసలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వీటిల్లో నీరు అధిక మొత్తంలో ఉంటుంది. ఇది చర్మానికి కావల్సిన తేమను అందించి చర్మం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. వీటిల్లో విటమిన్లు ఎ, సి సమృద్ధిగా ఉంటాయి. అందువల్ల ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎల్లప్పుడూ యవ్వనంగా కనిపించాలంటే వీటిని తరచూ తింటుండాలి. అదేవిధంగా ద్రాక్ష పండ్లను తింటున్నా కూడా చర్మానికి మేలు జరుగుతుంది. ఈ పండ్లలో రెస్వెరెట్రాల్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేస్తుంది. చర్మాన్ని సూర్య కిరణాల బారి నుంచి రక్షిస్తుంది. చర్మం ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. ఇలా ఆయా పండ్లను రోజూ తింటుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. కాంతివంతంగా మారి మెరుస్తుంది. వృద్ధాప్య ఛాయలు రాకుండా యవ్వనంగా ఉంటారు.

# రాత్రి పూట మీరు తినే ఆహారంలో వీటిని చేర్చుకోండి.. అధిక బరువును సులభంగా తగ్గించుకోవచ్చు..



అధికంగా బరువు ఉన్నవారు రాత్రి పూట భోజనాన్ని త్వరగా ముగిస్తుంటారు. రాత్రి పూట తినే ఆహారంలో చపాతీలను చేర్చుకుంటారు. అంతే కాదు రాత్రి పూట ఆహారాన్ని తక్కువగా తింటారు. ఇలా బరువు తగ్గాలనుకునే వారు రాత్రి భోజనం పట్ల అనేక జాగ్రత్తలను పాటిస్తుంటారు. అయితే బరువు తగ్గాలంటే పలు ఆహారాలు ముఖ్య పాత్ర పోషిస్తాయి. సరైన పోషకాలు ఉండే ఆహారాలను తింటే బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ క్రమంలోనే రాత్రి పూట కొన్ని రకాల ఆహారాలను తీసుకోవడం వల్ల సులభంగా బరువు తగ్గుతారు. వీటిల్లో అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా కలుగుతాయి. అధిక బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్న వారు రాత్రి పూట ఈ ఆహారాలను తీసుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. స్కిన్‌లెస్ చికెన్, చేపలు, కూరగాయలు..రాత్రి పూట ఆహారంలో స్కిన్ లెస్ చికెన్ తినవచ్చు. ఇది అద్భుతమైన ప్రోటీన్లను అందిస్తుంది. అలాగే రాత్రి పూట ఆహారంలో చేపలను తింటున్నా మేలు జరుగుతుంది. చేపల్లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. సోయా టోఫులో వృక్ష సంబంధ ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించ దంతోపాటు బరువు తగ్గేందుకు దోహదం చేస్తాయి. పప్పు దినుసులు, శనగలను తింటున్నా కూడా ఫలితం ఉంటుంది. వీటిల్లో ఫైబర్, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. ఇవి బరువు తగ్గేలా చేస్తాయి. పిండి పదార్థాలు చాలా తక్కువగా ఉండే కూరగాయలను రాత్రి పూట తినాల్సి ఉంటుంది. పాలకూర, బ్రోకలీ, కాలిఫ్లవర్, మొలకలు, క్యాప్సికం, పుట్ట గొడుగులు, గ్రీన్ బీన్స్ వంటి ఆహారాలను రాత్రి పూట తింటుంటే మేలు జరుగుతుంది. కినోవా, బ్రౌన్ రైస్.. సంక్లిష్టమైన పిండి పదార్థాలు ఉండే ఆహారాలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. కినోవా, బ్రౌన్ రైస్, చిలగడదుంపలు వంటి వాటిల్లో సంక్లిమైన పిండి పదార్థాలు ఉంటాయి. ఇవి రక్తంలో గ్లూకోజ్‌గా మారేందుకు సమయం పడుతుంది. పైగా వీటిని కాస్త తిన్నా చాలు, వీటిల్లో ఉండే ఫైబర్ కారణంగా కడుపు నిండిన భావన కలుగుతుంది. ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇలా ఇవి బరువు తగ్గేందుకు సహాయం చేస్తాయి. ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండే ఆహారాలను కూడా రాత్రి పూట తినవచ్చు. అవకాడో, బాదంపప్పు, వాల్ నట్స్, చియా సీడ్స్‌ను రాత్రి పూట తినవచ్చు. అలాగే ఆలివ్ ఆయిల్‌ను కూడా తీసుకోవచ్చు. ఇవన్నీ రాత్రి పూట తీసుకోదగిన ఆహారాలు. అలాగే బరువు తగ్గేందుకు కూడా ఇవి ఎంతగానో దోహదం చేస్తాయి. ఈ కాంబినేషన్ ట్రై చేయండి.. రాత్రిపూట ఆహారంలో చేపలను, కూరగాయలను కలిపి కాంబినేషన్‌లో తినవచ్చు. లేదా చికెన్, వెజిటబుల్ సలాడ్, ఫ్రూట్ సలాడ్ వంటి వాటిని కలిపి తీసుకోవచ్చు. బ్రౌన్ రైస్, వెజిటబుల్ సూప్‌ను కలిపి తీసుకోవచ్చు. సోయా టోఫు, కూరగాయలను కలిపి కూడా తినవచ్చు. ఇలా రాత్రి పూట భోజనాన్ని ప్లాన్ చేసుకోవచ్చు. అయితే ఆరోగ్యకరమైన ఆహారాలను తిన్నప్పటికీ వీటిని రాత్రి పూట తక్కువ మోతాదులోనే తినాలి. ఇతర ఆహారాలతో పోలిస్తే ఇవి బరువు తగ్గేందుకు మనకు ఎంతో ఉపయోగపడతాయి. కానీ ఎక్కువ మోతాదులో మాత్రం తినకూడదు. ఇక రాత్రి పూట భోజనాన్ని వీలైనంత త్వరగా తినేయాల్సి ఉంటుంది. భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 2 నుంచి 3 గంటల వ్యవధి ఉండేలా చూసుకోవాలి. చక్కెర ఉండే ఆహారాలు, ప్రాసెస్ ఫుడ్స్, శీతల పానీయాలను తాగకూడదు. ఇలా ఆహారపు అలవాట్లను పాటిస్తుంటే అధిక బరువును చాలా తేలిగ్గా తగ్గించుకోవచ్చు.

నినాదం
నిఖార్సైన జర్నలిజం



# సూపర్ 8 కోసం టీం ఇండియా భారీ మార్పులు!

టీ' 20 ప్రపంచ కప్ 2026లో సూపర్ 8 దశ పోటీ ఫిబ్రవరి 21న ప్రారంభమవుతుంది. తదుపరి దశకు చేరుకునే ఎనిమిది జట్లను నాలుగు జట్లు చొప్పున రెండు గ్రూపులుగా విభజించారు. టీం ఇండియా తన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచి గ్రూప్ దశలో అగ్రస్థానంలో నిలిచింది. సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీలో, టీం ఇండియా స్పష్టంగా బాగా రాణిస్తోంది, కానీ ఖూాా, నెదర్లాండ్స్ వంటి జట్లు భారత బౌలింగ్ లోపాలను బహిర్గతం చేశాయి. ఇది కాస్త ఆందోళన కలిగిస్తోంది. గ్రూప్ దశలో, ఇషాన్ కిషన్ నుంచి వరుణ్ చక్రవర్తి, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వరకు అందరూ బాగా రాణించారు. అయితే, కొంతమంది ఆటగాళ్ళు అంచనాలను అందుకోలేకపోయారు. వారి ప్రదర్శన ఆధారంగా సూపర్ 8 నుంచి ఎలిమినేట్ అయ్యే అవకాశం ఉంది. వారిలో ముగ్గురు ఆటగాళ్ల పేర్లు ఎక్కువగా వినిపిస్తోంది. 2025లో అభిషేక్ శర్మ 859 పరుగులు చేశాడు. అదే బ్యాట్స్‌మన్ 2026 ు20 ప్రపంచ కప్‌లో మొదటి మూడు ఇన్నింగ్స్‌లలో తన ఖాతా తెరవడంలో విఫలమయ్యాడు. దీంతో ఏం జరుగుతోందనే అనుమానం చాలా మందిలో కనిపిస్తోంది. ప్రపంచ కప్‌లో అభిషేక్ శర్మ ఇప్పటికే 0 పరుగులకే హ్యాట్రిక్ అవుట్‌లను సాధించాడు. గ్రూప్ దశ కంటే సూపర్ 8 దశ చాలా కఠినంగా ఉంటుంది. జట్టుకు గట్టి సవాల్‌గా మారనుంది. అభిషేక్ పేలవమైన ఫామ్ టీమ్ ఇండియా ప్రపంచ



కప్ గెలవాలనే ఆశలకు ఆటంకం కలిగించక ముందే అతన్ని ప్లేయింగ్ 11 నుంచి తొలగించే అవకాశం


ఉంది.గ్రూప్ దశలో రింకు సింగ్ నాలుగు మ్యాచ్‌లు కూడా ఆడాడు. ఖూాాతో జరిగిన మ్యాచ్‌లో, అతను 14 బంతుల్లో కేవలం 6 పరుగులు మాత్రమే చేయగలిగాడు. అప్పటి నుంచి అతను మూడు ఇన్నింగ్స్‌లలో 6, 4, 4 బంతులను ఎదుర్కొన్నాడు. అతనికి ఎక్కువగా 7 స్థానంలో బ్యాటింగ్‌కు వస్తున్నాడు. కానీ వాషింగ్టన్ సుందర్ రాకతో, రింకును ప్లేయింగ్ ఎలెవన్ నుంచి తొలగించవచ్చు. రింకు ఎక్కువ బంతులు ఆడలేదు, కాబట్టి అతను పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. అయితే, వాషింగ్టన్ సుందర్ బ్యాటింగ్‌లో కూడా ఇలాంటి పాత్ర పోషించగలడు, అతని రాక బౌలింగ్ విభాగాన్ని పటిష్టం అవుతుంది. అర్ష్‌దీప్ సింగ్ ఆడతాడా లేదా కొత్త ఆటగాడు ఆడతాడా అనేది పిచ్ పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. శ్రీలంకలో పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో, టీమ్ ఇండియా అర్ష్‌దీప్‌ను పక్కనపెట్టి, అదనపు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకుంది. ఇప్పటివరకు జరిగిన మ్యాచ్‌లు జస్ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా ఇద్దరు ప్రధాన పేసర్ల పాత్ర పోషిస్తున్నారని స్పష్టంగా చూపించాయి. భారత్ మొదటి సూపర్ 8 మ్యాచ్ నరేంద్ర మోడీ స్టేడియంలో జరుగుతుంది, కానీ రెండో మ్యాచ్ చెన్నైలో జరుగుతుంది. ఇక్కడ స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుంది. భారత జట్టులోకి అర్ష్‌దీప్‌ను డ్రాప్ చేసి అదనపు స్పిన్నర్‌ను జట్టులోకి తీసుకుంటే ఆశ్చర్యం లేదు.

# స్పోర్ట్స్



## అంతర్జాతీయ క్రికెట్‌కు నవనీత్ ధలివాల్ గుడ్‌బై!

టీ20 ప్రపంచ కప్ 2026లో గ్రూప్ దశ ముగియడంతో అనేక జట్ల ప్రయాణం ముగిసింది. ఈ క్రమంలో కెనడా క్రికెట్ చరిత్రలో మోస్ట్ సక్సెస్‌ఫుల్ క్రికెటర్, మాజీ కెప్టెన్ నవనీత్ ధలివాల్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. గురువారం చెన్నైలోని చెపాక్ స్టేడియంలో ఆఫ్ఘనిస్థాన్ జట్టుతో జరిగిన చివరి గ్రూప్ మ్యాచ్ తర్వాత ఆయన తన 11 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికాడు.37 ఏళ్ల నవనీత్ ధలివాల్ కెనడా తరఫున టీ20 అంతర్జాతీయ క్రికెట్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. తన కెరీర్లో 48 టీ20 మ్యాచ్‌ల్లో 1305 పరుగులు సాధించాడు. కేవలం బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా ఆయన జట్టును సమర్థవంతంగా నడిపించాడు. ఆయన నాయకత్వంలో కెనడా 29 టీ20ల్లో ఏకంగా 21 విజయాలను అందుకోవడం విశేషం.రిటైర్మెంట్ సందర్భంగా నవనీత్ ధలివాల్ తన కెరీర్‌లోని మధుర క్షణాలను గుర్తు చేసుకున్నారు. “2024 టీ20 ప్రపంచకప్‌కు తొలిసారి అర్హత సాధించడం, ఆ టోర్నీ ప్రారంభ మ్యాచ్‌లోనే (అమెరికాపై) 61 పరుగులతో రాణించడం నా జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని గర్వకారణమైన క్షణాలు” అని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత 2026 ప్రపంచకప్‌లో కూడా దక్షిణాఫ్రికాపై 64 పరుగులతో వీరోచిత ఇన్నింగ్స్ ఆడి అందరి దృష్టిని ఆకర్షించారు.నవనీత్ ధలివాల్ అసలు ఊరు పంజాబ్‌లోని మొహాలీ. అక్కడే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్న నవనీత్ ధలివాల్.. ఆ తర్వాత కెనడాకు వెళ్లారు. రిటైర్మెంట్ సందర్భంగా ఆయన ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నాడు. టీమిండియా స్టార్ ఆటగాడు శుభ్‌మన్ గిల్ చిన్న వయసులో ఉన్నప్పుడు.. గిల్ తండ్రి కోరిక మేరకు ధలివాల్ అతనికి బౌలింగ్ చేసి ప్రాక్టీస్ చేయించేవారట. ఆ రోజుల్లోనే గిల్ టెక్నిక్ చూసి తాను ఆశ్చర్యపోయానని ఆయన గుర్తు చేసుకున్నారు.క్రికెట్ మైదానం వీడినా, ఈ క్రీడతో తనకున్న బంధాన్ని నవనీత్ ధలివాల్ కొనసాగించనున్నాడు. కెనడాలో అట్టడుగు స్థాయిలో యువ క్రికెటర్లను తీర్చిదిద్దేందుకు కోచింగ్ వైపు వెళ్తానని ఆయన ప్రకటించాడు. 19 ఏళ్ల యువ ఆటగాడు యువరాజ్ సామ్రా వంటి వారు న్యూజిలాండ్‌పై సెంచరీ బాదడం చూస్తుంటే కెనడా క్రికెట్ భవిష్యత్తు ఉజ్వలంగా ఉందని తాను నమ్ముతున్నట్లు ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కెనడా క్రికెట్‌ను ప్రపంచ వేదికపై నిలబెట్టిన నవనీత్ ధలివాల్ రిటైర్మెంట్ ఆ జట్టుకు పెద్ద లోటే. మరి ఆయన కోచ్‌గా కెనడాకు ఎలాంటి నూతన తరాన్ని అందిస్తారో చూడాలి.



## భారత్ సెమీస్ చేరదు

### పగటి కలలు కంటున్న పాక్ క్రికెటర్!

టీ20 వరల్డ్ కప్ 2026 కీలక దశకు చేరుకుంది. లీగ్ దశ ముగిసి సూపర్-8 సమరానికి తెరలేస్తున్న వేళ మైదానంలో ఆట కంటే ముందే మైండ్ గేమ్స్ మొదలయ్యాయి. చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌కు చెందిన మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ టీమిండియాపై చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో కార్చిచ్చు రేపుతున్నాయి. టీమిండియా సెమీఫైనల్‌కు చేరే అవకాశమే లేదంటూ ఆయన చేసిన జోస్యంపై క్రికెట్ అభిమానులు తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు.లీగ్ దశలో టీమిండియా అజేయంగా నిలిచినప్పటికీ.. మహ్మద్ ఆమిర్ మాత్రం భారత బ్యాటింగ్ వైఫల్యాలనే ప్రధానంగా ప్రస్తావించారు. పాకిస్థాన్‌తో జరిగిన హై-వోల్టేజ్ మ్యాచ్‌లో మినహా, మిగిలిన లీగ్ మ్యాచ్‌ల్లో భారత టాపార్డర్ తడబడిందని ఆయన విమర్శించారు. అమెరికా, నమీబియా వంటి జట్లతో ఆడినప్పుడు కూడా బ్యాటింగ్ లైనప్ కుప్పకూలిందని.. ఇలాంటి ప్రదర్శనతో బలమైన జట్లు ఉండే సూపర్-8లో నెగ్గుకురావడం అసాధ్యమని ఆమిర్ అభిప్రాయపడ్డారు. “భారత్ సెమీస్ చేరదు.. ఇది రాసి పెట్టుకోండి” అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కసుతో కూడినవిగా కనిపిస్తున్నాయి.మహ్మద్ ఆమిర్ తన విశ్లేషణలో టీమిండియాను పక్కన పెట్టి, ఇతర జట్లకు ప్రాధాన్యత ఇచ్చారు. ప్రస్తుతం ఉన్న ఫామ్ ప్రకారం దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ జట్లు అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఏ జట్టునైనా ఓడించే సత్తా ఈ రెండు జట్లకు ఉందని, గ్రూప్-1 నుంచి ఇవే సెమీస్‌కు వెళ్తాయని జోస్యం చెప్పారు. 2024 డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ కంటే, ఈ జట్లే నిలకడగా ఉన్నాయని అమీర్ వాదించడం గమనార్హం.భారత్ తన సూపర్-8 ప్రయాణంలో దక్షిణాఫ్రికా, వెస్టిండీస్ వంటి బలమైన జట్లను ఎదుర్కోవాల్సి ఉంది. మరోవైపు పాకిస్థాన్ తన గ్రూపులో న్యూజిలాండ్, ఇంగ్లాండ్ వంటి జట్లతో తలపడనుంది. లీగ్ దశలో పాక్‌పై ఘనవిజయం సాధించిన ఉత్సాహంలో ఉన్న టీమిండియా, మహ్మద్ ఆమిర్ కామెంట్స్‌ను పక్కన పెట్టి మైదానంలో సమాధానం చెప్పాలని కసిగా ఉంది. మహ్మద్ ఆమిర్ వ్యాఖ్యలపై భారత క్రికెట్ అభిమానులు సోషల్ మీడియా వేదికగా గట్టి కౌంటర్లు ఇస్తున్నారు. “ముందు మీ జట్టు సంగతి చూసుకోండి” అంటూ ఎద్దేవా చేస్తున్నారు. 2024 వరల్డ్ కప్ గెలిచినప్పటి నుంచి టీమిండియా వరుస విజయాలతో దూసుకుపోతోందని, పాక్ మాజీ క్రికెటర్ మహ్మద్ ఆమిర్ కేవలం అసూయతోనే ఇలా మాట్లాడుతున్నారని మండిపడుతున్నారు. ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీలో డిఫెండింగ్ ఛాంపియన్‌ను తక్కువ అంచనా వేయడం అమీర్ అవివేకమని ఫ్యాన్స్ హెచ్చరిస్తున్నారు.





## పెద్ద జట్లకు జింబాబ్వే వార్నింగ్ బెల్స్!

క్రికెట్?లో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఒకప్పుడు పసికూనగా భావించిన జట్టు ఏకంగా ప్రపంచ విజేతలకే చుక్కలు చూపిస్తుంటే ఆ కిక్కే వేరుగా ఉంటుంది. ప్రస్తుత టీ20 వరల్డ్ కప్‌లో సరిగ్గా ఇదే సీన్ రిపీట్ అవుతోంది. గ్రూప్ స్టేజ్ మ్యాచులు మొదలైనప్పుడు జింబాబ్వే జట్టు సూపర్ 8కి వెళ్తుందని ఎవరు కూడా అంచనా వేసి ఉండరు. కానీ ఎవరి అంచనాలకు అందకుండా ఆ జట్టు అత్యుత్తమ క్రికెట్ ఆడుతూ సూపర్ 8కు దూసుకెళ్లింది. ఈ టోర్నీలో జింబాబ్వే జట్టు చూపించిన కసి, పోరాట పటిమ చూస్తుంటే ఇప్పుడు పెద్ద జట్లకు కూడా వణుకు మొదలైంది. అంతా అయిపోయింది! అనుకున్న కథను మళ్లీ మొదటి నుంచి రాస్తూ, సరికొత్త రికార్డులతో దూసుకుపోతున్న ఆ జట్టు ప్రస్థానం ఇప్పుడు క్రీడా ప్రపంచంలో హాట్ టాపిక్‌గా మారింది. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో గత కొన్ని ఏళ్లు చాలా ఇబ్బందికరంగా సాగాయి. ముఖ్యంగా 2024 టీ20 వరల్డ్ కప్?కు కనీసం అర్హత కూడా సాధించలేకపోవడం ఆ జట్టు అభిమానులను తీవ్రంగా కలిచివేసింది. టీమ్ మేనేజ్?మెంట్?లో సరైన ప్రణాళికలు లేకపోవడం, జింబాబ్వే క్రికెట్ బోర్డులో చోటు చేసుకున్న కొన్ని ఆర్థిక పరమైన ఆరోపణలు జట్టు పర్ఫార్మెన్స్?పై భారీ ప్రభావాన్ని చూపాయి. సరైన వనరులు లేక, ఆటగాళ్ల మధ్య సమన్వయం కుదరక ఆ జట్టు ఒక దశలో పతనానికి చేరువైంది. కానీ ఆ ఒడుదొడుకుల నుంచి గుణపాఠం నేర్చుకున్న బోర్డు, తన వ్యూహాలను పూర్తిగా మార్చేసింది. పక్కా ప్రణాళికలతో ఆటగాళ్లలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, ఈసారి వరల్డ్ కప్?కు అర్హత సాధించింది. అంతేకాకుండా ఈసారి టోర్నీ?లో ఎలాగైనా తమ సత్తా చాటాలని పట్టుదలతో బరిలోకి దిగింది.ఈసారి గ్రూప్ స్టేజ్?లో జింబాబ్వే ఆట తీరు చూస్తుంటే ప్రతి మూమెంట్?లోనూ గెలుపు కోసమే ఆడుతున్నట్లు అనిపించింది. గ్రూప్ దీలో బలమైన ప్రత్యర్థిగా ఉన్న ఆస్ట్రేలియా జట్టుకే దిమ్మతిరిగే స్ట్రోక్ ఇచ్చింది. ఆసీస్ లాంటి దిగ్గజ జట్టును ఓడించి టోర్నీ నుంచి ఇంటికి పంపడంలో జింబాబ్వే కీలక పాత్ర పోషించింది. అదేదో గాలివాటానికి వచ్చిన విజయం అనుకునేలోపే శ్రీలంకను చిత్తు చేసి మరో సంచలనం సృష్టించింది.శ్రీలంక జట్టు మంచి ఫామ్?లో ఉండటమే కాకుండా తమ సొంత గడ్డపై ఆడుతున్నా, జింబాబ్వే ఏ మాత్రం వెనక్కి తగ్గలేదు. ఇటీవల చివరి గ్రూప్ స్టేజ్ మ్యాచ్?లో లంక నిర్దేశించిన 179 పరుగుల భారీ లక్ష్యాన్ని 19.3 ఓవర్లలోనే ఛేదించి 6 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ వరుస విజయాలతో గ్రూప్? బీ లో ఒక్క ఓటమి కూడా లేకుండా టేబుల్ టాపర్?గా నిలిచి సూపర్ 8 దశకు సగర్వంగా దూసుకెళ్లింది. ఈ విజయాల్లో జింబాబ్వే కీలక ఆటగాళ్ల పాత్ర ఎంతో ఉంది. బ్యాటింగ్?లో బ్రయాన్ బెన్నెట్ నిలకడగా రానిస్తూ జట్టుకు వెన్నెముకలా నిలుస్తున్నాడు. శ్రీలంకతో జరిగిన మ్యాచులో 63 పరుగులతో కీలక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. ఇక కెప్టెన్ సికందర్ రజా తన అనుభవంతో బ్యాటింగ్, బౌలింగ్?లో రాణిస్తూ లంకపై 45 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. బౌలింగ్ విభాగంలో బ్లెస్సింగ్ ముజర్బాని నిప్పులు చెరిగే బంతులతో ప్రత్యర్థులను వణికిస్తున్నాడు. శ్రీలంకపై కూడా ముజర్బాని 2 వికెట్లు తీసి తన సత్తా చాటారు. బ్రాడ్ ఎవాన్స్, రిచర్డ్ నగరావ వంటి బౌలర్లు కూడా పరిస్థితిని బట్టి వికెట్లు తీస్తూ ప్రత్యర్థి టీమ్స్ ని కట్టడి చేస్తున్నారు. ఇప్పుడు టాప్ జట్లతో సూపర్ - 8 లో జింబాబ్వేకు అసలైన పరీక్ష ఎదురుకాబోతోంది. అయితే ఆ జట్టును ఇప్పుడు ఏ టీమ్ కూడా తక్కువ అంచనా వేసే పరిస్థితి లేదు. గ్రూప్ స్టేజ్?లో ప్రదర్శించిన పోరాట పటిమతో జింబాబ్వే ఇప్పుడు ఇతర జట్లకు వార్నింగ్ బెల్స్ మోగించింది. సూపర్ 8లో జింబాబ్వేతో తలపడనున్న టీమ్ఇండియా, సౌతాఫ్రికా, వెస్టిండీస్ వంటి జట్లు చాలా సీరియస్ గా ప్లాన్ చేసుకుంటున్నాయి. తడబడకుండా ఆడుతున్న జింబాబ్వే ఇప్పుడు టోర్నీలో మోస్ట్ డేంజరస్ టీమ్?గా మారిపోయింది. సెమీస్ బెర్త్ కోసం జరిగే పోరులో జింబాబ్వే ఏ పెద్ద జట్టును ఇంటికి పంపిస్తుందో అని అందరూ ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఈ మూడు మ్యాచుల్లో జింబాబ్వే గనుక తమ ఫామ్‌ను కొనసాగిస్తే సెమీ ఫైనల్స్‌కు చేరి కొత్త రికార్డు సృష్టించడం ఖాయం. ఏదేమైనా జింబాబ్వే ప్రయాణం ఈ వరల్డ్ కప్‌కే హైలైట్‌గా నిలిచింది.

# సికిందర్ రజా అరుదైన ఘనత!

క్రికెట్?లో వయసు అనేది కేవలం ఒక నెంబరే అని మరోసారి నిరూపించాడు జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా. ఈ టీ20 వరల్డ్?కప్?లో ఆడుతున్న రజా జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. గురువారం శ్రీలంకతో మ్యాచ్?లోనూ రజా అత్యుత్తమ ఇన్నింగ్స్?లో చెలరేగిపోయాడు. తుఫాన్ ఇన్నింగ్స్?తో తమ జట్టుకు విజయం అందించాడు. ఈ క్రమంలో టీమ్ఇండియా స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ రికార్డను రజా బ్రేక్ చేశాడు.కాగా, ఈ మ్యాచ్?లో రజా 26 బంతుల్లోనే 45 పరుగులు బాదాడు. 4 సిక్సర్లు, 2 ఫోర్లు ఉన్నాయి. కీలకమైన దశలో బ్రియాన్ బెన్నెట్?తో కలిసి 65 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. దీంతో అతడికి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది. అయితే ఈ అవార్డును అందుకోవడం ద్వారా సికందర్ రజా కొత్త రికార్డును సృష్టించాడు. నిన్నటికి సికిందర్ రజా వయసు 39 సంవత్సరాల 301 రోజులు. దీంతో ఓకెప్టెన్?గా ×జజ టోర్నమెంట్‌లో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డును గెలుచుకున్న అతి పెద్ద వయస్కుడిగా రజా రికార్డు కొట్టాడు. ఇదివరకు ఈ రికార్డ్ భారత్ మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ పేరిట ఉండేది. అతడు 2025 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్?లో న్యూజిలాండ్?పై విన్నింగ్ ఇన్నింగ్స్? ఆడి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. అప్పటికి హిట్?మ్యాన్ వయసు 37 సంవత్సరాల 331 రోజులు. తాజాగా రజా ఈ రికార్డ్?ను బ్రేక్ చేశాడు. రోహిత్‌ను మాత్రమే కాకుండా సికందర్ పాకిస్థాన్ మాజీ క్రికెటర్ షోయబ్ మాలిక్‌ను కూడా అధిగమించాడు. టీ 20 ప్రపంచ కప్ చరిత్రలో 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు గెలుచుకున్న రెండో పెద్ద వయస్కుడిగా నిలిచాడు. ఈ జాబితాలో రజా కంటే శ్రీలంక మాజీ స్టార్ క్రికెటర్ సనత్ జయసూర్య (39 సంవత్సరాల 345 రోజులు) మాత్రమే ముందున్నాడు. ఇక మ్యాచ్ విషయానికొస్తే, శ్రీలంకతో జరిగిన ఈ మ్యాచ్?లో జింబాబ్వే 6 వికెట్ల తేడాతో నెగ్గింది. 179 పరుగుల లక్ష్యాన్ని 19.3 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి ఛేదించింది. బ్రియాన్ బెన్నెట్ (59 పరుగులులి), సికిందర్ రజా (45 పరుగులు) అద్భుతంగా ఆడారు. శ్రీలంక బౌలర్లలో డాసన్ హేమంత 2, డాసన్ షనక, దునిత్ వెల్లలాగే చెరో 1 వికెట్ దక్కించుకున్నారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 178 పరుగులు చేసింది. ఓపెనర్ పాథుమ్ నిస్సంక (62 పరుగులు) హాఫ్ సెంచరీతో అలరించగా, పవన్ రత్నాయకే (44 పరుగులు) రాణించాడు. జింబాబ్వే బౌలర్లలో బ్లెస్సింగ్ ముజర్బాని, బ్రాడ్ ఇవాన్స్, గ్రీమీ క్రీమర్ తలో 2, ర్యాన్ బర్ల్ 1 వికెట్ పడగొట్టారు.



## విశ్వజి

# అతిగా నిద్రిస్తున్నారా? అయితే ఈ రోగాలకు వెల్కమ్ చెప్పినట్టే



అధిక నిద్ర.. ఇది పెద్ద అనారోగ్య సమస్య. దీర్ఘకాలిక ఆరోగ్య పరిస్థితులతో అతి నిద్రకు అవినాభావ సంబంధం ఉంది. అధిక నిద్ర మధుమేహం మరియు రక్తపోటు సమస్యలను పెంచుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఎక్కువ నిద్రపోయిన, కావలసినంత నిద్ర పోకపోయినా కూడా అనారోగ్యం వెంటాడుతోందని హెచ్చరిస్తున్నారు. అతి నిద్రతో అనారోగ్య సమస్యలు చాలామంది ఎక్కువ సేపు నిద్ర పోవటం మంచిదని భావించి తరచూ నిద్ర పోవటంపైనే శ్రద్ధ చూపిస్తారు. నిద్ర అవసరం అయినప్పటికీ, ఎక్కువగా నిద్ర పోవటం హానికరంగా ఉండవచ్చు. ఈ ప్రమాదాలను నివారించడానికి నిపుణులు సరైన నిద్ర షెడ్యూల్ అలవాటు చేసుకోవాలని సూచిస్తున్నారు. అతి నిద్ర తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని పరిశోధనలు చూపుతున్నాయి.

అతి నిద్రతో మధుమేహం, రక్తపోటు సమస్యలు మధుమేహం మరియు రక్తపోటు సమస్యలు అతిగా నిద్రపోయే వారిలో కచ్చితంగా వచ్చే అవకాశం ఉంది. ఈ వ్యాధులు భారతదేశంలో లక్షలాది మందిని ప్రభావితం చేస్తూ మన ఆరోగ్యాన్ని సవాల్ చేస్తున్నాయి. ప్రతీరోజూ ఏడు నుండి ఎనిమిది గంటల పాటు నిద్ర పోతే మంచిది కానీ ఎప్పటికీ తొమ్మిది గంటల కంటే ఎక్కువగా నిద్రించడం సమస్యలకు హేతువుగా మారుతుంది.

అధిక నిద్రతో మెటబాలిక్ మార్పులు ఈ నమూనా శరీరంలోని సహజ రిథమ్స్‌ను భంగం చేస్తుంది, మెటబాలిక్ మార్పులకు దారితీస్తుంది. ఇటువంటి అంతరాయాలు దీర్ఘకాలిక వ్యాధులను అభివృద్ధి చేసే ప్రమాదాన్ని పెంచుతాయి. అందుకే ఆరోగ్య నిపుణులు ఎక్కువగా నిద్ర పోకూడదని, రాత్రికి ఏడు నుండి ఎనిమిది గంటల నిద్రను లక్ష్యంగా పెట్టుకోవాలని సలహా ఇస్తున్నారు. ఈ పరిధి ఆప్టిమల్ ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది.

నిద్ర విషయంలో స్థిరమైన సమయం పైన దృష్టి దీర్ఘకాలిక అనారోగ్య పరిస్థితుల సంభావ్యతను తగ్గిస్తుంది. క్రమబద్ధంగా నిద్ర అలవాటు మొత్తం శ్రేయస్సు మరియు శక్తి స్థాయిలను మెరుగుపరుస్తుంది. అధిక నిద్రను ఎదుర్కోవడం జీవనశైలి మార్పులను కలిగి ఉంటుంది. కనుక వ్యక్తులు స్థిరమైన సమయం పైన దృష్టి పెట్టాలి. పడుకునే ముందు స్క్రీన్ సమయాన్ని పరిమితం చేయడం, పడుకునే ముందు మనసుకు ఆహ్లాదం కలిగించే సంగీతాన్ని ఆస్వాదించటం వంటి చర్యలు సౌకర్యవంతమైన నిద్ర వాతావరణాన్ని నిర్ధారిస్తాయి. కనుక నిద్రను కూడా ఒక క్రమ పద్ధతిలో పోవటానికి ప్రాధాన్యతను ఇవ్వాలి.



# బీట్ రూట్ మార్చండి!

ఆడవాళ్లలో రక్త వృద్ధికి సూచించే కూరగాయల్లో మొదటి స్థానంలో ఉంటుంది బీట్‌రూట్. అలాగని దాన్ని కీరా, క్యారెట్లలాగా అమాంతం తినడం అంత సులభం ఏం కాదు. అలాగని విటమిన్-సి తో పాటు ఐరన్, ఫోలేట్‌లాంటి ఎన్నో పోషకాలు ఉండే దీన్ని వదిలేయడమూ మంచి విషయమేం కాదు. అందుకే ఈ దుంపను సులభంగా ఆహారంలో భాగం చేసుకునే మార్గాలు చూద్దాం. సలాడ్లు తినేప్పుడు బీట్‌రూట్‌ను తురిమి కలుపుకొని, దానితో పాటు చియా, అవిసెలాంటి గింజల్ని జోడించుకుంటే మరీ వెగటు రాకుండా పచ్చి బీట్‌రూట్‌ని తినొచ్చు. అలాగే నారింజ, ఆపిల్‌లాంటి పండ్లతో కలిపి జ్యూస్‌లా చేసుకుని తాగినా మరిన్ని పోషకాలు శరీరానికి అందుతాయి. కాస్త ఉడికించి మిక్సీ పడితే ఇడ్లీలు, దోశల పిండిలో కలుపుకొని లాగించొచ్చు. అలాగే కొబ్బరి తురుము, కొంచెం ఆవాలు, కరివేపాకు నూనెలో వేసి తరిగిన బీట్‌రూట్ ముక్కలు కూడా జోడించి స్టిర్‌ఫ్రై చేసి కూడా నేరుగా తినొచ్చు. పరాఠాల్లో స్టఫింగ్ కోసం ఆలూ బదులు బీట్‌రూట్ వాడొచ్చు.

# వ్యాక్స్ వద్దు..

ఇప్పుడు చాలామంది ముఖంపై అవాంఛిత రోమాలతో బాధపడుతున్నారు. హార్మోన్లలో లోపాలు, ఇతర ఆరోగ్య కారణాలతో.. ఈ సమస్యబారిన పడుతున్నారు. వీటిని తొలగించుకోవడానికి నానా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది 'వ్యాక్స్' చేయించుకుంటున్నారు. అయితే.. వ్యాక్సింగ్ అనేది అన్నివేళలా మంచిదికాదని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. చర్మ తత్వాన్ని బట్టి వ్యాక్సింగ్‌ను ఎంచుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం అనేక సౌందర్య ఉత్పత్తుల సంస్థలు 'వ్యాక్స్ స్ట్రిప్స్'ను అందిస్తున్నాయి. అయితే, ఇవి సున్నితమైన చర్మం ఉన్నవారిలో తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయట. వ్యాక్సింగ్ వల్ల చర్మంపై దద్దుర్లు రావడం, ఎర్రగా మారడం, ముడతలు పడటంతోపాటు చర్మం మరింత సున్నితంగా మారుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. తద్వారా ఎండలోకి వెళ్లినప్పుడు ముఖమంతా కందిపోవడం, ర్యాషెస్ వంటి సమస్యలు వస్తాయని చెబుతున్నారు. కాబట్టి బయట దొరికే ఫేషియల్ వ్యాక్స్, ఇంట్లో తయారుచేసుకున్న ప్యాక్స్ వేసుకునే ముందు.. చర్మ తత్వాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచిస్తున్నారు. దేన్నయినా ముఖంపై అప్లయి చేసుకునే ముందు ఓసారి ప్యాచ్ టెస్ట్ చేసుకోవడం మేలని సలహా ఇస్తున్నారు.



# ఆస్తమాతో అనర్థం!



ఆస్తమా.. మనదేశంలో అత్యంత ప్రబలంగా ఉన్న దీర్ఘకాలిక సమస్యల్లో ఒకటి. ఊపిరితిత్తులపై ప్రభావం చూపే ఈ మాయదారి వ్యాధి.. మహిళలకూ ఇబ్బందికరంగా పరిణమిస్తున్నది. ముఖ్యంగా, వారి పునరుత్పత్తిపై ప్రభావం చూపుతున్నది. సంతానోత్పత్తి తగ్గడం, గర్భధారణ సమస్యలకు కారణం అవుతున్నది. మనదేశంలో ఏటా 3.7 కోట్ల మంది ఉబ్బసం బారిన పడుతున్నారు. వారిలో.. నగర, నగర శివారు ప్రాంతాల్లో నివసించే మహిళలే ఎక్కువగా ఉంటున్నారు. సాధారణ మహిళలతో పోలిస్తే.. ఆస్తమా బాధితులు గర్భం దాల్చడంలో ఇబ్బంది పడుతున్నట్లు న్యూఢిల్లీలోని 'ఆల్‌ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' చెబుతున్నది. అంతర్జాతీయంగా నిర్వహించిన అనేక పరిశోధనలు కూడా ఇదే విషయాన్ని వెల్లడిస్తున్నాయి. ఉబ్బసం వ్యాధిగ్రస్తుల్లో తక్కువ ఆక్సిజన్ స్థాయులు, ఇన్‌ఫ్లమేషన్, ఇతర సమస్యలు.. పునరుత్పత్తి ప్రక్రియకు ప్రధాన అడ్డంకులుగా గుర్తించాయి. వీరిలో గైనిక్ సమస్యలు, అధిక ఒత్తిడి, నిద్రలేమి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. ఇవన్నీ.. వారు గర్భం దాల్చడాన్ని మరింత కష్టతరం చేస్తున్నాయి. ఉబ్బసం బాధితుల్లో పునరుత్పత్తి అవయవాలకు ఆక్సిజన్ ప్రవాహం తగ్గుతుందనీ, తద్వారా అండాల నాణ్యతతోపాటు గర్భాశయ ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుందని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ప్రధాన కారణాలను వివరిస్తూ.. మనదేశంలో ఆస్తమాను చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు. దగ్గు, శ్వాస ఆడకపోవడం వంటి లక్షణాలను సాధారణంగానే చూస్తారు. వైద్య సహాయం తీసుకోవడానికి ఇష్టపడరు. దోమల మందులు, అగరుబత్తీలు, వంటగదిలో వాయు కాలుష్యం వంటివి.. బాధితులను మరింత ఇబ్బంది పెడతాయి. ఈ క్రమంలో గర్భధారణ కోసం చూసే ఆస్తమా బాధితులు.. కొన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. కొందరు ఉబ్బసం నుంచి ఉపశమనం కలిగిన వెంటనే మందులను ఆపేస్తారు. అది ఏమాత్రం మంచిదికాదు. వైద్యులు సూచించినన్ని రోజులు మందులు వాడాల్సిందే! ఆస్తమా రోగుల్లో అలర్జీలకు కొన్ని ఆహార పదార్థాలు కారణం అవుతాయి. అలాంటి వాటిని పక్కన పెట్టడమే మంచిది. లేకుంటే.. అవి సమస్యను మరింత తీవ్రతరం చేస్తాయి. కాలుష్యం, పొగ, దుమ్ముకు దూరంగా ఉండాలి. బయటికి వెళ్లేటప్పుడు మాస్క్ ఉపయోగించాలి. ప్రాణాయామం లాంటి యోగాసనాలు ఊపిరితిత్తుల పనితీరును మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఒత్తిడి, ఆందోళనను తగ్గించడంలో ముందుంటాయి. కాబట్టి, యోగాను జీవితంలో భాగం చేసుకోవాలి.

## మార్కెట్

### చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. సోషల్ మీడియా ద్వారా యూజర్లు ఫిర్యాదు

ఓపెన్ ఏఐకి చెందిన చాట్‌బాట్ చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా భారత్ సహా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది యూజర్లు ఈ సమస్యను ఎదుర్కొన్నారు. చాట్‌బాట్‌ను ఓపెన్ చేస్తుంటే.. ఎర్రర్ మెసేజ్‌లు వస్తున్నాయి. చాట్ హిస్టరీ లోడ్ అవ్వట్లేదు. దీనిపై యూజర్లు సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు చేస్తున్నారు. డౌన్‌డిటెక్టర్ ప్రకారం.. భారత్ సహా ఉత్తర అమెరికా, ఐరోపా, ఆసియా దేశాల్లోని యూజర్లు ఈ సమస్యలు ఎదుర్కొన్నారు. దాదాపు 82 శాతం మంది యూజర్లు చాట్‌జీపీటీ సేవలు పొందలేకపోతున్నారు. మొబైల్ యాప్, వెబ్ రెండింటిలోనూ ఈ సమస్యను ఎదుర్కొన్నట్లు యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు. అంతేకాదు లాగిన్, నెట్‌వర్క్ ఎర్రర్, యాప్ సంబంధిత ఇతర సమస్యలు కూడా ఎదుర్కొంటున్నట్లు ఫిర్యాదు చేస్తున్నారు. తాజా సమస్యపై 'ఓపెన్‌ఏఐ (%ాజూవఅూ×%)' సంస్థ స్పందించింది. సమస్యను గుర్తించామని, దాన్ని పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. చాట్‌జీపీటీ రికార్డ్ మోడ్, సోరా, కోడెక్స్ వంటి సేవల్లో అంతరాయం ఉన్నట్లు తెలిపింది.



# క్రెడిట్‌కార్డులు తెగ వాడేస్తున్నారు..! తక్కువ వేతనాలు కారణమట..!

దేశంలో క్రెడిట్ కార్డుల వినియోగం భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది తొలి ప్రథమార్థంలో దేశవ్యాప్తంగా క్రెడిట్ కార్డుల ద్వారా జరిగిన లావాదేవీలు 15శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ గణాంకాలు చెప్పాయి. ఇ-కామర్స్, ఫుడ్ డెలివరీతో పాటు ఇతర అవసరాల కోసం క్రెడిట్‌కార్డుల వినియోగం పెరిగినట్లు భావిస్తున్నారు. బ్యాంకులు సైతం ఈఎంఐ ఆఫర్లు, క్యాష్‌బ్యాక్, రివార్డ్ పాయింట్ల పేరుతో ఆఫర్లు సైతం ఇస్తున్నాయి. తాజాగా ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. తక్కువ ఆదాయం ఉన్న వ్యక్తులు క్రెడిట్‌కార్డులపైనే ఎక్కువగా ఆధారపడుతున్నట్లు పేర్కొంది. థింక్ 360 ఏఐ అధ్యయనం ప్రకారం.. నెలకు రూ.50వేల కంటే తక్కువ జీతం ఉన్న వారిలో 93శాతం మంది క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లు చెప్పింది. అదే సమయంలో స్వయం ఉపాధి పొందుతున్న 85శాతం మంది సైతం క్రెడిట్‌కార్డులపై ఆధారపడుతున్నట్లుగా అధ్యయనం వెల్లడించింది. ఇప్పుడు పే తర్వాత (బీఎన్‌పీఎల్) సేవలను 18శాతం స్వయం ఉపాధి, వేతన జీవులు 15శాతం మంది ఉపయోగిస్తున్నట్లు డేటా పేర్కొంది. ఈ అధ్యయనం రూ.20వేల మంది ఉద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులపై నిర్వహించింది. ఈ సందర్భంగా థింక్ 360 ఏఐ ఫౌండర్, సీఈవో అమిత్ దాస్ మాట్లాడుతూ అభివృద్ధి చెందుతున్న భారతదేశ క్రెడిట్ ల్యాండ్ స్కేప్‌లో క్రెడిట్‌కార్డులు, బీఎన్‌పీఎల్ ఇప్పుడు వేతన




జీవులతో పాటు ఉపాధి పొందుతున్న వారికి ప్రతీ ఒక్కరికీ అవసరంగా మారాయన్నారు. పెరుగుతున్న ఫిన్ టెక్ కంపెనీలు డిజిటల్ లోన్ రెవల్యూషన్‌ను తీసుకువచ్చాయన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఈ కంపెనీలు రూ.92వేల కోట్లకుపైగా వ్యక్తిగత రుణాలు ఇచ్చాయి. ఇది మొత్తం రుణాల సంఖ్యలో 76శాతం ఉన్నట్లుగా సూచిస్తుందని పేర్కొన్నారు.

# లడ్డూ ప్రసాదంపై చంద్రబాబు దుర్మార్గాలు

## నెయ్యిలో జంతువుల కొవ్వు కలసిందని దుష్ప్రచారం

## మండలిలో చర్చకు ఎందుకు వెనక్కి పోయారు

## చంద్రబాబు లాగా షూస్ వేసుకుని ఫోటోలు పట్టుకోలే

## కూటమి నేతల తీరుపై మండిపడ్డ విపక్షనేత బొత్స



అమరావతి,ఫిబ్రవరి 20 : చంద్రబాబు దేవదేవుడి ప్రసాదంపై నిందారోపణలు చేశారని.. లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిందని తప్పుడు ప్రచారానికి దిగారని శాసనమండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. శుక్రవారం ఆయన శాసన మండలి మీడియా పాయింట్‌లో మాట్లాడుతూ.. తన స్వలాభం కోసం తమ సంస్థలకు నెయ్యి టెండర్లు ఇప్పించుకోవడం కోసం అసత్యాలు చెప్పారన్నారు. సీబీఐ ఇచ్చిన రిపోర్టులో చాలా విషయాలు బయటికి వచ్చాయని.. హెరిటేజ్‌తో ఒప్పందం చేసుకున్న ఇందాపూర్ డెయిరీ నెయ్యిని సరఫరా చేసింది. 2015-19 మధ్య కల్తీ నెయ్యిని సరఫరా చేసినందుకు ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఇందాపూర్‌ను బ్లాక్ లిస్ట్ నుంచి తప్పించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నాలుగు ట్యాంకర్లను వెనక్కి పంపారు. అవే ట్యాంకర్లను దాచి మళ్లీ వినియోగించారు. గోవిందా కూటమి నేతలకు ఇప్పటికైనా మంచి బుద్ధి ప్రసాదించాలని కోరాం. సభలో చర్చించమని కోరామని బొత్స సత్యనారాయణ పేర్కొన్నారు. సభలో టీడీపీ మంత్రులు అవాకులు, చవాకులు మాట్లాడారు. టీడీపీ నేతలకు కావాల్సింది స్వామివారి ఔన్నత్యం పెంచడం కాదు. కూటమి నేతలకు కావాల్సింది రాజకీయం. మీకు చిత్తశుద్ధి ఉంటే ఇప్పటికైనా చర్చకు రండి. చెప్పులు, బూట్లు వేసుకుని మేం దేవుడి ఫోటోలను పట్టుకుని ఉన్నట్లు నిరూపించండి. కెమెరాలు ఉన్నాయిగా మీకు వీలైతే ఆధారాలు చూపించండి. టీడీపీ నేతల వ్యాఖ్యలను మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. సభలో మేం ప్రదర్శించిన పేపర్లను నేనే స్వయంగా కలెక్ట్ చేసి టేబుల్ మీద పెట్టా. చంద్రబాబు లాగా మేం వేంకటేశ్వరస్వామి ఫోటోలను బూట్లు వేసుకుని పట్టుకోలేదు. వాళ్లలాగా మాది నీచబుద్ధి కాదు. దేవుడిని అవమానించారని ఊగిపోయిన జనసేన, బీజేపీ ఇప్పుడు ఏం సమాధానం చెబుతారు? చంద్రబాబు బూట్లు వేసుకుని దేవుడి ఫోటోను పట్టుకున్నది మీకు కనిపించడం లేదా?. మేం దేవుడి ఫోటోలను సభలో చెప్పులతో పట్టుకున్నట్లు నిరూపించండి. దేవుడి ఫోటోలను చించి, విసిరేశారని మాట్లాడుతున్నారు. మేం ఫోటోలను చించినట్లు రుజువు చేయండి. దేవుడిని రాజకీయాల్లోకి లాగింది చంద్రబాబు, పవన్, కూటమి నేతలు. దేనికి సభలో మంత్రులు ఊగిపోతున్నారని మండిపడ్డారు.

# పోలీస్ క్రీడలు ప్రారంభించిన మంత్రి అనిత

### పని ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయని వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి20 : అమరావతిలోని మంగళగిరి 6వ బెటాలియన్ ఏపీఎస్పీ వేదికగా జరిగిన రెండవ ఆల్ ఇండియా పోలీస్ సౌత్ జోన్ టి20 క్రికెట్ టోర్నమెంట్‌ను ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఇతర ఉన్నతాధికారులతో కలిసి రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరంతరం ప్రజా భద్రత కోసం 24 గంటలు శ్రమించే మన పోలీసు సోదరులకు మానసిక ఉల్లాసం మరియు ఐక్యతను పెంపొందించడానికి ఇటువంటి క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. సుమారు 6 రాష్ట్రాల నుండి వచ్చిన 10 జట్లకు శుభాకాంక్షలు తెలుపుతూ.. క్రీడల్లో గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తితో పాల్గొనడమే ముఖ్యమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మన అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్న తరుణంలో, ఇలాంటి జాతీయ స్థాయి క్రీడా కార్యక్రమాలు ఇక్కడ జరగడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఫిబ్రవరి 20 నుండి 24 వరకు ఈ టోర్నమెంట్ జరగనుంది.

# గోదావరి పుష్కరాలకు భారీగా ఏర్పాట్లు

### నది కాలుష్యం కాకుండా కాపాడుతాం

### అసెంబ్లీలో మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడి

అమరావతి,ఫిబ్రవరి20 : ఏపీ అసెంబ్లీ సమావేశాలుఏడో రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ప్రశ్నోత్తరాలను చేపట్టారు. గోదావరి పుష్కరాల సందర్భంగా నది కాలుష్యం జరగకుండా తీసుకునే చర్యలపై ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి నిమ్మల రామానాయుడు సమాధానమిచ్చారు. 2027 జూన్ 26 నుంచి జులై 7 వరకు 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలు జరుగనున్నాయని తెలిపారు. ఈ పుష్కరాల్లో నది పవిత్రతను కాపాడటం సహా కాలుష్యాన్ని నియంత్రించేలా ప్రభుత్వం నిబద్ధతతో వ్యవహరిస్తుందని అన్నారు. డ్రెయిన్లతో పాటు, పరిశ్రమల నుంచి వెలువడే కాలుష్యం వల్ల నదికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. భక్తుల రద్దీ పెరిగే అంచనాతో స్నాన ఘట్టాల సంఖ్యను పెంచామని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో నది కాలుష్యం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి సూచనలను కూడా పాటిస్తామని తెలిపారు. గోదావరి నది పవిత్రతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. కొన్ని చోట్ల జంతు కళేబరాలు, పౌల్ట్రీ వ్యర్థాలను నీటి వనరుల్లో కలిపేస్తున్నారని, ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముందని నిమ్మల రామానాయుడు అభిప్రాయపడ్డారు.

# మండలిలో వైసిపి మహాపచారం

### చెప్పులు, షూస్ వేసుకుని దేవుడి ఫొటోల ప్రదర్శన

### మండలి ఛైర్మన్ ఛాంబర్ ముందు కూటమి నేతల నిరసన

అమరావతి,ఫిబ్రవరి20 : ఏపీ శాసనమండలిలో వైకాపా సభ్యులు చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోలను ప్రదర్శించడాన్ని కూటమి సభ్యులు తీవ్రంగా ఖండించారు. ఛైర్మన్ ఛాంబర్ వద్ద మంత్రి లోకేశ్ నేతృత్వంలో ఎన్డీఏ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. వైకాపా చేసిన మహాపచారంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత, గొట్టిపాటి రవి, రామానాయుడు, కొల్లు రవీంద్ర, కూటమి ఎమ్మెల్సీలు నిరసనలో పాల్గొన్నారు. హిందు మతాన్ని అవమానించారని ఛైర్మన్‌కు మంత్రులు తెలిపారు. ఇలాంటి చర్యను ఛైర్మన్ ఎలా అంగీకరిస్తారని నిలదీశారు. వైకాపా చేసింది తప్పేనని మండలి ఛైర్మన్ మోషేన్ రాజు స్పష్టం చేశారు. వైకాపా సభ్యులను పిలిచి మాట్లాడతానని ఛైర్మన్ తెలిపారు. బహిరంగ క్షమాపణలు చెప్పించి లెంపలేసుకునేలా చేయాలని కూటమి సభ్యులు డిమాండ్ చేశారు. చట్టసభ సాక్షిగా వైకాపా సభ్యులు హిందువుల మనోభావాలు దెబ్బతీశారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ధ్వజమెత్తారు. హిందూ మతాన్ని రెచ్చగొట్టేలా వైకాపా ప్రవర్తించిందని మండిపడ్డారు. హద్దులు దాటి ప్రవర్తించి దేవదేవుడు పట్ల మహాపచారానికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలు ప్రవర్తించిన తీరు ఎంతో కలచివేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగటం తగదన్నారు. సంయమనం పాటించే కొద్దీ రెచ్చగొడుతున్నారని.. హిందువుల పట్ల వైకాపా విధానం ఇదేనా అని నిలదీశారు. వెంకటేశ్వర స్వామి పట్ల తమ పార్టీ విధానం ఇదేనని జగన్ చెప్తున్నారా..? అని ప్రశ్నించారు. హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పేవరకు విషయాన్ని వదిలిపెట్టమని హెచ్చరించారు. జగన్ డైరెక్షన్‌లోనే వైకాపా ఎమ్మెల్సీలు స్వామి వారిని తీవ్రంగా అవమానించారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మండిపడ్డారు. జనసేన ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణిస్తోందన్నారు. వెంకటేశ్వరస్వామి చిత్ర పటాన్ని నిర్లక్ష్యంగా విసిరేయడం తేలిగ్గా తీసుకునే విషయం కాదని ధ్వజమెత్తారు. జాతి క్షమించరాని నేరానికి వైకాపా సభ్యులు, జగన్ పాల్పడ్డారని భాజపా ఎమ్మెల్సీ సోము వీర్రాజు దుయ్యబట్టారు. సభ వాయిదా పడగానే వెంకటేశ్వరస్వామి చిత్రపటాలను ప్లకార్డులతో పాటు విసిరేసి వెళ్లారని ఆయన ఆరోపించారు. భారతజాతికి జగన్ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. వెంకటేశ్వరస్వామి అంటే ఇంత చులకన భావమేంటని మండిపడ్డారు.

# తొందరేమీ లేదు.. అన్నింటికీ మూల్యం తప్పదు

### తన ఇంటిపై దాడిని తీవ్రంగా ఖండించిన అంబటి

గుంటూరు,ఫిబ్రవరి20 : తొందరేమీ లేదు.. అన్నింటికి మూల్యం చెల్లించుకునే సమయం వస్తుందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పర్మిషన్ తీసుకునే నల్లపాడు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లాను. టీడీపీ నేతలు కర్రలు, రాడ్లు తీసుకుని నా కారు మీదకు వచ్చారు. టీడీపీ నేతలు కట్టిన ఫ్లెక్సీని చించలేదు. ఇది మంచి సాంప్రదాయం కాదని చెప్పా. గూండాలు 4 గంటల పాటు బీభత్సం సృష్టిస్తే పోలీసులు ఏం చేశారని అంటూ ఆయన ప్రశ్నించారు. పోలీసులు, గూండాలు ఏకమై దారుణంగా ఇంటిపై దాడి చేశారు. ఆ మాట అనడాన్ని నా అంతరాత్మ ఒప్పుకోలేదు.. నేను బాధపడ్డాను. టీడీపీ నేతలు తిడుతున్నారనే ఉద్దేశంతో మాట అన్నాను. బ్యాచ్‌లుగా బ్యాచ్‌లుగా నా ఇంటిపై దాడి చేశారు. ఇంట్లో నా పిల్లలు, నా మనవళ్లు ఉన్నారు. పోలీసులు సాక్షిగానే నా ఇంటి మీద దాడి చేశారు. నాలుగు గంటల పాటు నా ఇంటి మీద కరాళ నృత్యం చేశారు. పోలీసులు రక్షణ కల్పించలేక పారిపోండి అన్నారు. ఇదిలావుంటే అక్రమ కేసులో అరెస్ట్ అయ్యి.. బుధవారం బెయిల్‌పై విడుదలైన అంబటి రాంబాబు తాడేపల్లిలోని వైఎస్ జగన్ నివాసానికి వెళ్లి ఆయనను కలిశారు. తనపై టీడీపీ ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, టీడీపీ రౌడీ మూకలు తన ఇంటిని ధ్వంసం చేసిన తీరు, హత్యాయత్నం, పోలీసుల నిర్లిప్త వైఖరి, కొంతమంది పోలీసు అధికారుల అత్యుత్సాహం వంటి అంశాలను వైఎస్ జగన్‌కు వివరించారు. తప్పుడు కేసులపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చట్టపరంగా ఎదుర్కొందామని వైఎస్ జగన్ భరోసా ఇచ్చారు. అధికార పార్టీకి ఒత్తాసు పలుకుతూ వ్యవహరిస్తున్న కొంతమంది పోలీసు అధికారుల తీరును జగన్ తీవ్రంగా తప్పుబట్టారు. ప్రజల పక్షాన, ప్రజల తరుపున చేస్తున్న పోరాటంలో ఎదురయ్యే ఆటంకాలు, వేధింపులు ధీటుగా ఎదుర్కొని ప్రజలకు అండగా నిలుద్దామని, పార్టీ నాయకులు, క్యాడర్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఈ భేటీలో అంబటితో పాటు ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, మాజీ ఎంపీ నందిగం సురేష్, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాష్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

# హిందూపురంలో బాలయ్యకు నివాసం

### కొత్త ఇంటి నిర్మాణానికి భార్యతో కలసి శంకుస్థాపన

హిందూపురం,ఫిబ్రవరి20 : హిందూపురం శాసనసభ్యులు, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. శుక్రవారం సతీమణి వసుంధర దేవితో కలిసి ఎమ్మెల్యే బాలకృష్ణ సొంతింటి నిర్మాణం కోసం భూమి పూజ నిర్వహించారు. హిందూపురంలో హ్యాట్రిక్ విజయంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన నందమూరి బాలకృష్ణ ఇన్ని రోజులు ఇక్కడ అద్దె ఇంట్లోనే ఉంటున్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే బాలకృష్ణ హిందూపురంలో ఓ ఇంటి వాడవుతున్నారు. 2014, 2019, 2024 ఎన్నికల్లో వరుసగా గెలిచిన ఎమ్మెల్యే బాలకృష్ణ.. నియోజకవర్గ పర్యటనకు హైదరాబాద్ నుంచి వచ్చి వెళుతుంటారు. అయినా నియోజకవర్గ ప్రజలు కానీ, కార్యకర్తలు, అభిమానులు ఎమ్మెల్యే బాలకృష్ణ ఎప్పుడు హిందూపురం వచ్చిన అంతే ఉత్సాహంతో ఉంటున్నారు. ఇటీవల ప్రతిపక్ష నాయకులు ఎమ్మెల్యే బాలకృష్ణపై సంచలన ఆరోపణ చేశారు. హైదరాబాదులో ఉండే బాలకృష్ణ, హిందూపురంలో పరిపాలిస్తున్నారంటూ విమర్శించారు. వారు చేసిన కామెంట్స్ హిందూపురంలో ప్రకంపనలు పుట్టించాయి. ప్రత్యర్థులకు హిందూపురంలో తాను స్థానికుడిని కాదు అని చేస్తున్న వ్యాఖ్యలకు.. అవకాశం ఇవ్వకూడదని ఎమ్మెల్యే బాలకృష్ణ నిర్ణయించుకున్నారు. దీంతో హిందూపురం పట్టణంలో సొంతింటి నిర్మాణానికి సిద్ధమయ్యారు. హిందూపురం సమీపంలోని వన్నమ్మ కాలనీలో సర్వే నెంబర్ 445లో 81 సెంట్ల భూమిని ఎమ్మెల్యే బాలకృష్ణ కొనుగోలు చేశారు. ఆ స్థలంలో మూడంతస్తుల భవనంతో పాటు.. స్విమ్మింగ్ పూల్, ఆహ్లాదకరమైన ఉద్యానవనం, ఇతర సౌకర్యాలతో ఇంటి నిర్మాణం చేపడుతున్నట్లు సమాచారం. తమ అభిమాన నటుడు, హ్యాట్రిక్ విక్టరీ కొట్టిన ఎమ్మెల్యే బాలకృష్ణ కొత్త ఇల్లు ఎలా ఉంటుందో అని హిందూపురంలో ప్రతి ఒక్కరు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారం

### సిట్ నివేదికపై అధ్యయనానికి ఏకసభ్య కమిషన్

### ఎపి ప్రభుత్వం కీలక నిర్ణయం

అమరావతి,ఫిబ్రవరి 20 : తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ వ్యవహారం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీసిన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఘటనపై ఇప్పటికే సిట్ దర్యాప్తు పూర్తయ్యి నివేదిక సమర్పించిన నేపథ్యంలో.. ఆ నివేదికను సమగ్రంగా అధ్యయనం చేయడానికి ప్రభుత్వం ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేసింది. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం.. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి దినేశ్ కుమార్ అధ్యక్షతన ఈ ఏకసభ్య కమిటీని ఏపీ సర్కార్ నియమించింది. ఈ కమిటీ ప్రధాన బాధ్యత.. సిట్ నివేదికలో పేర్కొన్న అంశాలను పూర్తిగా పరిశీలించడం, దర్యాప్తులో బయటపడ్డ విషయాలను విశ్లేషించడం, అలాగే భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇవ్వడం. ప్రభుత్వం నిర్ణయించిన గడువు ప్రకారం, ఈ ఏకసభ్య కమిటీ 45 రోజుల్లోగా తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. సిట్ నివేదికలో ఉన్న అంశాలపై సమగ్ర అధ్యయనం చేసి, అవసరమైతే అదనపు వివరాలను సేకరించి.. బాధ్యులపై తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి స్పష్టమైన సిఫార్సులు చేయనుంది. తిరుమలలో శ్రీవారి లడ్డూ కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీకగా భావిస్తారు. అలాంటి పవిత్ర ప్రసాదం విషయంలో కల్తీ ఆరోపణలు రావడం భక్తుల్లో ఆందోళన కలిగించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసింది. సిట్ ఇప్పటికే లడ్డూ తయారీ ప్రక్రియ, ముడి సరుకుల సరఫరా, నాణ్యత నియంత్రణ వ్యవస్థ, సంబంధిత అధికారుల పాత్ర వంటి అంశాలపై విస్తృత విచారణ జరిపింది. ఆ నివేదిక ఆధారంగా ఇప్పుడు ఏకసభ్య కమిటీ మరింత సమగ్రంగా విశ్లేషణ చేయనుంది. ఈ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# జీవన్ రెడ్డి మర్యాదకు భంగం కలిగించకండి

### కాంగ్రెస్ అధిష్టానానికి జగ్గారెడ్డి వినతి

హైదరాబాద్,ఫిబ్రవరి 20 : కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ కష్ట కాలంలో పార్టీతో ఉన్న జీవన్ రెడ్డికి గౌరవం ఇచ్చే విధంగా పార్టీ హైకమాండ్ చొరవ తీసుకోవాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు.జగ్గారెడ్డి తాజాగా మాట్లాడుతూ..'కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా, నాయకుడిగా నా వ్యక్తిగత అభిప్రాయాన్ని రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు మీడియా ద్వారా తెలియజేస్తున్నా. జీవన్ రెడ్డికి ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చినా పరిస్థితులు అనుకూలించక ఓడిపోయారు. కాంగ్రెస్ పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా పార్టీలోనే ఉన్నాడు. రాజకీయంగా జీవన్ రెడ్డికి ఎన్నో ఆఫర్లు వచ్చినా కాంగ్రెస్‌తోనే ఉన్నారు. కష్ట కాలంలో పార్టీలో ఉన్న జీవన్ రెడ్డికి అవమానం జరగకుండా కాంగ్రెస్ పెద్దలు చొరవ చూపాలి. జీవన్ రెడ్డికి గౌరవం వచ్చే విధంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వారిని కోరుతున్నా అంటూ వ్యాఖ్యలు చేశారు. ఇదిలా ఉండగా.. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో, జీవన్‌రెడ్డిని ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే, ఫుడ్ పాయిజన్ అయిందని జీవన్ రెడ్డి కుటుంబ సభ్యులు వెల్లడించారు. నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్టు సమాచారం.

# తిరుమలకు నెయ్యి సరఫరాపై వైసిపి వాయిదా తీర్మానం

### చర్చ జరిగితేనే నిజాలు తెలుస్తాయన్న విపక్షనేత బొత్స

అమరావతి,ఫిబ్రవరి20 : మండలిలో వైఎస్సార్‌సీపీ వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. తిరుపతి లడ్డూ ప్రసాద అంశం, హెరిటేజ్ సంస్థకి అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ, టీటీడీకి నెయ్యి సరఫరా చేయడంపై సభలో చర్చించాలని కోరుతూ వాయిదా తీర్మానం చేశారు. శాసనమండలికి ర్యాలీ వచ్చిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు.. భోలే బాబా.. చంద్రబాబా.. చంద్రబాబా.. అలీబాబా అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేశారు. ఇందాపూర్, హెరిటేజ్ లింకులపై చర్చించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేసింది. శ్రీవారి లడ్డూపై చంద్రబాబు నిందలు మోపారని శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. దేవదేవుడి ధనాన్ని లూటీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. బాబు ప్రభుత్వం పెట్టిన డొల్ల బ్జడెట్‌పై చర్చ జరగాలని ఆయన డిమాండ్ చేశారు.

# పబ్జీ ఆడే జగన్‌కు క్రికెట్ గురించి ఏం తెలుసు

### హోంమంత్రి అనిత ఘాటు వ్యాఖ్యలు

అమరావతి,ఫిబ్రవరి20 : ఏపీ హోం మంత్రి అనిత అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. 'గణతంత్ర దినోత్సవం, స్వాతంత్య్ర దినోత్సవం నాడు జాతీయ జెండా ఎగరేయకుండా.. ప్యాలెస్‌లో పబ్జీ ఆడేవాళ్లకు క్రికెట్ మ్యాచ్ టీవీలో చూస్తే సరిపోతుందనే ఆలోచనలే వస్తాయి. భారత్ - పాకిస్థాన్ క్రికెట్ మ్యాచ్ అంటే ప్రతీ భారతీయుడు ఇండియా గెలవాలని కోరుకుంటాడు. టీమ్ ఇండియాను ప్రోత్సహించి, ఆ గెలుపులో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలనుకుంటారు. దేశ భక్తి, దేశం పట్ల గౌరవం ఉన్న ఎవరికైనా ఇది అర్థమవుతుంది. మంత్రి లోకేశ్ సొంత ఖర్చులతో మ్యాచ్ చూసేందుకు కొలొంబో వెళ్లారు. దేశాన్నే కించపరిచే జగన్‌కు దేశభక్తి గురించి చెప్పినా అర్థం కాదు' అని అనిత మండిపడ్డారు. ఆ రోజు ప్రజలంతా టీమ్‌ఇండియా గెలుపు చూస్తే.. వైకాపా వాళ్లు మాత్రమే లోకేశ్ విషయంలో తప్పులు చూశారని విమర్శించారు. ప్రజలు మాత్రం లోకేశ్‌లో దేశభక్తిని చూశారని పేర్కొన్నారు.

# ఏప్రిల్‌లో తెలంగాణలో సర్ ప్రక్రియ

### జిల్లాల అధికారులకు ఎన్నికల అధికారి సూచనలు

హైదరాబాద్,ఫిబ్రవరి 20 : ఏప్రిల్‌లో ప్రారంభం కానున్న ప్రత్యేక ఓటర్ల సమగ్ర సవరణ ఎస్‌ఐకు సంబంధించి సన్నాహకాలను వేగవంతం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి శిక్షణ కార్యక్రమాలను ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని సీఈవో కార్యాలయం నుంచి మెదక్, మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల సహాయ ఎన్నికల నమోదు అధికారులకు ఆన్‌లైన్ శిక్షణ నిర్వహించారు.మొత్తం 195 మంది ఏఈఆర్‌ఓలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఓటరు జాబితాల తయారీ, నవీకరణ, నిర్వహణ అంశాలపై విపులంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరు జాబితాల్లో చేర్చడం, అనర్హుల పేర్లను తొలగించడం, వివరాల సవరణ వంటి అంశాలపై స్పష్టమైన మార్గదర్శకాలు అందించారు. ౹ుాబోయే ఎస్‌ఐఆర్‌ను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సన్నాహకాలను సమయానికి పూర్తి చేయాలని సుదర్శన్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశర చేశారు. ఓటరు జాబితాల స్వచ్ఛతను కాపాడటంలో ఏఈఆర్‌ఓల పాత్ర అత్యంత కీలకమని ఆయన స్పష్టం చేశారు. న్నికల పక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాలు దోహదం చేస్తాయని అధికారులు తెలిపారు.

# చెప్పులు, షూస్‌తో వెళ్లారు..చూడండి

### అయితే సవాల్‌కు కట్టుబడి రాజీనామా చేయండి

### వైసిపి ఎమ్మెల్సీలకు మంత్రి గుమ్మడి సంధ్యారాణి సవాల్

అమరావతి,ఫిబ్రవరి20 : ఏపీ శాసనమండలిలో వైసీపీ సభ్యులు వేంకటేశ్వరుడి ఫొటోలు, ప్లకార్డులతో నిరసనకు దిగడం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. చెప్పులు, బూట్లతో దేవుడిని అవమానించారంటూ కూటమి సభ్యులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే చెప్పులు, బూట్లు వేసుకుని దేవుడి ఫొటోతో తాము సభలోకి వెళ్లినట్లు ఒక్క ఫోటో, వీడియో చూపించినా ఎమ్మెల్సీగా రాజీనామా చేస్తానంటూ వైసీపీ ఎమ్మెల్సీ మాధవరావు సవాల్ విసిరారు. ఈ ఛాలెంజ్‌పై వెంటనే స్పందించిన మంత్రి గుమ్మడి సంధ్యారాణి.. వైసీపీ సభ్యులు మండలిలో చెప్పులతో ఉన్న వీడియోను బయటపెట్టారు. ఎమ్మెల్సీగా రాజీనామా చేయాలని మాధవరావును మంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ.. వేంకటేశ్వరస్వామి ఫొటోలను.. ప్లకార్డుల తరహాలో వాడటం దుర్మార్గమని మండిపడ్డారు. స్వామి వారి ఫోటోను ఒకరు తలకిందులుగా పట్టుకున్నారని.. ఇంకొకరు నిరసన అవ్వగానే టేబుల్‌పై పడేశారని విమర్శించారు. దేనికోసం డిమాండ్ చేస్తున్నారో వారికే తెలియని పరిస్థితి అంటూ మంత్రి వ్యాఖ్యానించారు. వికృత చేష్టలతో స్వామి వారిని అవమానించిన తీరు.. మనసును కలచివేసేలా ఉందన్నారు. దేవుడి పట్ల భయం - భక్తి లేకుండా ప్రవర్తిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. పాలు లేకుండా నెయ్యి తయారు చేసిన తమ నాయకుడికి సన్మానం చేయాల్సింది పోయి.. నిందిస్తారా అంటూ వైసీపీ నేతలు మైండ్ లేకుండా మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు.



లయ్యారి చిత్రం



# అక్షయ్ భూత్‌బంగ్లాలో.. మిథిల

గ్లామర్‌కు నటనను జోడించి ఆకట్టుకునే హీరోయిన్ మిథిలా పాల్కర్. విష్వక్ సేన్ సరసన 'ఓరి దేవుడా' చిత్రం అనంతరం.. మూడేళ్ల విరామం తర్వాత ఆమె తెలుగులో నటి స్తున్న సిరీస్ 'సూపర్ సుబ్బు'. సందీప్ కిషన్ హీరోగా తెరకెక్కిన ఈ సిరీస్‌తో ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ వేదికగా త్వరలోనే తెలుగు ప్రేక్షకుల్ని పలకరించనుంది. తాజా గా ఆమె.. తాను నటించిన 'భూత్ బంగ్లా'లో నటించినట్లు వెల్లడించారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఈ సినిమా ప్రచారపర్వంలో భాగంగా అక్షయ్‌కి సంబంధించిన ఓ షోలో పాల్గొంది మిథిల. ఈ సందర్భంగా ఈ సినిమాలో ఆమె పాత్రను పరిచయం చేస్తూ అక్ష య్.. "మిథిల సోషల్ మీడియా ద్వారా తన ప్రయాణాన్ని మొదలుపెట్టి, ఇప్పుడు ఎన్నో చిత్రాలలో నటిస్తోంది. త్వరలో ఆమె నాకు బాగా తెలిసిన ఓ నటుడితో కలిసి నటిం చబో తుంది. అతనెవరో కాదు.. నేనే"అంటూ ప్రేక్షకులలో నవ్వులు పూయిస్తూ ఈ విషయా న్ని పంచుకున్నారు. అంతేకాదు ఆమె అద్భుతమైన నటి అని.. ఈ సినిమాలో తన సోదరి పాత్ర లో కనిపించనుందని అన్నారు. దర్శకుడు ప్రియదర్శన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఇప్పటి వరకూ టబు, వామికా గబ్బి, రాజ్‌పాల్ యాదవ్ నటిస్తున్నట్లే ప్రకటించింది చిత్రబృందం.



## స్పిరిట్ కోసం 40 కోట్లతో సెట్!

స్పిరిట్ షూటింగ్ అంతర్జాతీయ లోకే షన్స్లో జరుగుతోంది. ఇప్పటికే మెక్సి కోలో కొన్ని సన్నివేశాలు కూడా ప్లాన్ చేసాడు సందీప్ రెడ్డి వంగా. అయితే ఇది కాఫ్ స్టోరీ కావడంతో అవసరం మేర కొన్ని భారీ సెట్లు కూడా వేయిస్తున్నాడు. ఇప్పటికే పోలీస్ స్టేషన్ సెట్టింగ్స్ వేసి వాటిలో కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. ఈ నేపథ్యంలో తాజాగా మరో భారీ సెట్ వేయిం చడానికి రెడీ అవుతున్నట్లు తెలి సింది. ఇందులో కీలకమైన యాక్షన్ సన్నివేశాలు ప్లాన్ చేసాడట. దీనిలో భాగంగా ఈ సెట్ నిర్మాణం కోసం 40 కోట్ల వర కూ బట్జెట్ కేటాయిస్తున్నారుట. ప్రభాస్ పై కొన్ని హంటింగ్ సన్నివే శాలు చిత్రీకరిం చాల్సి ఉందట. దీనిలో భాగంగా ఔడ్ డోర్ లో షూ టింగ్ కష్టమవుతుందని భావించి సెట్ కు వెళ్తున్నట్లు తెలిసింది.



## చెప్పకూడని కథే కానీ..!

ప్రతినాయక పాత్రలతో వెండితెరపై.. మరోవైపు ఓటీటీ వేదికగా కూడా ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు బాలీవుడ్ నటుడు బాబీ దేఒల్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'బందర్'. దర్శకనిర్మాత అనురాగ్ కశ్యప్ తెరకెక్కించారు. నిఖిల్ ద్వివేది నిర్మించారు. గతేడాది టొరంటో చిత్రోత్సవంలో ప్రదర్శితమైన ఈ సినిమాకు సినీ ప్రియుల నుంచి మంచి స్పందన వచ్చింది. తాజాగా దీన్ని మే 22న థియేటర్లలోకి తీసుకురాబోతున్నట్లు తెలుపుతూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్టర్‌ను పంచుకున్నారు బాబీ దేఒల్. "చెప్పకూడని కథ. కానీ ప్రేక్షకులు కచ్చితంగా తెలుసుకోవాలి" అనే వ్యాఖ్యను జోడించారు. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో సన్యా మల్హోత్రా, రాజ్ బి.శెట్టి, జితేంద్ర జోషి తదితరులు నటించారు. ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో సమర్ అనే ఓ టీవీ స్టార్‌గా కనిపించనున్నారు బాబీ.



## ఆ పరిస్థితులే ఇప్పుడు సహాయపడ్డాయి

గతేడాది 'ఆంఖోన్ కీ గుస్తాఖియాన్' చిత్రంతో తొలిసారి తెరపై మెరిసింది సంజయ్ కపూర్ కుమార్తె, కథానాయిక శనయా కపూర్. దీని కన్నా ముందు ధర్మ ప్రొడక్షన్స్ రూపొందించిన 'బేధడక్'తో వెండితెరపై అడుగుపెట్టాల్సిన ఆమె.. కొన్ని కారణాలతో తన తొలి చిత్రం వాయిదా పడింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శనయా.. మొదటి ప్రాజెక్టు ఆగిపోవడం గురించి మాట్లాడుతూ.. అది తనపై ఎలాంటి ప్రభావం చూపలేదని అంటోంది. "ప్రతిదీ ఒక కారణం వల్లే జరుగుతుంది. ఇప్పుడు నేను వెనక్కి తిరిగి చూసుకుంటే ఆ అనుభవం నాకు సంతోషంగా ఉంది. ఆ పరిస్థితులే ఈ రోజు నన్ను నటిగా తీర్చిదిద్దుకోవడంలో సహాయపడ్డాయి. సినిమా వాయిదా పడటం, కొన్ని ప్రాజెక్టులు చిత్రీకరణ పూర్తయ్యి.. విడుదల కాకపోవడం లాంటి అంశా లు నాకెన్నో విషయాల్ని నేర్పాయి. మా నాన్న ఎప్పుడూ పరిస్థితుల కన్నా నా కళపై దృష్టి పెట్టమని ప్రోత్సహించేవారు. కెమెరా ముందు నటించే అవకాశం రాకపోతే.. ఒక సన్నివేశాన్ని ఎంచుకొని ప్రేక్షకుల ముందు ప్రదర్శించాలని చెప్పేవారు. కొన్ని విషయాలు నియంత్రణకు మించినవని, వాటి గురించి బాధపడటంలో అర్థం లేదని సలహా ఇచ్చారు. ఆయన సలహాలే పాటిస్తున్నా"అని చెప్పుకొచ్చింది శనయా.



## వారం ఆలస్యం... మృత్యుంజయ్

కథానాయకుడు శ్రీవిష్ణు 'మృత్యుంజయ్' సినిమా వాయిదా పడింది. ఈనెల 27నే తెరపైకి రావాల్సిన ఈ చిత్రాన్ని వారం ఆలస్యంగా మార్చి 6న ప్రేక్షకుల ముందుకు తీసుకు రాను న్నట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం కొత్త విడుదల తేదీతో కూడిన ప్రత్యేక పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. పాటలు, వినోదం లేకుండా సాగే అచ్చమైన క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. హుసేన్ షా కిరణ్ తెరకె క్కించారు. రెబా మోనికా జాన్ కీలక పాత్ర పోషించింది. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మించారు. ఇక మరోవైపు శ్రీవిష్ణు నటించిన మరో కొత్త సినిమా 'విష్ణు విన్యాసం' ఈనెల 28న విడుదల కానున్న సంగతి తెలిసిందే.

## తాప్సీని దూరం పెడుతున్న బాలీవుడ్?

కొన్నేళ్లగా బాలీవుడ్‌లో తాప్సీకి తగిన ఫలితం దక్కడం లేదు. సొంతంగా నిర్మాణ సంస్థను స్థాపించింది. క్రియేటివ్ కాన్సెప్ట్ లను నిర్మిస్తూ కొత్త వారికి అవకాశాలు బాగానే కల్పిస్తుంది. ఆ రకంగా అమ్మడిపై పాజిటివ్ ఇంప్రెషన్ ఉ ంది. కానీ ఏం లాభం నటిగా మాత్రం తాను చేరాలనుకున్న హైట్స్ మాత్రం చేరలేకపోతుంది. తెలుగు సినిమాల్లో ఇదే పరిస్థితి ఎదురైన క్రమలో కొంత నెగిటివిటీని కూడా వ్యక్తం చేసింది. ట్యాలెంట్ కు తగ్గ అవకాశాలు , పాత్రలు పడలేదని అంసంతృప్తిని వ్యక్తం చేసింది. తాజాగా అమ్మడు బాలీవుడ్ పై తీవ్రమైన అసంతృప్తితో ఉందని తెలుస్తోంది. తన మనసుకు నచ్చిన కథలు ఎన్నో ఉన్నా వాటిని తెరకెక్కించాలని ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నా ఎవరూ ముందుకు రావడం లేదని ఆరోపించింది. లేడీ ఓరియేంటెడ్ చిత్రాలైతే మరీ దారు ణమైన పరిస్థితుల్లో ఉ న్నాయంది. ఎంతో క్రియేటివిటీ ఉన్న కథలకు సరైన అవకాశం దక్కడం లేదంది.



## నా కెరీర్‌పై వారణాసి ప్రభావం: ప్రియాంక

'రాజమౌళికి ఉన్న విజన్ ఎవరికీ లేదు. ఆయనతో వర్క్ చేయడం చాలా ఎగ్జైటింగ్గా ఉ ంది. నా కెరీర్పై ఈ సినిమా ప్రభావం ఎక్కువగా ఉంటుందని నమ్ముతున్నాను. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలకు ఇది పూర్తిగా విభిన్నమైనది. ఇండియాలో ఉన్న అత్యుత్తమ దర్శకులలో రాజమౌళి ఒకరు. ఆయన విజనే వేరు. ఆయన సృష్టించే కథలు లార్జరెన్ లైఫ్ కంటే పెద్దవి. వారణాసి నా కెరీర్లోనే అత్యంత నిర్ణయాత్మక చిత్రంగా నిలిచిపోతుంది. ఈ సినిమా రిలీజ్ కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురు చూస్తున్నాను' అని ప్రియాంక చోప్రా చెప్పుకొచ్చింది. అంతే కాకుండా డైరెక్టర్ రాజమౌళి దార్శనితపై ప్రశంసల వర్షం కురిపించింది. ప్రస్తుతం ప్రియాంక చెప్పిన మాటల నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే సైన్స్ ఫిక్షన్కి మించి ఆధ్యాత్మికత, అడ్వెంచరస్ అంశాల నేపథ్యంలో ఈ మూవీని జక్కన్న అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. భారతీయ సినిమాల్లో నవ శకాన్ని లిఖించనున్న ఈ సినిమా రానున్న రోజుల్లో సరికొత్త రికార్డులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా చర్చకు తెరలేపుతుందనే కామెంట్లు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అంచనాలు తారా స్థాయిరి చేరిన ఈ మూవీని 2027, ఏప్రిల్లో ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrialp Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S). Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, PRGI.REGN.NO. APTEL/2003/11288, Gmail: ninadamnews@gmail.com,  CELL: +91 8333068787